ప్రజా కలం
Digital Editions
http://prajakalam.com
epaper.prajakalam.com
paperboy.com
www.magzter.com

epaper.prajakalam.in
www.prajakalam.in

# ప్రజా కలం

PRAJA KALAM Telugu Daily తెలుగు దినపత్రిక

Published From Nizamabad

PRGI No.TELTEL/2010/33275

ప్రజా కలం PRAJA KALAM Telugu Daily
Classifieds & Public Notice Advertising
5 Lines Rs.250 only
క్లాసిఫైడ్స్ సంప్రదించండి
9010972526

శనివారం | 08-08- 2026 | సంపుటి: 17, సంచిక: 126, నిజామాబాద్, పేజీలు: 12, వెల: 3/- | ◆ ఎడిటర్: కలకొండ రామకృష్ణ ◆

## ప్రత్యామ్నాయ పంటల సాగుతోనే

# రైతులకు భరోసా

**వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని వరి సాగును మరింత విస్తరించవద్దు**

రాష్ట్ర మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, జూపల్లి కృష్ణారావు

ఆగస్టు 15 నుంచి 1.05 కోట్ల కుటుంబాలకు తెలంగాణ స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

గత ప్రభుత్వంలో కొత్త రేషన్ కార్డులు ఇవ్వలేదు... ప్రస్తుతం 16 లక్షలకు పైగా కొత్త కార్డుల మంజూరు

మండల ప్రజావాణిని ప్రతి వారం తప్పనిసరిగా నిర్వహించి ప్రజల సమస్యలను స్థానికంగానే పరిష్కరించాలి

వనమహోత్సవం, చేయూత పెన్షన్లు, యూనిఫాం కుట్టు పనులను నిర్దేశిత గడువులో పూర్తి చేయాలి

జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన రాష్ట్ర మంత్రులు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి



హైదరాబాద్/మహబూబ్ నగర్ ప్రజాకలం, ఆగస్టు 7 : రాష్ట్రంలో రానున్న రోజుల్లో వర్షపాతం తక్కువగా ఉండే అవకాశాలు ఉన్నందున రైతులను నీటి అవసరం అధికంగా ఉండే వరి సాగుకు బదులుగా ప్రత్యామ్నాయ పంటల సాగు వైపు మళ్లించాలని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. శుక్రవారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక, యువజన సేవల శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన

తరువాయి 2వ పేజీలో...



## వందేమాతరం బిల్లుకు రాష్ట్రపతి ఆమోదం

- రాష్ట్రపతి ఆమోదంతో చట్టంగా మారిన బిల్లు
- వందేమాతరాన్ని అవమానిస్తే మూడేళ్ల జైలు, జరిమానా

న్యూఢిల్లీ, ఆగస్టు 7 : జాతీయ గీతంతో పాటు జాతీయ గీతికను (వందేమాతరం) కూడా పరిధిలోకి తీసుకువచ్చేలా 'జాతీయ గౌరవానికి అవమానాల నివారణ చట్టం, 1971'లోని శిక్షాత్మక నిబంధనల పరిధిని విస్తరించే 'జాతీయ గౌరవానికి అవమానాల నివారణ (సవరణ) చట్టం, 2026'కు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము( ఆమోద ముద్ర వేశారు. ప్రస్తుతం జరుగుతున్న వర్షాకాల సమావేశాల్లో పార్లమెంటు ఆమోదించిన ఈ సవరణ, 1971 నాటి చట్టంలోని సెక్షన్ 3 స్థానంలో కొత్త నిబంధనను ప్రవేశపెడుతుంది. సవరించిన నిబంధన ప్రకారం, జాతీయ గీతం లేదా జాతీయ గీతిక ఆలపించడాన్ని ఎవరైనా ఉద్దేశపూర్వకంగా అడ్డుకున్నా, అంతరాయం కలిగించినా, వారికి మూడేళ్ల వరకు జైలు శిక్ష లేదా జరిమానా లేదా ఈ రెండూ విధించబడతాయి. సవరణకు ముందు, సెక్షన్ 3 కేవలం జాతీయ గీతం ఆలపించడాన్ని ఉద్దేశపూర్వకంగా నిరోధించడాన్ని లేదా ఆలపిస్తున్న సభకు ఆటంకం కలిగించడాన్ని మాత్రమే నేరంగా పరిగణించేది. ఈ సవరణ అదే చట్టబద్ధమైన రక్షణను జాతీయ గీతానికి కూడా విస్తరింపజేసి, శిక్షా నిబంధనల ప్రయోజనాల దృష్ట్యా రెండింటినీ సమాన స్థాయికి తీసుకువస్తుంది. ఈ సవరణ నిర్దేశించిన శిక్షను మార్చదు. గరిష్ట శిక్షగా మూడేళ్ల వరకు జైలు శిక్ష, లేదా జరిమానా, లేదా రెండూ విధించే విధానం అలాగే కొనసాగుతుంది. ఈ ఏడాది ప్రారంభంలో, అధికారిక కార్యక్రమాలు, పాఠశాలల్లో జాతీయ గీతంతో పాటు 'వందేమాతరం'లోని మొత్తం ఆరు చరణాలను తప్పనిసరిగా ఆలపించాలని కేంద్ర ప్రభుత్వం ఒక సర్క్యులర్ జారీ చేసింది. 'వందేమాతరం'లోని కొన్ని చరణాలు దేవీదేవతల స్తుతిని కలిగి ఉండటంతో ఇది వివాదానికి దారితీసింది. కేంద్రం నిబంధనను సవాలు చేస్తూ సుప్రీంకోర్టులో ఒక పిటిషన్ దాఖలు చేశారు. అయితే, దానిని పాడనందుకు ఎటువంటి జరిమానా నిర్దేశించబడలేదని పేర్కొంటూ, ఈ ఏడాది మార్చిలో సుప్రీంకోర్టు ఆ పిటిషన్‌ను విచారణకు నిరాకరించింది. పాఠశాలల్లో వందేమాతరం చరణాలన్నింటినీ పాడటాన్ని కేంద్ర హోం మంత్రిత్వ శాఖ సర్క్యులర్ తప్పనిసరి చేయలేదని గమనిస్తూ, కర్ణాటక హైకోర్టు కూడా ఇలాంటిదే మరో పిటిషన్‌ను కొట్టివేసింది. కలకత్తా హైకోర్టు కూడా ఇలాంటిదే ఒక పిటిషన్‌ను విచారిస్తోంది. ఈ వ్యవహారానికి సంబంధించిన విచారణ సందర్భంగా, మదర్సాలలో ఆ పాటను పూర్తిగా పాడినంత మాత్రాన ఆకాశం ఊడిపడదని హైకోర్టు ఇటీవల వ్యాఖ్యానించింది.

## నాకంటే మొనగాడేం కాదు మీ ఎస్పీ..!



పదేళ్ల ఎమ్మెల్యేగా, విప్పు గా ఉన్నా నా ఫోనే ఎత్తాడా..?

నా వెనకాల లక్షలమంది ప్రజాబలం ఉంది నా సత్తా ఏంటో చూపిస్తా..

మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు

పండుగ సాయన్న విగ్రహ తొలగింపు వివాదంలో ముందస్తు అరెస్ట్

నాగర్ కర్నూల్, ఆగస్టు 7 (ప్రజాకలం) : మీ ఎస్పీ నాకంటే మొనగాడేం కాదు.. పదేళ్ల ఎమ్మెల్యేగా, ప్రభుత్వ విప్పుగా పని చేశా నా ఫోనే ఎత్తడా అంటూ అచ్చంపేట మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు ఫైర్ అయ్యారు. నాగర్ కర్నూల్ జిల్లా లింగాల మండల కేంద్రంలో పండుగ సాయన్న విగ్రహం తొలగింపు అంశంపై

తరువాయి 2వ పేజీలో...

## వాట్సాప్‌లో మీ సేవ సేవలు

**పేపర్‌లెస్ గవర్నెన్స్‌కు పెద్దపీట**

ఏఐ ట్రాన్స్ ఫర్మేషన్ కాన్ క్లేవ్ ప్రారంభించిన మంత్రి శ్రీధర్ బాబు

ఇంటి ముంగిటకే పౌరసేవలు,

20కిపైగా ప్రభుత్వ శాఖలు ఒకే తాటిపైకి తెచ్చేలా ఆర్ టీజీ డ్యాష్ బోర్డు




హైదరాబాద్, ఆగస్టు 7 (ప్రజాకలం) : తెలంగాణ ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుశుక్రవారం నాడు ఏఐ ట్రాన్స్ ఫర్మేషన్ కాన్ క్లేవ్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ... త్వరలో డిజిటల్ అసెంబ్లీ, డిజిటల్ కౌన్సిల్, బ్లాక్ చెయిన్ ఆధారిత సర్టిఫికేట్లు సేవలు ప్రారంభం కానున్నట్లు తెలిపారు. టీ- ఫైబర్‌తో 80 లక్షలకు పైగా గ్రామీణ కుటుంబాలకు డిజిటల్ కనెక్టివిటీ ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. త్వరలో వృద్ధులు, దివ్యాంగులకు

తరువాయి 2వ పేజీలో...

## భద్రాచలం-వాజేడు రహదారికి

# మోక్షం కల్పించండి

**వారం రోజుల్లో పనులు ప్రారంభం కాకపోతే కాంట్రాక్టర్‌ను మార్చాలి**

- ఏపీ ఆర్అండ్‌బి మంత్రికి మంత్రి తుమ్మల విజ్ఞప్తి
- 100 కి.మీ. ప్రయాణానికే మూడు గంటలు
- ప్రజల ఆవేదనకు స్పందించిన మంత్రి తుమ్మల



భద్రాచలం, ఆగస్టు 7 (ప్రజాకలం) : భద్రాచలం నుంచి వాజేడు వరకు అధ్వాన్నంగా మారిన రహదారికి తక్షణమే మోక్షం కల్పించాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆంధ్రప్రదేశ్ రోడ్లు-భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డిని కోరారు. శుక్రవారం ఈ మార్గంలో ప్రయాణించిన సందర్భంగా రహదారి దుస్థితిని చూసిన స్థానికులు మంత్రిని అడ్డుకుని తమ సమస్యలను వివరించారు. గతంలో మీరు ఆర్అండ్‌బీ మంత్రిగా ఉన్నప్పుడు ఈ రహదారి నిర్మాణం జరిగిందని, అనంతరం ఇప్పటివరకు ఎలాంటి మరమ్మతులు, అభివృద్ధి పనులు చేపట్టలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. కేవలం 100 కిలోమీటర్ల ప్రయాణానికే మూడు గంటల సమయం పడుతోందని, ఏళ్లుగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ప్రజలు తెలిపారు. ప్రజల సమస్యలను విన్న వెంటనే స్పందించిన మంత్రి తుమ్మల ఆంధ్రప్రదేశ్ ఆర్అండ్‌బీ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డికి,

తరువాయి 2వ పేజీలో...



## 2047 లక్ష్యాలకు యువత, పరిశోధన,

# ఆవిష్కరణలే చోదకశక్తి

**ప్రభుత్వ విద్య, వైద్యాన్ని బలోపేతం చేయడం ద్వారానే అసలైన లక్ష్యాలను చేరుకోవచ్చు**

గ్రామీణ భారతం అప్పుల ఊబి నుంచి బయటపడాలి

ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా ప్రజలు స్వయం సమృద్ధి సాధించాలి

పరిశోధన, ఆవిష్కరణలకు విశ్వవిద్యాలయాలు కేంద్రాలుగా ఎదగాలి

కన్హా శాంతి వనంలో "విజన్ ఇండియా-2047: ఇంటిగ్రేటింగ్ సైన్స్, ఇన్నోవేషన్ అండ్ యూత్ ఎంపవర్మెంట్" సదస్సులో మంత్రి జూపల్లి కృష్ణారావు

మహబూబ్ నగర్ ప్రజా కలం ప్రతినిధి ఆగస్టు 7: స్వాతంత్ర్య శతాబ్ది నాటికి భారత్‌ను అభివృద్ధి చెందిన, స్వావలంబన కలిగిన విజ్ఞాన దేశంగా తీర్చిదిద్దడంలో యువత, శాస్త్ర విజ్ఞానం, ఆవిష్కరణలే ప్రధాన చోదక శక్తులని పర్యాటక, సాంస్కృతిక, పురావస్తు, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. పాలమూరు విశ్వవిద్యాలయం - భారత ప్రభుత్వం విద్యా మంత్రిత్వ శాఖ సంయుక్తంగా నిర్వహిస్తున్న "విజన్ ఇండియా-2047: ఇంటిగ్రేటింగ్ సైన్స్, ఇన్నోవేషన్ అండ్ యూత్ ఎంపవర్మెంట్" రెండు రోజుల జాతీయ సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. స్వాతంత్ర్య శతాబ్ది నాటికి భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దాలంటే శాస్త్రీయ పరిశోధనలు, సాంకేతిక ఆవిష్కరణలు, యువశక్తి సమన్వయంతో ముందుకు సాగాలని మంత్రి పేర్కొన్నారు. కృత్రిమ మేధస్సు , డేటా సైన్స్, బయోటెక్నాలజీ, సెమీకండక్టర్లు, పునరుత్పాదక ఇంధనం, అంతరిక్ష సాంకేతికత, స్టార్టప్‌లు వంటి రంగాలే భవిష్యత్ ఆర్థిక వ్యవస్థను నిర్దేశిస్తాయని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలోని ప్రజా ప్రభుత్వం 2047 నాటికి తెలంగాణను మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దే లక్ష్యంతో సమతుల్య, సుస్థిర అభివృద్ధికి కట్టుబడి పనిచేస్తోందని మంత్రి తెలిపారు. ఇందుకోసంక్యూర్, ఫ్యూర్, రేర్, మహిళల ఆధ్వర్యంలోని అభివృద్ధి అనే నాలుగు

తరువాయి 2వ పేజీలో...

## అర్హులందరికీ

# సంక్షేమ ఫలాలు



పాలనలో రాజకీయాలకు తావులేదు

ఆగస్టు 15 నుంచి ఆసరా పింఛన్లు

తిరుమలాయపాలెంలో రూ. 7.00 కోట్ల పనులకు మంత్రి పొంగులేటి శంకుస్థాపన

పాలేరు ఆగస్టు 07(ప్రజా కలం న్యూస్ ) తిరుమలాయపాలెం అర్హతే ప్రామాణికంగా కుల, మత, రాజకీయాలకు అతీతంగా ప్రతి పేద కుటుంబానికి సంక్షేమ ఫలాలు అందించడమే ప్రజా ప్రభుత్వ ముఖ్య ఉద్దేశమని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. శుక్రవారం ఆయన తిరుమలాయపాలెం మండలంలో విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా తిప్పారెడ్డిగూడెం నుంచి రాకాసితండా వరకు రూ. 2.10 కోట్లతో నిర్మించనున్న బీటీ రోడ్డు, రాజారాం నుంచి తుమ్మగూడెం వరకు రూ. 4.50 కోట్లతో చేపట్టనున్న బీటీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అలాగే హైదర్ సాయిపేట, పాతర్లపాడు గ్రామాల్లో

తరువాయి 2వ పేజీలో...

## కలం కౌంటర్



## ప్రత్యామ్నాయ పంటల సాగుతోనే

# రైతులకు భరోసా

మొదటి పేజీ తరువాయి...

కార్యదర్శి సంజయ్ జాజు జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సీజనల్ పరిస్థితులు, వ్యవసాయం, మండల ప్రజావాణి, వనమహోత్సవం, రేషన్ కార్డుల పంపిణీ, చేయూత పెన్షన్లు, పాఠశాల యూనిఫాంల కుట్టు పనుల పురోగతిని సమీక్షించారు. కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా,అడిషనల్ కలెక్టర్లు మధుసూదన్ నాయక్, జె.ఎల్.బి హరిప్రియ,ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ సాయి శివాని,డిఆర్ఓ నిర్మల ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ భారత వాతావరణ శాఖ (ఐఎండీ) అంచనాల ప్రకారం రానున్న నెలల్లో వర్షపాతం తగ్గే అవకాశం ఉన్నందున రైతులు వరి వంటి అధిక నీటి అవసరమున్న పంటల సాగును విస్తరించకుండా ప్రత్యామ్నాయ పంటలను సాగు చేసేలా విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలను చూసి రైతులు వరి సాగును పెంచే అవకాశం ఉందని, అలాంటి పరిస్థితి భవిష్యత్తులో రైతులకు నష్టాన్ని కలిగించే అవకాశం ఉన్నందున ప్రతి రైతుకు స్పష్టమైన సందేశం చేరేలా వ్యవసాయ అధికారులు పనిచేయాలని ఆదేశించారు.ప్రస్తుతం సాగునీటి విడుదలపై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని, మరో 15 రోజుల పాటు అన్ని ప్రధాన ప్రాజెక్టుల నీటి మట్టాలను సమీక్షించిన అనంతరం పరిస్థితులకు అనుగుణంగా సాగునీటి విడుదలపై నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. కృష్ణా, గోదావరి నదీ పరివాహక ప్రాంతాల్లోకి వస్తున్న నీటి ప్రవాహాలను బట్టి అందుబాటులో ఉన్న ప్రతి జల వనరును నింపేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. అన్ని నీటిపారుదల ప్రాజెక్టుల నీటి నిల్వలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు.రాష్ట్ర ప్రభుత్వం పేదల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో కొత్త రేషన్ కార్డుల జారీ జరగలేదని, ప్రస్తుతం తెలంగాణ ప్రభుత్వం పేద కుటుంబాల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని 16 లక్షలకు పైగా కొత్త రేషన్ కార్డులను మంజూరు చేసిందని చెప్పారు. రాష్ట్రంలోని 1.05 కోట్ల రేషన్ కార్డు లబ్ధిదారులందరికీ ఆగస్టు 15వ తేదీ నుంచి తెలంగాణ స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. జిల్లాల్లో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీని పకడ్బందీగా నిర్వహించి అర్హులైన ప్రతి కుటుంబానికి సకాలంలో అందేలా అన్ని ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్లను ఆదేశించారు.వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావులి మాట్లాడుతూ ప్రతి జిల్లాలో పంటల వైవిధ్యీకరణ కార్యాచరణ ప్రణాళికను యథావిధిగా అమలు చేయాలని ఆదేశించారు. ప్రత్యామ్నాయ పంటలకు అవసరమైన అన్ని రకాల విత్తనాలను రైతులకు ముందుగానే అందుబాటులో ఉంచాలని సూచించారు. రాష్ట్రంలో ఇప్పటివరకు 99,81,167 ఎకరాల్లో వివిధ పంటల సాగు జరిగిందని తెలిపారు. స్థానిక ప్రజాప్రతినిధుల సహకారంతో రైతులను ప్రత్యామ్నాయ పంటల సాగు వైపు మళ్లించేందుకు విస్తృత ప్రచారం నిర్వహించాలని సూచించారు. ఆగస్టు 15 తర్వాత వర్షపాతం మరింత తగ్గే అవకాశమున్నందున ప్రతి జిల్లాలో సాగునీటి సలహా సమావేశాలు నిర్వహించి నీటి లభ్యత ఆధారంగా సాగు ప్రణాళిక రూపొందించాలని సూచించారు. అంతర్జాతీయ పరిస్థితుల ప్రభావంతో భవిష్యత్తులో విద్యుత్ సరఫరాపైనా ప్రభావం ఉండే అవకాశమున్నందున నీటి వినియోగంలో అప్రమత్తంగా ఉండాలని, వరి సాగును మరింత పెంచవద్దని స్పష్టం చేశారు.ప్రస్తుతం రాష్ట్రంలో సుమారు 35 లక్షల ఎకరాల్లో వరి సాగు జరిగిందని, అది మరింత పెరగకుండా ప్రత్యామ్నాయ పంటలను ప్రోత్సహించాలని ఆదేశించారు. కంది, పెసర, మినుములు తదితర పప్పుధాన్యాల విత్తనాలను సమృద్ధిగా నిల్వ ఉంచామని, ఇప్పటికే రైతులకు పంపిణీ ప్రారంభించామని తెలిపారు.

రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు మాట్లాడుతూ నిపుణుల అంచనాల ప్రకారం వచ్చే నెల నుంచి ఎల్‌నినో ప్రభావం తీవ్రంగా ఉండే అవకాశమున్నందున కంటింజెన్సీ ప్రణాళికలు, పంటల వైవిధ్యీకరణ కార్యక్రమాలను మరింత వేగవంతం చేయాలని ఆదేశించారు. వరి సాగులో కనీసం 50 శాతం విస్తీర్ణాన్ని ప్రత్యామ్నాయ పంటల వైపు మళ్లించే లక్ష్యంతో పనిచేయాలని సూచించారు.

రాష్ట్రవ్యాప్తంగా కనీసం 15 లక్షల ఎకరాల్లో ఆయిల్‌పామ్, పప్పుధాన్యాలు, కూరగాయలు, కంది, అలసందలు, పొద్దుతిరుగుడు, చిరుధాన్యాలు తదితర పంటలను ప్రోత్సహించాలని తెలిపారు. ఇందుకు ప్రజాప్రతినిధుల సంపూర్ణ సహకారం అధికారులకు ఉంటుందని పేర్కొన్నారు.వనమహోత్సవం కింద నిర్దేశించిన లక్ష్యాలను పూర్తిచేసి నాటిన ప్రతి మొక్కను సంరక్షించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. వీబీజీఆర్ఏఎంజీ కార్యక్రమంలో భాగంగా ఈ కాలంలో సాధ్యమైనంత ఎక్కువ సంఖ్యలో ఫాం పాండ్స్,ఇంకుడు గుంతలను నిర్మించాలని ఆదేశించారు.

ఆగస్టు 15 నుంచి 1.05 కోట్ల స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలని, కొత్త చేయూత పెన్షన్ల అర్హుల జాబితాను ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం సిద్ధం చేసి వచ్చే నెల నుంచి పెన్షన్లు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో, సంబంధిత శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## 2047 లక్ష్యాలకు యువత, పరిశోధన, ఆవిష్కరణలే చోదకశక్తి

మొదటి పేజీ తరువాయి...

అభివృద్ధి స్తంభాలపై ప్రభుత్వం ముందుకు సాగుతోందని చెప్పారు. ఇవి ప్రాంతీయ సమతుల్య అభివృద్ధి, వ్యవసాయ ప్రగతి, పారిశ్రామిక వృద్ధి, సామాజిక సమగ్రతకు దోహదపడతాయని పేర్కొన్నారు. ఆర్థికాభివృద్ధి మాత్రమే సరిపోదని, సమాజంలో ఆలోచనా విధానంలో కూడా మార్పు రావాల్సిన అవసరం ఉందని మంత్రి అన్నారు. గ్రామీణ భారతం ఇప్పటికీ అప్పుల ఊబిలో కూరుకుపోయి ఉండటం ఆందోళన కలిగించే అంశమన్నారు. దేశంలో ఆశించిన స్థాయిలో అక్షరాస్యతను పెంచలేకపోయామని చెప్పారు కార్పొరేట్ విద్య, కార్పొరేట్ వైద్యం వైపు అధికంగా మొగ్గు చూపడం, సామాజిక అనుకరణలో భాగంగా వివాహాలు, ఇతర కుటుంబ వేడుకలను ఆడంబరంగా నిర్వహించడం వల్ల అనేక కుటుంబాలు అప్పుల పాలవుతున్నాయని మంత్రి ఆవేదన వ్యక్తం చేశారు.

ప్రజలకు నాణ్యమైన ప్రభుత్వ విద్య, వైద్య సేవలను అందిస్తూ, వాటిని మరింత బలోపేతం చేయడం ద్వారానే వికసిత్ భారత్-2047, రైజింగ్ తెలంగాణ-2047 లక్ష్యాలను సాధించవచ్చని స్పష్టం చేశారు. సామాజిక రుగ్మతలపై ప్రజల్ని చైతన్యవంతం చేసే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుం టుందని, త్వరలోనే ప్రభాత భేరి కార్యక్రమాన్ని ప్రారంభిస్తామని తెలిపారు. విశ్వవిద్యాలయాలు కేవలం విద్యాబోధనకే పరిమితం కాకుండా పరిశోధన, ఆవిష్కరణలు, పారిశ్రామికవేత్తల తయారీ, సమాజాభివృద్ధికి కేంద్రాలుగా ఎదగాలని మంత్రి సూచించారు. ప్రభుత్వం-విశ్వవిద్యాలయాలు-పరిశ్రమల మధ్య సమన్వయం బలోపేతమైతే యువతకు నాణ్యమైన విద్య, నైపుణ్యాభివృద్ధి, పరిశోధన అవకాశాలు, ఉపాధి విస్తరిస్తాయని పేర్కొన్నారు. ఈ జాతీయ సదస్సులో జరిగే మేధోమథనం, చర్చలు దేశం, రాష్ట్రం నిర్దేశించుకున్న 2047 లక్ష్యాల సాధనకు ఉపయోగపడే ఆచరణాత్మక సూచనలను అందిస్తాయని మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు.

## ఏదులాపురం మున్సిపాలిటీని రాష్ట్రంలోనే

# ఆదర్శ మున్సిపాలిటీగా అభివృద్ధి చేస్తాం

- రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి
- ఏదులాపురం మున్సిపాలిటీ అభివృద్ధికి ముఖ్యమంత్రి రూ.100 కోట్ల నిధులు మంజూరు
- ప్రజల అవసరాలకు అనుగుణంగా మౌళిక వసతుల కల్పనకు క్షేత్రస్థాయిలో పర్యటన
- త్రాగునీరు, డ్రైనేజీ, విద్యుత్ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కార్యాచరణ
- ఏదులాపురం మున్సిపాలిటీలో మార్నింగ్ వాక్ నిర్వహించి అభివృద్ధి, పారిశుద్ధ్య పనులను పరిశీలించిన మంత్రి పొంగులేటి



పాలేరు ఆగస్టు 07(ప్రజా కలం న్యూస్ )

ఏదులాపురం మున్సిపాలిటీని రాష్ట్రంలోనే ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగుతోందని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. శుక్రవారం ఉదయం ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని 22, 23వ వార్డులైన సాయిగణేష్ నగర్, సత్యనారాయణపురం, ఇందిరమ్మ కాలనీలలో జిల్లా కలెక్టర్ టిఎస్ దివాకర్‌తో కలిసి కాలినడకన కాలనీల్లో తిరుగుతూ మంత్రివర్యులు అభివృద్ధి పనులు, పారిశుద్ధ్య పరిస్థితులు, ప్రజా మౌళిక వసతులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. స్థానికులతో మాట్లాడి వారి సమస్యలు, అవసరాలను అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ గ్రామ పంచాయతీలను విలీనం చేసి ఏర్పాటు చేసిన ఏదులాపురం మున్సిపాలిటీని రాష్ట్రంలోనే మోడల్ మున్సిపాలిటీగా అభివృద్ధి చేయడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఏదులాపురం మున్సిపాలిటీ సమగ్ర అభివృద్ధి కోసం రూ.100 కోట్ల నిధులు మంజూరు చేశారని చెప్పారు. ప్రజలకు అవసరమైన మౌళిక వసతులను గుర్తించి, వాటిని ప్రాధాన్యత క్రమంలో పూర్తి చేసేందుకే క్షేత్రస్థాయిలో పర్యటిస్తున్నామని పేర్కొన్నారు. లోతట్టు ప్రాంతాల్లో తుమ్మ చెట్లు పెరగడం, రోడ్లపై వర్షపు నీరు నిల్వ ఉండడం వంటి సమస్యలు తమ దృష్టికి వచ్చాయని, వాటి శాశ్వత పరిష్కారం కోసం అవసరమైన డ్రైనేజీ నిర్మాణంతో పాటు ఇతర మౌళిక సదుపాయాల కల్పనకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు తెలిపారు. కొన్ని ప్రాంతాల్లో త్రాగునీటి సమస్య ఉందని స్థానికులు తమ దృష్టికి తీసుకువచ్చారని, దానిని త్వరలోనే పరిష్కరిస్తామని చెప్పారు. విద్యుత్ తీగలకు సంబంధించిన సమస్యలను కూడా సంబంధిత శాఖల సమన్వయంతో పరిష్కరిస్తామని తెలిపారు. కొంతమంది ఇందిరమ్మ ఇళ్లు, ఇంటి స్థలాల కోసం వినతులు అందజేశారని, వాటిని ప్రభుత్వం సానుకూలంగా పరిశీలిస్తుందని పేర్కొన్నారు. మున్సిపాలిటీ పరిధిలో పార్కుల అభివృద్ధి పనులు ఇప్పటికే ప్రారంభం అయ్యాయని, ఈ నెలాఖరులోగా వాటిని పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని మంత్రి తెలిపారు. మున్సిపాలిటీ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించామని, అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తూ ప్రతి పనిని నిర్ణీత గడువులోగా నాణ్యతతో పూర్తి చేయాలని ఆదేశించారు. సాయిగణేష్ నగర్ లో రోడ్డు వెంట ఉన్న టీ స్టాల్ లో కూర్చుని టీ త్రాగి అనంతరం ఇందిరమ్మ కాలనీలో పర్యటించారు. వర్షం పడుతున్న కాలి నడకన గొడుగు చేత పట్టుకుని తిరిగి పరిసరాలను పరిశీలిస్తూ కాలనీవాసులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస్ రెడ్డి, ఏదులాపురం మునిసిపల్ చైర్ పర్సన్ అనిత, వైస్ చైర్మన్ తమ్మినేని నవీన్, ఆర్ అండ్ బి ఎస్ఈ యుగంధర్, పంచాయతీ రాజ్ ఎస్.ఈ. వెంకట్ రెడ్డి, ఏదులాపురం మునిసిపల్ కమీషనర్ శ్రీనివాస్, విద్యుత్ శాఖ ఎస్ఈ శ్రీనివాస చారి, హౌసింగ్ పీడీ శ్రీనివాస్, ఆర్డీఓ శ్రీనివాస్, సంబంధిత అధికారులు,స్థానిక ప్రజాప్రతినిధులు, కాలనీవాసులు, తదితరులు పాల్గొన్నారు.

## వాట్సాప్‌లో మీ సేవ సేవలు

మొదటి పేజీ తరువాయి...

ఇంటి ముంగిటకే పౌర సేవలు అందుబాటులోకి రానున్నాయని సూచించారు. డిజిటల్ ఆఫీస్ ప్రాజెక్ట్ ద్వారా పేపర్ లేస్ గవర్నెన్స్, ఏఐ, క్లౌడ్ కంప్యూటింగ్, డేటా అనలిటికల్స్, డిజిటల్ ప్లాట్ ఫామ్ కు ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని తెలిపారు. 20కి పైగా ప్రభుత్వ శాఖలను ఒకే తాటిపైకి తెచ్చేలా ఆర్‌టీజీ డ్యాష్ బోర్డు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. AI ట్రాన్స్‌ఫార్మేషన్ కాంక్లేవ్‌లో పాల్గొన్న అనంతరం తెలంగాణ మంత్రి శ్రీధర్ బాబు ఇలా అన్నారు: "సరైన సమయంలో నిర్వహించబడిన కార్యక్రమం ఇది. 'గవర్నమెంట్ కనెక్ట్' ఆధ్వర్యంలో ఈ 'AI ట్రాన్స్‌ఫార్మేషన్ కాంక్లేవ్' జరిగింది. ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరిచేందుకు 'మీ-సేవ' (వీవమావఝు) ద్వారా తెలంగాణ ప్రభుత్వం గత 30 నెలలుగా చేపడుతున్న చర్యలను ఇక్కడ మేము వివరించే ప్రయత్నం చేశాము. మేము దాదాపు 580 రకాల'మీ-సేవ' ప్రజా సేవలను వాట్సాప్ వేదిక ద్వారా అందిస్తున్నాము. పౌరులకు ఈ విధంగా 580 సేవలను అందిస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ మాత్రమే. ప్రజల కోసం మేము అమలు చేయాలని భావిస్తున్న 'పౌర-కేంద్రిత పాలన' ఇదే." అని మీడియాతో అన్నారు.

## భద్రాచలం-వాజేడు రహదారికి

# మోక్షం కల్పించండి

మొదటి పేజీ తరువాయి...

సంబంధిత అధికారులకు, తెలంగాణ ఆర్అండ్‌బీ ఉన్నతాధికారులకు ఫోన్ చేసి పరిస్థితిని వివరించారు. రహదారి మరమ్మతులు, అభివృద్ధి పనులను అత్యవసరంగా ప్రారంభించి ప్రజల కష్టాలకు ముగింపు పలకాలని విజ్ఞప్తి చేశారు. వారం రోజుల్లో పనులు ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకుంటానని మంత్రి తుమ్మల స్థానికులకు హామీ ఇవ్వడంతో వారు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ, రహదారి అభివృద్ధి పనులకు ఇప్పటికే పరిపాలనా అనుమతులు లభించినప్పటికీ కాంట్రాక్టర్ ఇప్పటి వరకు పనులు ప్రారంభించకపోవడం ఆందోళనకరమని మంత్రి జనార్దన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. వారం రోజుల్లోగా పనులు ప్రారంభం కాకపోతే ప్రస్తుత కాంట్రాక్టర్‌ను తొలగించి, కొత్త టెండర్లు పిలిచి పనులను వేగవంతం చేయాలని కోరారు. దీనిపై మంత్రి జనార్దన్‌రెడ్డి సానుకూలంగా స్పందిస్తూ తక్షణ చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. భద్రాచలం-వాజేడు రహదారి అభివృద్ధి పనులు మొత్తం మూడు ప్యాకేజీలుగా చేపట్టనున్నారు. భద్రాచలం నుంచి ఏటపాక వరకు ఆంధ్రప్రదేశ్ పరిధిలోని 7.8 కిలోమీటర్ల రహదారిని రూ.3.70 కోట్లతో అభివృద్ధి చేయనున్నారు. ఏటపాక నుంచి చర్ల మండలంలోని సుబ్బంపేట వరకు 56.8 కిలోమీటర్ల మేర భద్రాద్రి డివిజన్ పరిధిలో రూ.67.58 కోట్లతో పనులు చేపట్టనున్నారు. సుబ్బంపేట నుంచి వాజేడు వరకు ములుగు డివిజన్ పరిధిలోని 48 కిలోమీటర్ల రహదారిని రూ.44 కోట్లతో నిర్మించనున్నారు. మొత్తం 112.6 కిలోమీటర్ల పొడవున సుమారు రూ.115.28 కోట్ల వ్యయంతో ఈ రహదారి అభివృద్ధి కానుంది. ఈ పనులను ఆంధ్రప్రదేశ్ చీఫ్ ఇంజినీర్ శ్రీనివాసరెడ్డి, తెలంగాణ చీఫ్ ఇంజినీర్ బీవీ రావు పర్యవేక్షించనుండగా, భద్రాచలం, ములుగు ఈఈలు క్షేత్రస్థాయిలో అమలును పర్యవేక్షించనున్నారు. ముఖ్యంగా భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయానికి వచ్చే లక్షలాది మంది భక్తులు రహదారి దుస్థితి కారణంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నందున పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని మంత్రి తుమ్మల అధికారులను కోరారు.

## నాకంటే మొనగాడేం కాదు

# మీ ఎస్పీ..!

మొదటి పేజీ తరువాయి...

కొనసాగుతున్న ఆందోళనకు సంఘీభావం తెలిపేందుకు వెళ్తున్న విషయాన్ని పోలీసులు ముందస్తుగా గుర్తించి కొట్ర గేట్ సమీపంలో తన వాహనాన్ని అడ్డుకున్నారు. అనంతరం ఊర్కొండపేట పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ క్రమంలో పోలీసులకు మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజుకు మధ్య వాగ్వివాదం జరిగింది. శాంతి భద్రతల పరిరక్షణ కొరకు సహకరించాలని స్థానిక పోలీసులు బుజ్జగించారు. అయినా జిల్లా ఎస్పీ సంగ్రామ్ సింగ్ జి పాటిల్ పై ఆయన అసహనం వ్యక్తం చేశారు. పలుమార్లు ఫోన్ చేసినా ఈ ఎస్పీ స్పందించడం లేదన్నారు. పోలీసు బలగం వందల్లో ఉంటే తనకు లక్షల మంది ప్రజాబలం ఉందని తన సత్తా ఏమిటో చూపిస్తేనే పోలీసులకు తెలిసి వస్తుందంటూ పోలీసులపై ఫైర్ అయ్యారు. దీంతో కొద్దిసేపు ఆ ప్రాంతాల్లో ఉద్రిక్తత వాతావరణం నెలకొంది.

## అర్హులందరికీ

# సంక్షేమ ఫలాలు

మొదటి పేజీ తరువాయి...

రూ. 20 లక్షల చొప్పున అంచనా వ్యయంతో నిర్మించనున్న పంచాయతీ భవనాలకు భూమిపూజ నిర్వహించారు.

- సమగ్ర అభివృద్ధే ధ్యేయం..

ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన సభల్లో మంత్రి పొంగులేటి మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రభుత్వం సమపాళ్లలో పరుగులు తీయిస్తోందన్నారు. గ్రామీణ ప్రాంతాల స్వరూపాన్ని మార్చేందుకు భారీగా నిధులు కేటాయిస్తున్నామని వెల్లడించారు. తిప్పారెడ్డిగూడెం అభివృద్ధికి ఇప్పటివరకు రూ. 35.55 కోట్లు, హైదర్ సాయిపేటకు రూ. 37 కోట్లు, పాతర్లపాడుకు రూ. 29.25 కోట్లు, రాజారాం గ్రామానికి రూ. 8.48 కోట్లు మంజూరు చేసి వివిధ అభివృద్ధి పనులు చేపట్టినట్లు వివరించారు. ఉచిత విద్యుత్, ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం, సన్న బియ్యం పంపిణీ ద్వారా పేద కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించామన్నారు. రైతాంగానికి మద్దతు ధరతో పాటు వరికి క్వింటాలుకు రూ. 500 బోనస్, ఎకరాకు రూ. 6 వేల రైతు భరోసా జమ చేశామని గుర్తుచేశారు.

- ఇందిరమ్మ ఇళ్లు పారదర్శకం..

పేదల సొంతింటి కలను నెరవేర్చేందుకు రాష్ట్రవ్యాప్తంగా విడతల వారీగా 8 లక్షల ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తున్నామని మంత్రి తెలిపారు. ఎవరికీ ఒక్క రూపాయి చెల్లించాల్సిన అవసరం లేదని, పూర్తి పారదర్శకంగా లబ్ధిదారులను ఎంపిక చేస్తామన్నారు. ప్రతి సోమవారం క్షేత్రస్థాయి ప్రగతి ఆధారంగా నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోనే బిల్లులు జమ చేస్తామని స్పష్టం చేశారు. త్వరలోనే రెండో విడత ప్రొసీడింగ్స్ అందజేస్తామన్నారు. ఆగస్టు 15 నుంచి నూతన ఆసరా పింఛన్ల మంజూరు ప్రక్రియ ప్రారంభమవుతుందని ప్రకటించారు.

ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి, పంచాయతీరాజ్ ఎస్ఈ వెంకట్‌రెడ్డి, హౌసింగ్ పీడీ శ్రీనివాస్, డిపిఓ వినోద్‌మార్, ఆర్డీఓ శ్రీనివాస్, తహసీల్దార్ విల్సన్, ఎంపీడీఓ సిలార్ సాహెబ్, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

## పేద కుటుంబానికి అండగా చనుపల్లి గ్రామ అభివృద్ధి కమిటీ

### మరణించిన పెరుమాళ్ల వెంకన్న కుటుంబానికి రూ.10 వేల ఆర్థిక సహాయం



కోదాడ ఆగస్టు 07( ప్రజా కలం న్యూస్)

మానవత్వానికి నిదర్శనంగా చనుపల్లి గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు మరోసారి తమ సామాజిక బాధ్యతను చాటుకున్నారు. గ్రామంలో ఇటీవల ఆకస్మికంగా మరణించిన పెరుమాళ్ల వెంకన్న కుటుంబానికి అండగా నిలుస్తూ, కమిటీ సభ్యులు మరియు గ్రామ పెద్దలు కలిసి రూ.10,000 ఆర్థిక సహాయాన్ని అందజేశారు. కుటుంబ పెద్దను కోల్పోయి తీవ్ర విషాదంలో ఉన్న వెంకన్న కుటుంబానికి కొంతైనా భరోసా కల్పించాలనే ఉద్దేశంతో ఈ సహాయాన్ని అందించినట్లు గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు తెలిపారు. కష్టకాలంలో గ్రామ ప్రజలు ఒకరికొకరు తోడుగా నిలవడం గ్రామ ఐక్యతకు నిదర్శనమని వారు పేర్కొన్నారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు మాట్లాడుతూ, ఆపదలో ఉన్న కుటుంబాలను ఆదుకోవడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని తెలిపారు. భవిష్యత్తులో కూడా గ్రామ ప్రజలకు అవసరమైన సందర్భాల్లో అభివృద్ధి కమిటీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు, మృతుడి కుటుంబ సభ్యులు, యువత, అభిమానులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని వెంకన్న కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు.

## ప్రత్యామ్నాయ పంటలతోనే ఆర్థిక సమృద్ధి

### - మండల ఉద్యాన విస్తరణ అధికారి బి.రాము

పెద్దపల్లి,ఆగస్టు 07:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి) ప్రత్యామ్నాయ పంటల సాగుతోనే రైతులు ఆర్థికంగా అద్భుతమైన లాభాలు గడించవచ్చని పాలకుర్తి మండల ఉద్యాన విస్తరణ అధికారి బి.రాము పేర్కొన్నారు. మండలంలోని పుట్నూర్,కుక్కలాగూడూర్, వెంనూర్ శివార్లలో సాగవుతున్న గ్రాఫ్టెడ్ వంకాయ,మునగ,పామాయిల్,కూరగాయలు,పూల తోటలను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా ఉద్యాన విస్తరణ అధికారి బి.రాము మాట్లాడుతూ రైతులు వరి,పత్తి,మొక్క జొన్న వంటి సంప్రదాయ సాగుకు స్వస్తి చెప్పి,మార్కెట్లో మంచి డిమాండ్ ఉన్న ఉద్యాన పంటల వైపు మళ్లాలని పిలుపునిచ్చారు.ప్రభుత్వ పథకాలు మరియు రాయితీలు పూర్తిగా వర్తించాలంటే ప్రతి రైతు సర్వే నంబర్ల వారీగా తప్పనిసరిగా రైతులు పంటల నమోదు చేసుకోవాలని స్పష్టం చేశారు.బావులు,బోర్ల కింద డ్రిప్,స్ప్రింక్లర్లను వినియోగించుకుంటూ కూరగాయలను మేలైన



మల్చింగ్ పద్ధతిలో సాగు చేయాలని సూచించారు.వంద శాతం సబ్సిడీతో లభిస్తున్న ఫార్మ్ పాండ్స్ పథకాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో తోట ప్రశాంత్,ఏఈఓలు కుమ్మం శ్రీకాంత్,జూపాక సుష్మ,ఉద్యానవన రైతులు నలిమేల సాగర్,నలిమెలా మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# మండలంలోని ఎరువుల దుకాణాల ఆకస్మిక తనిఖీ

## - మండల వ్యవసాయ అధికారి రాజ్ కుమార్



ఇబ్రహీంపట్నం ఆగస్టు 07 (ప్రజా కలం ప్రతినిధి ) ఇబ్రహీంపట్నం మండలంలోని పలు ఎరువుల విక్రయ కేంద్రాలను మండల వ్యవసాయ అధికారి రాజ్‌కుమార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎరువుల నిల్వలు, ఈ-పోస్ స్టాక్ వివరాలు, స్టాక్ రిజిస్టర్లు, విక్రయ రికార్డులు, లైసెన్సులు మరియు ఎంఆర్పీ ప్రకారం ఎరువుల విక్రయాలను పరిశీలించారు. భౌతిక నిల్వలు ఈ-పోస్‌లో నమోదైన స్టాక్ వివరాలను సరిపోల్చి పరిశీలించారు. రైతులకు నాణ్యమైన ఎరువులను మాత్రమే నిర్ణీత ధరలకు విక్రయించాలని,అలాగే ఎరువులను అధిక ధరలకు విక్రయించడం, కృత్రిమ కొరత సృష్టించడం లేదా ఇతర అవకతవకలకు పాల్పడితే ఎరువుల నియంత్రణ ఉత్తర్వులు. ఎఫ్ సి ఓ ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

### కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక

# విధానాలను రద్దు చేయాలి

## - సిపిఐ పార్టీ జిల్లా కార్యదర్శి చెన్న విశ్వనాథం



ఇబ్రహీంపట్నం ఆగస్టు 07( ప్రజా కలం ప్రతినిధి )

కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను రద్దు చేయాలని సిపిఐ పార్టీ జిల్లా కార్యదర్శి చెన్న విశ్వనాథం డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో ఈనెల 6 నుండి 14 వరకు జరగనున్న ప్రచార యాత్రలో భాగంగా జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలో శుక్రవారం సీపీఐ పార్టీ ఆధ్వర్యంలో కొత్త బస్టాండ్ నుంచి పాత బస్టాండ్ వరకు ప్రచార యాత్ర నిర్వహించారు. ఈ మేరకు సిపిఐ పార్టీ జిల్లా కార్యదర్శి చెన్న విశ్వనాథం మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలతో పెరిగిపోతున్న నిరుద్యోగంతో పాటు (ద్రవ్యోల్బణం) ధరల పెరుగుదల ప్రజలపై ఒక మోయలేని భారంగా మారింది అని అన్నారు. పెట్రోల్, డీజిల్,నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదలను అరికట్టి, ప్రజల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కేంద్ర ప్రభుత్వాన్నీ ఆయన డిమాండ్ చేశారు. ఈ ప్రచార యాత్రలో సీపీఐ పార్టీ జిల్లా నాయకులు సుతారి రాములు, ఎండి ఉస్మాన్,రాజన్న, వంశీ,రమేష్,మహిళ నాయకురాలు యెన్నం రాధా,కొక్కులశాంత, ఫిర్దోష్,కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# భక్తిశ్రద్ధలతో మహాలక్ష్మి అమ్మవారికి పూజలు

మెట్‌పల్లి:(కోరుట్ల) ప్రతినిధి ఆగస్టు 7 (ప్రజాకలం) ఆషాఢ మాసం బోనాల



పండుగ సందర్భంగా మెట్‌పల్లి పట్టణంలోని శ్రీ మహా లక్ష్మి దేవాలయంలో శుక్రవారం భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజ కార్యక్రమంలో బాగంగా తెలంగాణ రాష్ట్ర వెల్మ కార్పొరేషన్ చైర్మన్ జువ్వాడి నర్సింగరావు, మెట్‌పల్లి మున్సిపల్ చైర్మన్ మైలారపు లింబాద్రి అమ్మవారిని దర్శించుకుని పట్టు వస్త్రాలు, పూలు, పండ్లు సమర్పించి ప్రత్యేక మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం భక్తులకు అమ్మవారి ప్రసాదాన్ని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మెట్‌పల్లి పట్టణ ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో, సిరిసంపదలతో వర్ధిల్లాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ఓంకార్ నవీన్, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ గౌడ్, మున్సిపల్ కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ఆలయ నిర్వాహకులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# విద్యుత్ ఉద్యోగుల నల్లబ్యాడ్జీలతో నిరసన

## యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ ప్రైవేటీకరణను వెంటనే విరమించుకోవాలి

## మెట్‌పల్లి విద్యుత్ శాఖ డివిజన్ సిబ్బంది డిమాండ్

మెట్‌పల్లి:(కోరుట్ల) ప్రతినిధి ఆగస్ట్ 7 (ప్రజాకలం) యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ ప్రైవేటీకరణ ప్రయత్నాలను వెంటనే విరమించుకోవాలని డిమాండ్ చేస్తూ మెట్‌పల్లి డివిజన్ విద్యుత్ కార్యాలయం ఎదుట శుక్రవారం విద్యుత్ ఉద్యోగులు, కార్మికులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సిబ్బంది మాట్లాడుతూ విద్యుత్ రంగం ప్రజలకు అత్యంత కీలకమైన సేవా రంగమని, ప్రభుత్వ రంగ సంస్థలను మరింత బలోపేతం చేయాల్సిన సమయంలో ప్రైవేటీకరణ చర్యలు ఆందోళన కలిగిస్తున్నాయని అన్నారు. యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌ను ప్రైవేట్ సంస్థలకు అప్పగిస్తే ఉద్యోగుల భద్రతతో పాటు ప్రజలకు అందించే నాణ్యమైన విద్యుత్ సేవలపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందని పేర్కొన్నారు. విద్యుత్ సంస్థలను కేవలం లాభాపేక్షతో కాకుండా ప్రజా సేవా దృక్పథంతో నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. విద్యుత్ ఉద్యోగులు, కార్మికుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని ప్రైవేటీకరణ నిర్ణయాలను ప్రభుత్వం పునఃసమీక్షించాలని డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో జేఏసీ జిల్లా చైర్మన్ అజీజ్, మెట్‌పల్లి డివిజన్ జేఏసీ చైర్మన్ మునుగురి లక్ష్మణ్, సెక్రటరీ హరి ప్రసాద్, జేఏసీ నాయకులు లక్కంపల్లి సురేష్, ఎండి కరీం, శంకరయ్య, రవీందర్, భోయినపల్లి అశోక్, మహేష్, కమలకర్, శరణ్య, లక్ష్మీ, రాజమ్మ, మౌనిక తదితరులు పాల్గొన్నారు.




# మైనారిటీ మహిళా-యువజన పథకం చెక్కుల పంపిణీ

## 8 మంది లబ్ధిదారులకు రూ.4 లక్షల ఆర్థిక సహాయం



మెట్‌పల్లి టౌన్ ప్రతినిధి ఆగస్టు 7 (ప్రజాకలం)

ఇందిరమ్మ మైనారిటీ మహిళా-యువజన పథకం కింద కోరుట్ల, మల్లాపూర్, ఇబ్రహీంపట్నం మండలాలకు చెందిన ఎంపికైన ఎనిమిది మంది లబ్ధిదారులకు చెక్కులను తెలంగాణ రాష్ట్ర వెలమ కార్పొరేషన్ చైర్మన్, కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగ్‌రావు పంపిణీ చేశారు. ఒక్కో లబ్ధిదారుడికి రూ.50 వేల చొప్పున మొత్తం రూ.4 లక్షల విలువైన చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా జువ్వాడి నర్సింగ్‌రావు మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న స్వయం ఉపాధి అవకాశాలను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కిరాణా దుకాణాలు, జిరాక్స్ సెంటర్లు తదితర స్వయం ఉపాధి యూనిట్ల ఏర్పాటుకు ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సహాయాన్ని సమర్థవంతంగా వినియోగించుకుని వ్యాపారాలను అభివృద్ధి చేసుకోవాలని ఆకాంక్షించారు. ప్రభుత్వ పథకాల ప్రధాన లక్ష్యం లబ్ధిదారుల కుటుంబాలు ఆర్థికంగా అభివృద్ధి చెందడమేనని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కోరుట్ల, మల్లాపూర్, ఇబ్రహీంపట్నం మండలాల ఎంపీడీవోలు, కోరుట్ల మార్కెట్ కమిటీ చైర్మన్, ఇబ్రహీంపట్నం మార్కెట్ కమిటీ చైర్మన్, మండల కాంగ్రెస్ అధ్యక్షులు, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులు, లబ్ధిదారులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యలపై సీపీఐ పాదయాత్రలు

## - ఆగస్టు 6 నుంచి 14 వరకు ప్రచార యాత్రలు

మెట్‌పల్లి టౌన్ ప్రతినిధి ఆగస్టు 7 (ప్రజాకలం) కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టేందుకు ప్రజలంతా సంఘటితం కావాలని సీపీఐ జగిత్యాల జిల్లా కార్యదర్శి చెన్న విశ్వనాథం పిలుపునిచ్చారు. శుక్రవారం మెట్‌పల్లి బస్టాండ్ సమీపంలోని బస్సు డిపో నుంచి కొత్త బస్టాండ్ వరకు సీపీఐ ఆధ్వర్యంలో పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా చెన్న విశ్వనాథం మాట్లాడుతూ.. ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వ విధానాలతో దేశ సామాజిక, రాజకీయ, ఆర్థిక పరిస్థితులు రోజురోజుకూ దిగజారుతున్నాయని విమర్శించారు. ప్రజా సమస్యలపై ఆగస్టు 6 నుంచి 14వ తేదీ వరకు జగిత్యాల జిల్లాలోని గ్రామాలు, పట్టణాలు, నగరాల్లో సీపీఐ ఆధ్వర్యంలో ప్రచార పాదయాత్రలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ధరల పెరుగుదలను అరికట్టడం, ద్రవ్యోల్బణాన్ని నియంత్రించడం,రైతులకు కనీస మద్దతు ధరకు చట్టబద్ధమైన హామీ కల్పించడం, నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించడం, కార్మిక హక్కులను పరిరక్షించడం, మహిళా రిజర్వేషన్ చట్టాన్ని తక్షణమే అమలు చేయడం వంటి డిమాండ్ల సాధన కోసం ఉద్యమాన్ని చేపడుతున్నట్లు వివరించారు. సార్వత్రిక ప్రభుత్వ విద్య, వైద్య ఆరోగ్య వ్యవస్థలను బలోపేతం చేయడంతో పాటు దళితులు, ఆదివాసీలకు సామాజిక న్యాయం కల్పించాలని డిమాండ్



చేశారు. 'బద్లావు జరూరీ హై.. చలో ఢిల్లీ' నినాదంతో సెప్టెంబర్ 1న న్యూఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో భారీ ర్యాలీ, బహిరంగ సభ నిర్వహించనున్నట్లు చెన్న విశ్వనాథం తెలిపారు. దేశవ్యాప్తంగా ప్రజలను ఏకతాటిపైకి తీసుకువచ్చి ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఉద్యమాన్ని మరింత బలోపేతం చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఏఐటీయూసీ అధ్యక్షులు, సభ్యులు సుతారి రాములు, మెట్‌పల్లి పట్టణ సీపీఐ కార్యదర్శి ఎం.డి. ఉస్మాన్, మహిళా సీపీఐ నాయకులు కొక్కుల శాంత, ఎన్నం రాధా, ఈన ఫిర్దోస్, అందె వంశీకృష్ణ, పోశెట్టి, మల్లాపూర్ రాజన్న, తిప్పర్తి రమేష్ తదితర సీపీఐ నాయకులు, కార్యకర్తలు, కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# అంగన్‌వాడీ కేంద్రంలో అన్నప్రాశన




మెట్‌పల్లి టౌన్ ప్రతినిధి ఆగస్టు 7 (ప్రజాకలం) పట్టణంలోని ఇంద్రానగర్ 3వ వార్డులోని అంగన్‌వాడీ కేంద్రంలో అన్నప్రాశన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా 3వ వార్డు కౌన్సిలర్ బత్తుల నరేశ్, అరిసె మురళి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ ప్రతిభ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ ప్రతిభ మాట్లాడుతూ శిశువు జన్మించిన గంటలోపే ముర్రిపాలు పట్టించాలని సూచించారు. ముర్రిపాలు శిశువుకు మొదటి టీకా లాంటివని, వీటిని తాగించడం వల్ల శిశువులో వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని తెలిపారు. శిశువు పుట్టిన తర్వాత తొలి ఆరు నెలల పాటు తల్లిపాలను మాత్రమే అందించాలని, తద్వారా తల్లి, బిడ్డ ఆరోగ్యంగా ఉంటారని పేర్కొన్నారు. కౌన్సిలర్ బత్తుల నరేశ్ మాట్లాడుతూ రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు అంగన్‌వాడీల ద్వారా అందిస్తున్న పౌష్టికాహారం, గుడ్లు, పాలు, బాలామృతం తదితరాలను గర్భిణీలు, బాలింతలు, చిన్నారులు క్రమం తప్పకుండా తీసుకోవాలని సూచించారు. పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా తల్లి, పిల్లలు ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. అనంతరం ఏడు నెలల వయస్సు నిండిన చిన్నారులకు కౌన్సిలర్ బత్తుల నరేష్, సూపర్‌వైజర్ ప్రతిభ చేతుల మీదుగా అన్నప్రాశన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ విజయలక్ష్మి, ఆయా పద్మతో పాటు తల్లులు ప్రవలిక, అలేఖ్య, రజని, శ్రావణి, సరస్వతి, నివేదిత, నదియా, సృజన, పెంట లక్ష్మి, లక్ష్మి తదితరులు, చిన్నారులు పాల్గొన్నారు.

# సీపీఐ ప్రజా చైతన్య యాత్ర విజయవంతం చేయండి




## సీపీఐ జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం

పెద్దపల్లి,ఆగస్టు07:(ప్రజాకలం జిల్లాప్రతినిధి) కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక,నిరంకుశ విధానాలను ఎండగట్టేందుకు భారత కమ్యూనిస్ట్ పార్టీ ఆధ్వర్యంలో ఆగస్టు 10 నుండి 13 వరకు జిల్లాలో ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న ప్రజా చైతన్య యాత్ర ను విజయవంతం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం పిలుపునిచ్చారు. శుక్రవారం జిల్లా కార్యాలయంలో ప్రజా చైతన్య యాత్ర వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడుతూ దేశ చరిత్రలోనే ఎన్నడూ లేనివిధంగా మోదీ సర్కార్ కార్పొరేట్,సామ్రాజ్యవాద, మతతత్వ శక్తులకు కొమ్ముకాస్తూ దేశ ఆర్థిక, సామాజిక పరిస్థితులను దిగజార్చుతోందని ధ్వజమెత్తారు. నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదల,ద్రవ్యోల్బణ నియంత్రణలో కేంద్రం విఫలమైందని మండిపడ్డారు.

సీపీఐ జాతీయ పిలుపు మేరకు ఆగస్టు 6 నుండి 14 వరకు రాష్ట్రవ్యాప్తంగా సాగుతున్న ఈ యాత్రలో భాగంగా జిల్లాలో ఆగస్టు 10న సుల్తానాబాద్‌లో ప్రారంభమై 13న గోదావరిఖనిలో ముగుస్తుందని,ప్రతి గ్రామం, మండల కేంద్రానికి యాత్రను తీసుకెళ్లి ప్రజలను చైతన్యం చేయాలని కోరారు. అలాగే సెప్టెంబర్ 1న న్యూఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో జరిగే బద్లావ్ జరూరి-చలో ఢిల్లీ ర్యాలీని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు గోసిక మోహన్,గౌతమ్ గోవర్ధన్,జిల్లా సమితి సభ్యులు ఆరెపల్లి మానస్ కుమార్,పూసాల రమేష్,పెర్క శివ,కుక్క రవి,కల్లేపల్లి శంకర్,బొంకూరి ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

# మహాలక్ష్మి ఆలయంలో వన మహోత్సవం




మెట్‌పల్లి:(కోరుట్ల) ప్రతినిధి ఆగస్టు 7 (ప్రజాకలం)

మహాలక్ష్మి బోనాల పండుగ సందర్భంగా వన మహోత్సవంలో భాగంగా మెట్‌పల్లి శ్రీ మహాలక్ష్మమ్మ దేవాలయ ప్రాంగణంలో గురువారం మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర వెల్మ కార్పొరేషన్ చైర్మన్ జువ్వాడి నర్సింగరావు, మెట్‌పల్లి మున్సిపల్ చైర్మన్ మైలారపు లింబాద్రి, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ గౌడ్ మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటి సంరక్షణకు బాధ్యత వహించాలని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ఓంకార్ నవీన్, మున్సిపల్ కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, డీఎస్పీ శ్రీరాములు, సీఐ సురేష్ బాబు, ఎస్సై కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# హెడ్ కానిస్టేబుళ్లకు ఏఎస్‌ఐగా పదోన్నతి





జగిత్యాల ప్రతినిధి ఆగస్టు 7 (ప్రజాకలం)

ఇంటెలిజెన్స్ విభాగంలో హెడ్ కానిస్టేబుళ్లుగా విధులు నిర్వహిస్తున్న వావిలాల గంగాధర్, అబ్దుల్ రషీద్‌లు ఏఎస్‌ఐలుగా పదోన్నతి పొందారు. ఈ సందర్భంగా శుక్రవారం కరీంనగర్ ఆర్ఐఓ మోహన్ వారికి స్టార్ అలంకరించి పదోన్నతిని అధికారికంగా అందజేశారు. ఈ సందర్భంగా జగిత్యాల జిల్లా జోనల్ ఇన్‌స్పెక్టర్ బాణాల రాజేందర్, ఇంటెలిజెన్స్ విభాగం రిటైర్డ్ ఎస్సై వెంకన్నలు పదోన్నతి పొందిన గంగాధర్, అబ్దుల్ రషీద్‌లను అభినందించారు. భవిష్యత్తులో మరింత సమర్థవంతంగా విధులు నిర్వహించి పోలీస్ శాఖకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

# మహాలక్ష్మి అమ్మవారికి రజక సేన పూజలు



మెట్‌పల్లి టౌన్ ప్రతినిధి ఆగస్టు 7 (ప్రజాకలం)

మెట్‌పల్లి పట్టణంలోని శ్రీ మహాలక్ష్మీ దేవాలయంలో రజక శివసేన ఆధ్వర్యంలో మహాలక్ష్మి అమ్మవారికి భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక మొక్కులు చెల్లించుకుని, పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ప్రతి ఏడాది ఆనవాయితీగా కొనసాగుతున్న సంప్రదాయంలో భాగంగా అమ్మవారిని దర్శించుకున్న రజక శివసేన ప్రతినిధులు, ప్రజలందరూ సుఖసంతోషాలతో,ఆయురారోగ్యాలతో, సిరిసంపదలతో వర్ధిల్లాలని అమ్మవారిని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో రజక యువసేన, యూత్ సభ్యులు, దుబ్బవాడకు చెందిన భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# ఇంకుడు గుంత నిర్మించుకోవాలి

## వర్షపు నీటిని ఒడిసిపడదాం - 'క్యాచ్ ది రైన్'పై అవగాహన



మెట్‌పల్లి టౌన్ ప్రతినిధి ఆగస్టు 7 (ప్రజాకలం)

ప్రతి ఒక్కరు ఇంకుడు గుంత నిర్మించుకోవాలని వెలమ కార్పొరేషన్ చైర్మన్ జువ్వాడి నర్సింగరావు తెలిపారు. ఆషాఢ బోనాల పర్వదినాన్ని పురస్కరించుకుని మెట్‌పల్లి శ్రీ మహా లక్ష్మీ దేవాలయ ప్రాంగణంలో మెట్‌పల్లి మున్సిపల్ ఆధ్వర్యంలో 'క్యాచ్ ది రైన్' వర్షపు నీటిని ఒడిసిపడదాం పై ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ ఇళ్ల ప్రాంగణంలో తప్పనిసరిగా ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలని సూచించారు. వర్షపు నీరు వృథాగా వెళ్లకుండా ఇంకుడు గుంతల్లోకి మళ్లించడం ద్వారా భూగర్భ జలాలు గణనీయంగా పెరుగుతాయని తెలిపారు. నీటి సంరక్షణతో భవిష్యత్ తరాలకు మంచినీటి ఎద్దడి రాకుండా కాపాడవచ్చని, నీటి సంరక్షణ బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో మెట్‌పల్లి మున్సిపల్ చైర్మన్ మైలారపు లింబాద్రి, వైస్ చైర్మన్ ఓంకార్ నవీన్, మున్సిపల్ కౌన్సిలర్లు, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ గౌడ్, మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# డాక్టర్ ప్రసన్నకుమార్ కు ఆత్మీయ సత్కారం

గోదావరిఖని,ఆగస్టు 07:( ప్రజాకాలం జిల్లా ప్రతినిధి) సింగరేణి ఏరియా ఆసుపత్రి



నూతన అసిస్టెంట్ చీఫ్ మెడికల్ ఆఫీసర్ గా నియమితులైన డాక్టర్ ప్రసన్నకుమార్ ను పలువురు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయనకు శాలువా కప్పి, సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. డాక్టర్ ప్రసన్నకుమార్ వైద్య రంగంలో మరింత ముందుకు సాగి,సింగరేణి కార్మికులకు, స్థానిక ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కొంకటి కుటుంబ సభ్యులు కొంకటి వెంకటేష్,కొంకటి పులేబాబు,కొంకటి సిద్ధార్థ తదితరులు పాల్గొన్నారు

ప్రజా కలం
శనివారం, ఆగస్టు 8, 2026

## రిజర్వేషన్లు లేని సమాజం సాధ్యమా..

కొన్ని ప్రశ్నలకు సమాధానం చెప్పేముందు ఆ ప్రశ్న సరైనదేనా అని అడగాలి ఎందుకంటే ప్రజాస్వామ్యంలో ప్రతి చర్చ ఒకే విధంగా పుట్టదు. కొన్ని చర్చలు సమాజం అవసరం వల్ల వస్తాయి. మరికొన్ని రాజకీయాల అవసరం వల్ల వస్తాయి. ఈ రెండింటి మధ్య తేడా గుర్తించకపోతే సమాధానం ఎంత సరైనదైనా అది అసలు ప్రశ్ననుంచి తప్పించుకోవచ్చు. రిజర్వేషన్లపై జరుగుతున్న చర్చ కూడా అలాంటిదే. పైకి చూస్తే అది ఒక విధానం గురించి చర్చలా కనిపిస్తుంది. కానీ కొంచెం లోతుగా చూస్తే అది భారత ప్రజాస్వామ్యం తన గురించి తాను వేసుకోవాల్సిన ఒక పెద్ద ప్రశ్నను తాకుతుంది. అదే 'సామాజిక న్యాయం పూర్తయిందా? ఈ ప్రశ్నకు సమాధానం తెలియకుండా దాన్ని సాధించే విధానాలపై తీర్పు చెప్పడం అంటే గమ్యానికి చేరామో లేదో చూడకుండానే ప్రయాణాన్ని ఆపేయాలని నిర్ణయించడం లాంటిది. జర్మన్ తత్వవేత్త యుర్గన్ హెబెర్మాస్ ఆధునికతను ఒక అసంపూర్ణ ప్రాజెక్టు గా అభివర్ణించాడు. ఈ భావనలోని అసలు బలం ఒకే మాటలో ఉంది. అసంపూర్ణమంటే విఫలం అని కాదు. ఇంకా పూర్తి చేయాల్సిన బాధ్యత మిగిలి ఉందని అర్థం. ప్రతి అసంపూర్ణ ప్రాజెక్టుకు ముందు రెండు మార్గాలు ఉంటాయి. ఒకటి అది పూర్తి కాలేదు అని చెప్పి విఫలమైందని ప్రకటించడం. రెండోది ఎందుకు పూర్తికాలేదో అర్థం చేసుకొని దాన్ని పూర్తి చేసే బాధ్యతను స్వీకరించడం. భారత ప్రజాస్వామ్యం ముందు కూడా నేడు అదే ఎంపిక ఉంది. రిజర్వేషన్లపై చర్చ చివరికి ఆ ఎంపిక గురించే. రాజ్యాంగ నిర్మాతలు ఒక గొప్ప నైతిక సత్యాన్ని గుర్తించారు. చట్టం సమానత్వాన్ని ప్రకటించగలదు. కానీ చరిత్రను రద్దు చేయలేదు. ఎందుకంటే అసమానత అనేది కేవలం వర్తమాన సమస్య కాదు, వర్తమానంపై గతం చూపే ప్రభావం. అందుకే శతాబ్దాలుగా అవకాశాలకు దూరమైన వర్గాలకు ఇప్పటినుంచి అందరూ సమానం అని చెప్పడం న్యాయం కాదని వారు అర్థం చేసుకున్నారు అందుకే సమానత్వాన్నీ కేవలం హక్కుల భాషలోనే కాదు అవకాశాల భాషలో కూడా నిర్వచించారు. రిజర్వేషన్లు ఆ తర్కం నుంచే పుట్టాయి. అవి ప్రత్యేక హక్కులు కాదు. చరిత్ర మూసివేసిన తలుపులను ప్రజాస్వామ్యం మళ్లీ తిరిగి రాయడానికి నిర్మించిన రాజ్యాంగబద్ధ వంతెన. ప్రపంచ ప్రజాస్వామ్యాల అనుభవం కూడా ఇదే చెబుతుంది. అమెరికా బానిసత్వం తర్వాత, దక్షిణాఫ్రికా అపార్థెయిడ్ తర్వాత, బ్రెజిల్ వర్ణ అసమానతల నేపథ్యంలో, కెనడా స్థానిక ప్రజల హక్కుల విషయంలో, న్యూజిలాండ్ మావోరీ ప్రజల రాజకీయ ప్రాతినిధ్యంలో. రూపాలు,పేర్లు వేరు కావచ్చు. కానీ ప్రతి సమాజం ఒకే సత్యాన్ని ఎదుర్కొంది. చరిత్ర సృష్టించిన అసమానతలను మార్కెట్ స్వయంగా సరిచేయదు. పోటీ కూడా సరి చేయదు. అందరికీ సమాన అవకాశం అనే నినాదం ఒకటే వాటిని తొలగించదు. ప్రజాస్వామ్యం కొన్నిసార్లు చరిత్రతో వాదించాల్సి వస్తుంది. ప్రత్యేక అవకాశాల విధానాలు ఆ వాదనలో భాగం. అవి సమానత్వానికి మినహాయింపులు కాదు. సమానత్వాన్ని వాస్తవం చేయటానికి ఉపయోగపడే మార్గాలు. రిజర్వేషన్లపై ప్రతి చర్చలో 'మెరిట్' అనే పదం తప్పనిసరిగా వినిపిస్తుంది. కానీ మెరిట్ అనేది అవకాశాల నుంచి వేరు చేసుకోగలిగే గుణం అయితే సమాజం ఎప్పుడో న్యాయబద్ధమై ఉండేది.నిజానికి మెరిట్ కూడా ఒక సామాజిక నిర్మాణమే. ఒక పిల్లవాడు ఏ పాఠశాలలో చదివాడు, ఇంట్లో చదివే గది ఉందా, తల్లిదండ్రుల విద్యా స్థాయి ఏంటి, అతను ఆకలితో పాఠశాలకు వెళ్లాడా లేక ఆత్మవిశ్వాసంతో వెళ్ళాడా, కులం కారణంగా అవమానాన్ని ఎదుర్కొన్నాడా లేదా ఇవన్నీ అతని సామర్థ్యాన్ని ప్రభావితం చేస్తాయి. అందువల్ల ప్రతిభను మాత్రమే చూసి మెరిట్‌ను కొలవడం అంటే అవకాశాలను కనిపించినట్లు నటించడం; అసమాన ప్రారంభ రేఖలతో పందెం పెట్టి గెలిచిన వారిని ప్రతిభావంతులని ప్రకటించినట్టే. ప్రపంచానికి మరో నైతిక కొలమానం ప్రాతినిధ్యం; ప్రాతినిధ్యం రాజకీయ నినాదం కాదు. ప్రజాస్వామ్య నైతికత. న్యాయస్థానాల్లో, విశ్వవిద్యాలయాల్లో, శాసనసభల్లో, పరిపాలన వ్యవస్థలో, సమాజంలోని అన్నివర్గాలు కనిపించాలి. ఎందుకంటే రాష్ట్రం కేవలం అధికారం నిర్మాణం కాదు. సమాజం తననుతాను చూసుకునే అద్దం. ఆ అద్దంలో కొన్ని వర్గాలు మాత్రమే కనిపిస్తే మిగిలినవారికి ప్రజాస్వామ్యం ఒక వాగ్దానంగా మిగులుతుంది. అనుభవంగా మారదు. అందుకే ప్రాతినిధ్యం అనేది రాజకీయ రాయితీకాదు. ప్రజాస్వామ్య నాణ్యతకు అవసరమైన షరతు. అయితే రిజర్వేషన్ల గురించి ఏ నిర్ణయానికైనా రాకముందు ఆ షరతు నిజంగా నెరవేరిందా అనే కనీస ప్రాథమిక ప్రశ్నలనైనా మనకు మనమే వేసుకోవాలి. అది కులం మనిషి అవకాశాలను, ఆత్మగౌరవాన్ని, జీవిత గమనాన్ని, ఏమాత్రం ప్రభావితం చేయడం లేదని ధైర్యంగా ప్రకటించగలమా? పుట్టుక కాదు ప్రతిభ మాత్రమే ప్రతి వ్యక్తి భవిష్యత్తును నిర్ణయిస్తుందని నిస్సందేహంగా చెప్పగలమా? మొత్తానికి సామాజిక న్యాయం పూర్తయిందని నిజంగా చెప్పగలమా? ఈ ప్రశ్నలు దీనికైనా నిజాయితీగా 'అవును' అని చెప్పగలిగితేనే రిజర్వేషన్ల అవసరం ముగిసింది అని చెప్పవచ్చు. లేకపోతే సమస్య ఇంకా కొనసాగుతుండగానే పరిష్కారం పూర్తయిందని ప్రకటించినట్లు అవుతుంది. ఇలాంటి సమయంలోనే రిజర్వేషన్లపై చర్చ మళ్ళీ రాజకీయ కేంద్రంగా మారడం గమనించదగిన విషయం.రిజర్వేషన్లపట్ల విముఖతను వ్యక్తం చేస్తూ వచ్చిన బిజెపి రాజకీయ సైద్ధాంతిక వైఖరి నేపథ్యంలో ఈ చర్చను విశ్లేషించడం సహజమే. అయితే రాజకీయ ఉద్దేశం ఏదైనా కావచ్చు. కానీ సమాజం అడగాల్సిన ప్రశ్న మాత్రం వేరే. 'రిజర్వేషన్ల స్థానంలో సామాజిక న్యాయాన్ని మరింత సమర్థంగా సాధించే వ్యవస్థ ఏమిటి'? ఈ ప్రశ్నకు సమాధానం ఇప్పటివరకు స్పష్టంగా వినిపించలేదు. ఎందుకంటే ప్రత్యామ్నయం అనేది ఒక నినాదం కాదు. ఒక సామాజిక నిర్మాణం. కులం అవకాశాలను నిర్ణయించనీ సమాజం. అందరికీ సమాన నాణ్యతతో కూడిన విద్య. భూమి వంటి ఉత్పాదక వనరులపై న్యాయమైన ప్రాప్యత. వివక్ష లేని ఉపాధి. సంపదలో తీవ్రమైన అసమానతలు తగ్గిన ఆర్థిక వ్యవస్థ. అన్ని వర్గాలకు సహజమైన ప్రాతినిధ్యం. ఇలాంటి పరిస్థితులు ఏర్పడితే రిజర్వేషన్లు అవసరం సహజంగానే తగ్గుతుంది. కానీ ఈ పరిస్థితులను సృష్టించకుండా రిజర్వేషన్లను మాత్రమే తొలగించడం అంటే వ్యాధిని అలాగే ఉంచి మందులు తీసేయడమే. అందుకే భారత ప్రజాస్వామ్యం ముందున్న అసలు సవాలు రిజర్వేషన్లను సమర్థించాలా, వ్యతిరేకించాలా అనేది కాదు. సమానత్వాన్ని నిరంతరం వాయిదా వేస్తున్న సామాజిక నిర్మాణాన్ని మార్చగలదా లేదా అనేదే. రిజర్వేషన్లకు ప్రత్యామ్నాయం రిజర్వేషన్లను రద్దు చేయడం కాదు. వాటి అవసరాన్ని అనవసరం చేసే వ్యవస్థను నిర్మించడం. కానీ ఆ సమాజాన్ని నిర్మించే దిశగా మనం నిజంగా ప్రయాణిస్తున్నామా? లేక రిజర్వేషన్లనే ప్రశ్నిస్తూ వాటిని అనివార్యం చేసిన సామాజిక నిర్మాణాన్ని యథాతథంగా కొనసాగిస్తున్నామా? భారత ప్రజాస్వామ్యం చివరికి సమాధానం చెప్పాల్సింది ఈ ప్రశ్నకే.

# ప్రత్యామ్నాయ పంటల సాగుతోనే రైతులకు భరోసా

**- రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి - తక్కువ వర్షాభావ వల్ల వరి సాగు విస్తరణకు దూరంగా ఉండాలి**

**- ఆగస్టు 15 నుంచి 1.05 కోట్ల కుటుంబాలకు స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ**



పెద్దపల్లి,ఆగస్టు 07:(ప్రజాకలం జిల్లాప్రతినిధి)

రాష్ట్రంలో రానున్న రోజుల్లో వర్షపాతం తక్కువగా ఉండే అవకాశాలు ఉన్నందున రైతులను నీటి అవసరం అధికంగా ఉండే వరి సాగుకు బదులుగా ప్రత్యామ్నాయ పంటల సాగు వైపు మళ్లించాలని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి జిల్లా కలెక్టర్లను ఆదేశించారు.శుక్రవారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి,వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు,రాష్ట్ర ఎక్సైజ్,పర్యాటక, సాంస్కృతిక,యువజన సేవల శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.సీజనల్ పరిస్థితులు, వ్యవసాయం,మండల ప్రజావాణి,వనమహోత్సవం,రేషన్ కార్డుల పంపిణీ,చేయూత పెన్షన్లు,పాఠశాల యూనిఫాంల కుట్టు పనుల పురోగతిని సమీక్షించారు.సమీకృత జిల్లా కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు.ఈ సందర్భంగా రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ భారత వాతావరణ శాఖ అంచనాల ప్రకారం రానున్న నెలల్లో వర్షపాతం తగ్గే అవకాశం ఉన్నందున రైతులు వరి వంటి అధిక నీటి అవసరమున్న పంటల సాగును విస్తరించకుండా ప్రత్యామ్నాయ పంటలను సాగు చేసేలా విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు.ప్రస్తుతం కురుస్తున్న వర్షాలను చూసి రైతులు వరి సాగును పెంచే అవకాశం ఉందని, అలాంటి పరిస్థితి భవిష్యత్తులో రైతులకు నష్టాన్ని కలిగించే అవకాశం ఉన్నందున ప్రతి రైతుకు స్పష్టమైన సందేశం చేరేలా వ్యవసాయ అధికారులు పనిచేయాలని ఆదేశించారు.ప్రస్తుతం సాగునీటి విడుదలపై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని,మరో 15 రోజుల పాటు అన్ని ప్రధాన ప్రాజెక్టుల నీటి మట్టాలను సమీక్షించిన అనంతరం పరిస్థితులకు అనుగుణంగా సాగునీటి విడుదలపై నిర్ణయం తీసుకుంటామని తెలిపారు.కృష్ణా,గోదావరి నదీ పరివాహక ప్రాంతాల్లోకి వస్తున్న నీటి ప్రవాహాలను బట్టి అందుబాటులో ఉన్న ప్రతి జల వనరును నింపేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు.అన్ని నీటిపారుదల ప్రాజెక్టుల నీటి నిల్వలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు.రాష్ట్ర ప్రభుత్వం పేదల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి తెలిపారు.గత ప్రభుత్వ హయాంలో కొత్త రేషన్ కార్డుల జారీ జరగలేదని,ప్రస్తుతం తెలంగాణ ప్రభుత్వం పేద కుటుంబాల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని 16 లక్షలకు పైగా కొత్త రేషన్ కార్డులను మంజూరు చేసిందని చెప్పారు.రాష్ట్రంలోని 1.05 కోట్ల రేషన్ కార్డు లబ్ధిదారులందరికీ ఆగస్టు 15 నుంచి తెలంగాణ స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.జిల్లాల్లో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీని పారదర్శకంగా, ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పకడ్బందీగా నిర్వహించి అర్హులైన ప్రతి కుటుంబానికి సకాలంలో అందేలా అన్ని ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్లను ఆదేశించారు.

**జిల్లాలో పంటల వైవిధ్యీకరణ ప్రణాళిక అమలు చేయాలి**
**-వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు**

జిల్లాలో పంటల వైవిధ్యీకరణ కార్యాచరణ ప్రణాళికను యథావిధిగా అమలు చేయాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు. ప్రత్యామ్నాయ పంటలకు అవసరమైన అన్ని రకాల విత్తనాలను రైతులకు ముందుగానే అందుబాటులో ఉంచాలని సూచించారు రాష్ట్రంలో ఇప్పటివరకు 99,81,167 ఎకరాల్లో వివిధ పంటల సాగు జరిగిందని తెలిపారు.స్థానిక ప్రజాప్రతినిధుల సహకారంతో రైతులను ప్రత్యామ్నాయ పంటల సాగు వైపు మళ్లించేందుకు విస్తృత ప్రచారం నిర్వహించాలని సూచించారు.ఆగస్టు 15 తర్వాత వర్షపాతం మరింత తగ్గే అవకాశమున్నందున ప్రతి జిల్లాలో సాగునీటి సలహా సమావేశాలు నిర్వహించి నీటి లభ్యత ఆధారంగా సాగు ప్రణాళిక రూపొందించాలని సూచించారు. అంతర్జాతీయ పరిస్థితుల ప్రభావంతో భవిష్యత్తులో విద్యుత్ సరఫరాపైనా ప్రభావం ఉండే అవకాశమున్నందున నీటి వినియోగంలో అప్రమత్తంగా ఉండాలని,వరి సాగును మరింత పెంచవద్దని స్పష్టం చేశారు. ప్రస్తుతం రాష్ట్రంలో సుమారు 35 లక్షల ఎకరాల్లో వరి సాగు జరిగిందని,అది మరింత పెరగకుండా ప్రత్యామ్నాయ పంటలను ప్రోత్సహించాలని ఆదేశించారు. కంది,పెసర,మినుములు విత్తనాలు రైతులకు అందుబాటులో ఉంచామని, పప్పుధాన్యాల విత్తనాల పంపిణీ కొనసాగుతోందన్నారు.

**వనమహోత్సవం లక్ష్యాలు పూర్తి చేయండి**
**రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు**

వచ్చే నెల నుంచి ఎల్‌నినో ప్రభావం అధికంగా ఉండే అవకాశముందని నిపుణులు సూచిస్తున్నందున ప్రణాళికలు, పంటల వైవిధ్యీకరణ కార్యక్రమాలను మరింత వేగవంతం చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు ఆదేశించారు.రాష్ట్రంలో వరి సాగులో కనీసం 50 శాతం విస్తీర్ణాన్ని ప్రత్యామ్నాయ పంటల వైపు మళ్లించే లక్ష్యంతో పనిచేయాలని సూచించారు.రాష్ట్రవ్యాప్తం గా కనీసం 15లక్షల ఎకరాల్లో ఆయిల్‌పామ్, పప్పుధాన్యాలు,కూరగాయలు,కంది,అలసందలు,పొద్దుతిరుగుడు,చిరుధాన్యాలు వంటి ప్రత్యామ్నాయ పంటలను ప్రోత్సహించాలని తెలిపారు.ఈ కార్యక్రమానికి ప్రజాప్రతినిధుల సంపూర్ణ సహకారం అధికారులకు ఉంటుందని పేర్కొన్నారు.వనమహోత్సవం కింద నిర్దేశించిన మొక్కల నాటే లక్ష్యాలను పూర్తి చేసి,నాటిన మొక్కల సంరక్షణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు.వీబీజీఆర్ఏఎంజీ కార్యక్రమంలో భాగంగా ఈ వర్షాకాలంలో సాధ్యమైనంత ఎక్కువ సంఖ్యలో ఇంకుడు గుంతలను నిర్మించాలని ఆదేశించారు.ఆగస్టు 15 నుంచి 1.05 కోట్ల తెలంగాణ స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించాలని,కొత్త చేయూత పెన్షన్ల అర్హుల జాబితాను ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం సిద్ధం చేసి వచ్చే నెల నుంచి పెన్షన్లు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా వ్యవసాయ అధికారి,పౌర సరఫరాల శాఖ అధికారి,గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు,జిల్లా విద్యాశాఖ అధికారి, నీటిపారుదల శాఖ అధికారులు,సంబంధిత శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ సేవలపై ప్రజల్లో విశ్వాసం కల్పించాలి



**– జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష**

మంథని,ఆగస్టు 07:(ప్రజాకలం జిల్లాప్రతినిధి)

మండలంలో అమలవుతున్న ప్రభుత్వ కార్యక్రమాలు ప్రజలకు పూర్తి స్థాయిలో చేరేలా అన్ని శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు.శుక్రవారం పెద్దపల్లి జిల్లా మంథని ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన మండల స్థాయి సర్వసభ్య సమావేశంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ వ్యవసాయం, వైద్యం,విద్య, మిషన్ భగీరథ,పంచాయతీరాజ్,ఐసీడీఎస్, విద్యుత్,ఉద్యానవనం,రవాణా,నీటిపారుదల,ఆర్ అండ్ బీ తదితర శాఖల అమలు చేస్తున్న కార్యక్రమాల పురోగతిని శాఖల వారీగా సమీక్షించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ వీబీజీ–రామ్‌జీ పథకం కింద చేపడుతున్న జలసిరి కార్యక్రమం,ఇంకుడు గుంతలు,పంటకుంటలు,ఇతర సహజ వనరుల అభివృద్ధి పనులను నిర్ణీత కాలవ్యవధిలో పూర్తి చేసి గ్రామాలకు దీర్ఘకాలిక ప్రయోజనం కలిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.వ్యవసాయ రంగంలో ఆయిల్‌పామ్ సాగు విస్తరణకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని,రైతులకు క్షేత్రస్థాయిలో సాంకేతిక సలహాలు అందించాలని తెలిపారు.యూరియా పంపిణీ పారదర్శకంగా జరిగేలా పర్యవేక్షించడంతో పాటు సేంద్రియ సాగు విధానాలపై రైతులను మరింతగా ప్రోత్సహించాలని సూచించారు.మిషన్ భగీరథ పరిధిలో నీటి సరఫరా వ్యవస్థలో ఉన్న సమస్యలను గ్రామాల వారీగా గుర్తించి,శాశ్వత పరిష్కారాల కోసం సమగ్ర ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు.తాగునీటి సరఫరా ఎక్కడా నిలిచిపోకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని తెలిపారు.ప్రభుత్వ వైద్య సేవలపై ప్రత్యేక దృష్టి సారించాలని,ఆసుపత్రుల్లో అవసరమైన మందులు,వైద్య సిబ్బంది అందుబాటులో ఉండేలా చూడాలని చెప్పారు.ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడం ప్రతి వైద్యాధికారికి ప్రాథమిక బాధ్యత అని పేర్కొన్నారు.విద్యుత్ శాఖ అధికారులు గ్రామాల్లో విద్యుత్ అంతరాయాలు తగ్గించేలా నిర్వహణ పనులు చేపట్టాలని, దెబ్బతిన్న ట్రాన్స్‌ఫార్మర్లను ఆలస్యం చేయకుండా మరమ్మతు చేయడం లేదా అవసరమైతే కొత్తవి ఏర్పాటు చేయాలని సూచించారు.సమావేశంలో ప్రజాప్రతినిధులు ప్రస్తావించిన సమస్యలను శాఖల అధికారులు కేవలం నమోదు చేయడానికే పరిమితం కాకుండా,క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కారానికి స్పష్టమైన కార్యాచరణతో ముందుకు వెళ్లాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు.గ్రామాల్లో అధికారులు తరచూ పర్యటించడం ద్వారా ప్రజలకు ప్రభుత్వ సేవలపై మరింత విశ్వాసం కల్పించవచ్చని ఆయన అన్నారు.ఈ సమావేశంలో మండల ప్రత్యేక అధికారి పూర్ణచందర్ ఈఈ గ్రిడ్,ఏఎంసీ చైర్మన్ కుడుదుల వెంకన్న,పీఏసీఎస్ పర్సన్ ఇంచార్జి కోత శ్రీనివాస్,తెలంగాణ రాష్ట్ర విద్యుత్ సలహా మండలి సభ్యుడు శశిభూషణ్ కాశే,ఆర్టిఏ సభ్యుడు మంథని సురేష్,ఎంపీడీవో శ్రీజ రెడ్డి,తహసీల్దార్ ఆరిఫుద్దీన్,వివిధ శాఖల జిల్లా,మండల అధికారులు,ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# బాధిత కుటుంబాలను పరామర్శించిన జువ్వాడి..



మల్లాపూర్ ఆగస్టు 07 ( ప్రజా కలం ప్రతినిధి) మల్లాపూర్ మండల కేంద్రంలో రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జువ్వాడి కృష్ణారావు శుక్రవారం పలువురు బాధిత కుటుంబాలను పరామర్శించారు. మల్లాపూర్‌కు చెందిన తీపిరెడ్డి అంజిరెడ్డి తల్లి ధర్మవ్వ మృతిచెందిన విషయం తెలుసుకున్న జువ్వాడి కృష్ణారావు ఆమె మృతదేహానికి నివాళులర్పించి, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. అనంతరం అంతిమయాత్రలో పాల్గొన్నారు. అలాగే ఇటీవల గుండె శస్త్రచికిత్స చేయించుకున్న ఎల్లాల శ్రీనివాసరెడ్డి, నవనంది నడిపి నరసయ్య, ఎగ్యరపు వెంకటేశ్వర్లును వారి నివాసాలకు వెళ్లి పరామర్శించి, ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మాట్ల సోమయ్య, డీసీసీ ఉపాధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, స్థానిక ఉపసర్పంచ్ గడ్డం సోమారెడ్డి, మాజీ ఎంపీటీసీ మరిపెల్లి మల్లయ్య, నందు తదితరులు పాల్గొన్నారు.

# మందకృష్ణ చిత్రపటానికి పాలాభిషేకం

**- ఆరోగ్యశ్రీ సాధన దినోత్సవం సందర్భంగా**

**- మండల ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు చెన్న కుమారస్వామి ఆధ్వర్యంలో**



ఎండపల్లి, ఆగస్టు 07 : ( ప్రజా కలం ప్రతినిధి )జగిత్యాల జిల్లా ఎమ్మార్పీఎస్ జిల్లా ఇంచార్జ్ రేణిగుంట్ల సాగర్ ఆదేశాల మేరకు ఎండపల్లి మండల కేంద్రం లో శుక్రవారం రోజున మండల ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు చెన్న కుమారస్వామి ఆధ్వర్యం లో పద్మ శ్రీ మంద కృష్ణ చిత్ర పటానికి పాలాభిషేకం ఆరోగ్యశ్రీ సాధన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యమానికి ముఖ్య అతిథిగా ఎమ్మార్పీ ఎస్ జిల్లా నాయకులు మోకెనపల్లి సతీష్ హాజరై వారు మాట్లాడుతూ పద్మ శ్రీ మంద కృష్ణ చేసిన ఉద్యమ పోరాట ఫలితంగా ఆరోగ్య శ్రీ పథకం ద్వారా గుండె జబ్బు పిల్లలకు ఆరోగ్యశ్రీ పథకం వర్తింపచేసే విధంగా జీవో తీసుకురావడం జరిగింది. దీని ఫలితంగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో దళిత నిరుపేద ఎస్సీ, ఎస్టీ, బీసీ మరియు మైనార్టీ అన్ని వర్గాల ప్రజలకు ఉచితంగా ఆరోగ్యశ్రీ తో కార్పొరేట్ వైద్యం అందించి న ఘనత మంద కృష్ణ కె చెందుతుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమం లో ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు మంతెన లక్ష్మణ్, గజ్జెల రాజేష్, మండల ఉపాధ్యక్షులు మామిడిపల్లి సంతోష్, ఎమ్మార్పీఎస్ నాయకులు ఎనగందుల రమేష్, అశోక్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

# బోరుబావి పనులు ప్రారంభం..

మల్లాపూర్, ఆగస్టు 7 ( ప్రజా కలం ప్రతినిధి) మల్లాపూర్ మండల కేంద్రంలోని వడ్డెర కాలనీలో రూ. 1.20 లక్షల వ్యయంతో మంజూరైన బోరుబావి నిర్మాణ పనులను రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జువ్వాడి కృష్ణారావు శుక్రవారం ప్రారంభించారు. స్థానిక సర్పంచ్ చిట్యాల లక్ష్మణ్‌తో కలిసి పనులకు భూమిపూజ నిర్వహించారు.కాలనీలో తాగునీటి సమస్యను దృష్టిలో ఉంచుకుని ఈ బోరుబావిని మంజూరు చేసినట్లు ఆయన తెలిపారు. ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మాట్ల సోమయ్య, ఉపసర్పంచ్ గడ్డం సోమారెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి, మరిపెల్లి మల్లయ్య, నందు తదితరులు పాల్గొన్నారు.

# గుర్తు తెలియని మహిళకు అంత్యక్రియలు..

మల్లాపూర్, ఆగస్టు 7 ( ప్రజా కలం ప్రతినిధి)

మల్లాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఓబులాపూర్ గ్రామ శివారులో గోదావరి నది ఒడ్డున లభ్యమైన గుర్తు తెలియని మహిళ మృతదేహానికి శుక్రవారం పోస్టుమార్టం అనంతరం అంత్యక్రియలు నిర్వహించారు. మృతురాలి వివరాలను గుర్తించేందుకు పోలీసులు విస్తృతంగా ప్రచారం చేసినప్పటికీ ఎవరూ ముందుకు రాకపోవడంతో, చట్టపరమైన నిబంధనల ప్రకారం మెట్పల్లి మున్సిపాలిటీ సిబ్బంది సహకారంతో గౌరవప్రదంగా అంత్యక్రియలు నిర్వహించారు. ఈ మహిళకు సంబంధించిన వివరాలు తెలిసిన వారు మల్లాపూర్ పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు.



# డా. కడవెండి వేణుగోపాల్ కు గోవా గవర్నర్ ఆహ్వానం



ఖమ్మం ఆగస్టు 07(ప్రజా కలం న్యూస్ ) ఖమ్మం శనివారం ఎకో–క్లబ్ ఎన్విరాన్‌మెంటల్ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షులు , ప్రముఖ పర్యావరణవేత్త డా. కడవెండి వేణుగోపాల్ కి గోవా రాష్ట్ర గౌరవ గవర్నర్ శ్రీ పూసపాటి అశోక్ గజపతి రాజు ని మర్యాదపూర్వకంగా కలిసేందుకు ఆహ్వానం అందింది . 2026 ఆగస్టు 10వ తేదీ మధ్యాహ్నం 12.00 గంటలకు గోవాలోని లోక్ భవన్ (రాజ్ భవన్) లో గవర్నర్ తో సమావేశం కానున్నారు . ఈ సమావేశంలో డా. కడవెండి వేణుగోపాల్ దేశవ్యాప్తంగా తాను నిర్వహిస్తున్న “ప్లాస్టిక్ – రహిత భారత్ (ప్లాస్టిక్ – ఫ్రీ భారత్ )” ఉద్యమం , ఎకో–క్లబ్ ద్వారా చేపడుతున్న పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాలు , ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించేందుకు నిర్వహిస్తున్న అవగాహన కార్యక్రమాలు జూట్ బ్యాగుల ప్రోత్సాహం , వృక్షారోపణ కార్యక్రమాల గురించి గవర్నర్ కి వివరించనున్నారు . అలాగే వాతావరణ మార్పులు (క్లైమేట్ చేంజ్ ), పర్యావరణ పరిరక్షణ , ప్లాస్టిక్ కాలుష్య నియంత్రణ , పచ్చదన విస్తరణ , స్థిరమైన అభివృద్ధి కోసం కేంద్ర మరియు రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టాల్సిన చర్యలపై సూచనలతో కూడిన వినతిపత్రాన్ని (రిప్రెసెంటేషన్ ) గవర్నర్ కి సమర్పించనున్నారు . ఈ సమావేశం ద్వారా పర్యావరణ పరిరక్షణ అంశంపై ప్రభుత్వ స్థాయిలో మరింత చర్చ జరిగి దేశవ్యాప్తంగా ప్లాస్టిక్ – రహిత భారత్ లక్ష్య సాధనకు ప్రోత్సాహం లభిస్తుందని డా. కడవెండి వేణుగోపాల్ ఆశాభావం వ్యక్తం చేశారు .

# బీజేపీ ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలి

**– పెరుగుతున్న ధరలు, జీఎస్టీ భారాలను తగ్గించాలి**

**– సిపిఐ జిల్లా కార్యదర్శి బి. ఆంజనేయులు**




ప్రజాకలం ఆగస్టు 7 (గద్వాల ప్రతినిధి) కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా, కార్మిక, రైతు వ్యతిరేక విధానాలను ప్రజలు ఐక్యంగా తిప్పికొట్టాలని సిపిఐ జోగులాంబ గద్వాల జిల్లా కార్యదర్శి బి. ఆంజనేయులు పిలుపునిచ్చారు. సిపిఐ మండల కార్యదర్శి ఎల్కూరు రంగన్న ఆధ్వర్యంలో మల్దకల్ మండల కేంద్రంలో ఎమ్మార్వో కార్యాలయం నుంచి ఎద్దులగూడెం వరకు పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలను నియంత్రించాలని, జీఎస్టీ భారాన్ని తగ్గించాలని, రైతులకు గిట్టుబాటు ధరకు చట్టబద్ధ హామీ కల్పించాలని, కార్మికుల హక్కులను పరిరక్షించాలని, యువతకు ఉద్యోగాలు కల్పించాలని డిమాండ్ చేశారు. దేశ సంపదను బడా కార్పొరేట్ సంస్థలకు అప్పగించే విధానాలను కేంద్ర ప్రభుత్వం వెంటనే నిలిపివేయాలని కోరారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ తాటికుంట వెంకటేష్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ఆశన్న, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు భారత్, జిల్లా కార్యదర్శి ప్రవీణ్, అంబేద్కర్ హమాలీ కార్మిక సంఘం అధ్యక్షుడు భీమన్న, కార్యదర్శి రాజు, విద్యార్థి సంఘం నాయకుడు సురేందర్, ఏఐటీయూసీ నాయకులు రత్నం, తిమ్మప్ప, రామాంజనేయులు, రాముడు, జమ్మన్న, అయ్యన్న తదితరులు పాల్గొన్నారు.

# కోలూర్ గ్రామంలో ఘనంగా అన్నాభావూ సాఠే జయంతి వేడుకలు



తానూర్,ఆగస్టు 07(ప్రజా కలం ):

మండలంలోని కోలూర్ గ్రామంలో శుక్రవారం సాహితీవేత్త, సామాజిక సంస్కర్త అన్నాభావూ సాఠే జయంతి వేడుకలను అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక సర్పంచ్ మాధవరావు, ఇతర ప్రజాప్రతినిధులు మరియు నాయకులతో కలిసి అన్నాభావూ సాఠే విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ... సమాజ శ్రేయస్సు కోసం, పేదల హక్కుల కోసం అన్నాభావూ సాఠే చేసిన సేవలను, ఆయన పోరాట పటిమను కొనియాడారు. జయంతిని పురస్కరించుకుని విగ్రహం వద్ద సర్పంచ్ మాధవరావు తన సొంత నిధులతో ఇనుప మెట్లను (సిడి) ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ ఉత్తమ్ బాలేరావు, మాజీ సర్పంచులు చంద్రకళ–శ్రీనివాస్ రెడ్డి, తులసీరామ్, నాయకుడు సురేష్ పటేల్‌తో పాటు పెద్ద ఎత్తున గ్రామస్తులు, యువకులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇంటితో పేదల సొంతింటి కల సాకారం: ఎమ్మెల్యే బండ్ల

ప్రజా కలం ఆగస్టు 7 గద్వాల ప్రతినిధి: జోగులాంబ జిల్లా గట్టు మండలం ఆలూరు గ్రామంలో ఇందిరమ్మ ఇల్లు నిర్మాణం పూర్తి చేసుకున్న లబ్ధిదారుడు మహమ్మద్ నూతన గృహప్రవేశ కార్యక్రమానికి గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే లబ్ధిదారులకు గృహప్రవేశ కానుక అందజేయగా, గ్రామస్థులు శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రజాపాలనలో పేదల సొంతింటి కల ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా నెరవేరుతోందన్నారు. గద్వాల నియోజకవర్గంలో తొలి విడతలో 3,500 ఇళ్లు మంజూరై, వాటిలో 2,000కు పైగా ఇళ్ల నిర్మాణం కొనసాగుతోందని తెలిపారు. అర్హులైన ప్రతి కుటుంబానికి దశలవారీగా ఇళ్లు అందేలా ప్రభుత్వం కృషి చేస్తోందని, అపోహలు నమ్మవద్దని సూచించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి, గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిలకు ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ జంబు రామన్ గౌడ్, మాజీ ఎంపీపీ విజయ్, జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షుడు రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



# స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించాలి

**– జిల్లా అదనపు కలెక్టర్లు బి. వెంకటేశ్వర్లు, కిషోర్ కుమార్**




నిర్మల్ ఆగస్టు 07 (ప్రజా కలం జిల్లా ప్రతినిధి)

స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్లు పంద్రాగస్టు వేడుకల నిర్వహణపై సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్లు మాట్లాడుతూ, స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు ప్రోటోకాల్ ప్రకారం అతిథులను ఆహ్వానించాలన్నారు. వేదికను అందంగా ముస్తాబు చేయాలన్నారు. దేశభక్తి ఉట్టిపడేలా విద్యార్థులచే సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించాలని అన్నారు. కార్యక్రమం జరుగుతున్నంత సేపు నిరంతర విద్యుత్ సరఫరా ఉండాలన్నారు. టెంట్, షామియానా, తాగు నీరు ఏర్పాటు చేయాలని చెప్పారు. తగిన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని వివరించారు.

అంబులెన్సు అందుబాటులో ఉంచడంతో పాటు వైద్య శిబిరం ఏర్పాటు చేయాలని తెలిపారు. పార్కింగ్ ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. ఎక్కడా కూడా ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని శాఖలు సమన్వయంతో, ప్రణాళిక ప్రకారం స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను విజయవంతంగా నిర్వహించాలన్నారు. ఈ సమావేశంలో భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, డిఆర్ఓ రాథోడ్ రమేష్, డీఎస్పీ శ్రీనివాస్, ఆర్డీఓ దేవీదాస్, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# యువ న్యాయవాదుల సంక్షేమంపై కేంద్రాన్ని నిలదీసిన ఖమ్మం ఎంపీ రఘురాం రెడ్డి

**– నియర్ న్యాయవాదులకు నెలవారీ స్టైపెండ్, సంక్షేమంపై లోక్‌సభలో ప్రశ్నలు**

**– పట్టణ ప్రాంతాల్లో రూ.20 వేలు, గ్రామీణ ప్రాంతాల్లో రూ.15 వేలు స్టైపెండ్‌ను బీసీఐ సిఫారసు చేసినట్లు కేంద్రం వెల్లడి**



ఖమ్మం ఆగష్టు 07(ప్రజా కలం న్యూస్ )

దేశవ్యాప్తంగా తొలి దశలో ప్రాక్టీస్ చేస్తున్న యువ న్యాయవాదులు ఎదుర్కొంటున్న ఆర్థిక, వృత్తిపరమైన ఇబ్బందులపై ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి లోక్‌సభలో కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. జూనియర్ న్యాయవాదులకు నెలవారీ స్టైపెండ్, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు, విద్యా రుణాలు, న్యాయ సహాయ ప్రోత్సాహకాలు, సామాజిక భద్రత వంటి అంశాలపై ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల వివరాలను కోరారు.

ఈ ప్రశ్నలకు కేంద్ర న్యాయశాఖ సహాయ మంత్రి అర్జున్‌రామ్ మేఘ్వాల్ లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు.

**స్టైపెండ్‌పై బీసీఐ సిఫారసు..**

యువ న్యాయవాదులు ఎదుర్కొంటున్న ఆర్థిక, వృత్తిపరమైన సమస్యలను ప్రభుత్వం గుర్తించిందని మంత్రి తెలిపారు. ఈ నేపథ్యంలో బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (బీసీఐ) 2024 అక్టోబర్ 15న జారీ చేసిన సర్క్యులర్‌లో జూనియర్ న్యాయవాదులకు కనీస నెలవారీ స్టైపెండ్‌ను సిఫారసు చేసినట్లు వెల్లడించారు. పట్టణ ప్రాంతాల్లో పనిచేసే జూనియర్ న్యాయవాదులకు రూ. 20 వేలు, గ్రామీణ ప్రాంతాల్లో రూ. 15 వేల చొప్పున, సాధారణంగా కనీసం మూడు సంవత్సరాల పాటు చెల్లించాలని సూచించినట్లు పేర్కొన్నారు.

**జాతీయ సంక్షేమ విధానంపై ప్రతిపాదన లేదు**

న్యాయవాదుల సంక్షేమం, సామాజిక భద్రత, పదవీ విరమణ ప్రయోజనాల కోసం ప్రత్యేక జాతీయ విధానాన్ని తీసుకురావాలనే ప్రతిపాదన ప్రస్తుతం పరిశీలనలో లేదని కేంద్రం స్పష్టం చేసింది.

**రాష్ట్ర బార్ కౌన్సిళ్లకే సంక్షేమ బాధ్యత**

అడ్వకేట్స్ వెల్ఫేర్ ఫండ్ చట్టం–2001 ప్రకారం న్యాయవాదుల సంక్షేమం రాష్ట్ర బార్ కౌన్సిళ్ల పరిధిలోనే ఉంటుందని కేంద్ర మంత్రి వివరించారు. రాష్ట్ర అడ్వకేట్స్ వెల్ఫేర్ ఫండ్‌ల ద్వారా న్యాయవాదులకు ఆర్థిక సహాయం అందించడంతో పాటు, ప్రస్తుతం అమల్లో ఉన్న అడ్వకేట్స్ చట్టం–1961లోని నిబంధనల ప్రకారం రాష్ట్ర బార్ కౌన్సిళ్లు, బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా అవసరమైన సంక్షేమ పథకాలు అమలు చేయడానికి, నిధులు ఏర్పాటు చేయడానికి అధికారాలు కలిగి ఉన్నాయని వివరించారు.

# కనుమరుగైన కరకల్ల రోడ్డు

**- రెవిన్యూ నక్ష ప్రకారం గుర్తించి మరమ్మతులు చేయండి**

మల్హర్, ఆగస్టు 07 ప్రజాకలం ప్రతినిధి : తాడిచర్ల గ్రామం కాపురం శివారులోని కరకల్ల రహదారిని ప్రభుత్వ పాత నక్ష (రెవెన్యూ మ్యాప్) ప్రకారంగా గుర్తించి, తక్షణమే మరమ్మతులు చేపట్టాలని కోరుతూ శుక్రవారం తాడిచర్ల గ్రామ రైతులు అందరూ కలిసి మల్హర్ రావు మండల తహసీల్దార్ కె. రవి కుమార్ కు వినతిపత్రం అందజేశారు.

ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ. ఈ కరకల్ల రోడ్డు మార్గం కాలక్రమేణా పాత నక్ష ప్రకారం కనుమరుగైపోయిందని, సరిహద్దులు స్పష్టంగా లేకపోవడం వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల కురుస్తున్న వర్షాల వల్ల రోడ్డు మొత్తం లోతైన గుంతలతో, పూర్తిగా బురదమయంగా మారిపోయిందని తెలిపారు. దీనివల్ల నిత్యం వందలాది మంది రైతులు, కూలీలు మరియు పశువుల కాపరులు తమ పంట పొలాలకు వెళ్ళడానికి నరకయాతన అనుభవిస్తున్నారని, కనీసం నడవడానికి కూడా వీలులేని పరిస్థితి నెలకొందని వివరించారు. కావున రెవెన్యూ అధికారులు తక్షణమే స్పందించి ఈ రోడ్డు ను ఆక్రమించిన వారి పై చట్ట ప్రకారం చర్యలు తీసుకోని, పాత నక్ష ప్రకారం ఈ రహదారి సరిహద్దులను సర్వే చేసి మింగిసా కుంటా బార్డర్, అటు బ్రాహ్మణుల మామిడి తోట,ఇటు చాత్రజు పల్లి రోడ్డు వరకు, బురద రోడ్డుకు మరమ్మతులు చేపట్టి రైతులకు మెరుగైన రవాణా సౌకర్యం కల్పించాలని వారు డిమాండ్ చేశారు. మా సమస్య పరిష్కారం కాకుంటే ధర్నాలు కూడా చేస్తాం అంటున్న రైతులు. ఈ కార్యక్రమంలో తాడిచర్ల గ్రామ రైతులు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# హీరో ప్రభాస్ కోసం అభిమాని పాదయాత్ర: తల్లాడకు చేరుకున్న బత్తుల తిరుపతరావు

తల్లాడ: ఆగస్టు 7 (ప్రజా కలం న్యూస్ ):

తన అభిమాన హీరో ప్రభాస్‌ను ఎలాగైనా కలవాలనే బలమైన సంకల్పంతో ఎన్టీఆర్ జిల్లా విస్సన్నపేట మండలం కూనపరాజుపర్వ గ్రామానికి చెందిన బత్తుల తిరుపతరావు పాదయాత్ర చేపట్టారు. హైదరాబాద్‌లో ఉన్న ప్రభాస్‌ను కలిసేందుకు ఆయన తన గ్రామం నుంచి కాలినడకన బయలుదేరారు. ఈ పాదయాత్రలో భాగంగా తిరుపతరావు గురువారం (6వ తేదీన) తిరువూరు, కల్లూరు మండలాల మీదుగా ప్రయాణించి, శుక్రవారం (7వ తేదీన) తల్లాడ మండలానికి చేరుకున్నారు. దారిపొడవునా ప్రభాస్ అభిమానులు, స్థానికులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. తిరుపతరావు చూపిస్తున్న అభిమానాన్ని అభినందిస్తూ ఆయనకు మద్దతుగా నిలిచారు. అభిమాన హీరోను కలిసి తన కల నెరవేర్చుకుంటాననే నమ్మకంతో ఆయన ముందుకు సాగుతున్నారు.




# మండల్ కమిషన్ అమలు ప్రకటనతో దేశ రాజకీయాల్లో చారిత్రక మలుపు

**– టీఎంహెచ్డీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కొరిపల్లి శ్రీనివాస్**



ఖమ్మం ఆగష్టు 07(ప్రజా కలం న్యూస్ )న్యూఢిల్లీ,1990 ఆగస్టు 7న అప్పటి ప్రధానమంత్రి విశ్వనాథ్ ప్రతాప్ సింగ్ (వి.పి. సింగ్) లోక్‌సభలో మండల్ కమిషన్ సిఫార్సుల అమలును ప్రకటించడం భారత రాజకీయ చరిత్రలో కీలక ఘట్టంగా నిలిచింది. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో ఇతర వెనుకబడిన తరగతులకు (ఓబీసీ ) 27 శాతం రిజర్వేషన్ కల్పిస్తున్నట్లు ఆయన ప్రకటించారు. అనంతరం ఈ నిర్ణయంపై దేశవ్యాప్తంగా చర్చలు, ఆందోళనలు జరిగాయి. 1992లో ఇంద్రా సహానీ కేసులో సుప్రీంకోర్టు ఈ విధానాన్ని సమర్థించింది. ఈ చారిత్రక నిర్ణయం సామాజిక న్యాయం, సమాన అవకాశాల దిశగా కీలక మైలురాయిగా నిలిచిందని టీఎంహెచ్డీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కొరిపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు.

# పేద కుటుంబానికి అండగా చనుపల్లి గ్రామ అభివృద్ధి కమిటీ

**మరణించిన పెరుమాళ్ల వెంకన్న కుటుంబానికి రూ.10 వేల ఆర్థిక సహాయం**



కోదాడ ఆగస్టు 07( ప్రజా కలం న్యూస్)

మానవత్వానికి నిదర్శనంగా చనుపల్లి గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు మరోసారి తమ సామాజిక బాధ్యతను చాటుకున్నారు. గ్రామంలో ఇటీవల ఆకస్మికంగా మరణించిన పెరుమాళ్ల వెంకన్న కుటుంబానికి అండగా నిలుస్తూ, కమిటీ సభ్యులు మరియు గ్రామ పెద్దలు కలిసి రూ. 10,000 ఆర్థిక సహాయాన్ని అందజేశారు. కుటుంబ పెద్దను కోల్పోయి తీవ్ర విషాదంలో ఉన్న వెంకన్న కుటుంబానికి కొంతైనా భరోసా కల్పించాలనే ఉద్దేశంతో ఈ సహాయాన్ని అందించినట్లు గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు తెలిపారు. కష్టకాలంలో గ్రామ ప్రజలు ఒకరికొకరు తోడుగా నిలవడం గ్రామ ఐక్యతకు నిదర్శనమని వారు పేర్కొన్నారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు మాట్లాడుతూ, ఆపదలో ఉన్న కుటుంబాలను ఆదుకోవడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని తెలిపారు. భవిష్యత్తులో కూడా గ్రామ ప్రజలకు అవసరమైన సందర్భాల్లో అభివృద్ధి కమిటీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు, మృతుడి కుటుంబ సభ్యులు, యువత, అభిమానులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని వెంకన్న కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు.

# బాలల భద్రతే సమాజ భవిష్యత్తు

**-జిల్లా బాలల పరిరక్షణ అధికారి రవి సాగర్**



ప్రజా కలం ఆగస్టు 7 గద్వాల ప్రతినిధి:

జోగులాంబ గద్వాల జిల్లా మల్దకల్ మండల కేంద్రంలోని పీఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బాలల రక్షణ, హక్కులు, సాధికారతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా బాలల పరిరక్షణ అధికారి రవి సాగర్ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు బాలల హక్కులు, భద్రత, విద్య, వ్యక్తిత్వ వికాసం, సాధికారతపై అవగాహన కల్పించారు. సమస్యలు ఎదురైనప్పుడు భయపడకుండా ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు లేదా సంబంధిత అధికారులకు తెలియజేయాలని సూచించారు. ఎంఈఓ జి. సురేష్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థికి సురక్షితమైన, ఆహ్లాదకరమైన విద్యా వాతావరణం కల్పించడం అందరి బాధ్యత అని తెలిపారు. బాలల హక్కులు, భద్రతపై అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయులు రాజేశ్వర్ రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఉద్యోగ భద్రత టీఎంయూతోనే సాధ్యం

**టీఎంయూ రాష్ట్ర నాయకులు**

ప్రజా కలం ఆగస్టు 7 గద్వాల ప్రతినిధి : గద్వాల్ డిపోలో టీఎంయూ అధ్యక్షుడు వి. కొండాచారి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో టీఎంయూ రాష్ట్ర అధ్యక్షుడు శంకర్, ప్రధాన కార్యదర్శి అశ్వద్ధామ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ, ఆర్టీసీ ఎన్నికలు కీలకమని, ఉద్యోగుల భవిష్యత్తు కోసం టీఎంయూకు మద్దతు ఇవ్వాలని కోరారు. అశ్వద్ధామ రెడ్డి మాట్లాడుతూ, ఉద్యోగ భద్రత, మెరుగైన మాస్టర్ పే స్కేల్, కార్మికుల హక్కుల పరిరక్షణ టీఎంయూతోనే సాధ్యమవుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శులు నిరంజన్, రేకులపల్లి శేశన్న, రీజినల్ కమిటీ సభ్యులు, డిపో నాయకులు, భారీ సంఖ్యలో కార్మికులు, ఉద్యోగులు పాల్గొన్నారు.



## కబ్రస్తాన్ భూమి సర్వే చేసి ఇవ్వాలని ఎమ్మార్వో వినతి పత్రం ఇచ్చిన ముస్లిం పెద్దలు



నిర్మల్ ఆగస్టు 07 (ప్రజా కలం జిల్లా ప్రతినిధి)

కుబీర్ మండల కేంద్రంలో 156 సర్వే నెంబర్లో 1.21 గుంటల విస్తీర్ణం గల స్మశాన భూమిని మాకు కోలతలు చేసి ఇవ్వాలని కుబీర్ ముస్లిం మత పెద్దలు శుక్రవారం స్థానిక తహశీల్దార్ శ్రీ దేవి ని వినతి పత్రం అందించారు. అ స్మశాన భూమి సరిహద్దు భాగంలో ఎవరిని ఇబ్బంది కలగకుండా సరిహద్దులలో కంచెం లేదా బౌండరీని నిర్మించుకుంటామని తెలిపారు.

## కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌ని కలిసిన ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్



నిర్మల్ ఆగస్టు 07 (ప్రజా కలం జిల్లా ప్రతినిధి) ఢిల్లీలో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌తో ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ శుక్రవారం మర్యాద పూర్వకంగా భేటీ అయ్యారు. నియోజకవర్గంలోని పలు అభివృద్ధి పనులు, ప్రజా సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లడానికే ఆయన ఢిల్లీ వెళ్లినట్లు తెలిపారు. ఈ సందర్భంగా నియోజకవర్గానికి సంబంధించిన వివిధ అంశాలపై మంత్రితో వివరంగా చర్చించారు. నిధుల మంజూరు, కేంద్ర పథకాల అమలుపై సానుకూలంగా స్పందించాలని కోరారు.

## గద్వాలలో ఘనంగా జాతీయ చేనేత దినోత్సవ వేడుకలు



ప్రజా కలం ఆగస్టు 7 గద్వాల ప్రతినిధి:జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా కలెక్టర్ కార్యాలయం ఐడీఓసీ సమావేశ మందిరంలో చేనేత ఒ జౌళి శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, అదనపు కలెక్టర్ నర్సింహారావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ చేనేత దుస్తులు ధరించి చేనేత కార్మికులను ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు. గద్వాల చేనేత బ్రాండ్‌ను పరిరక్షిస్తూ సహకార సంఘాలను బలోపేతం చేయడంతో పాటు కార్మికులకు బ్యాంకు రుణాలు అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో ఇటీవల ఎన్నికైన చేనేత సహకార సంఘాల అధ్యక్షులను, సీనియర్ కార్మికులను సన్మానించారు. అలాగే చేనేత కార్మికులకు రూ.85 లక్షల విలువైన నేతన్న భద్రత చెక్కులు పంపిణీ చేయగా, వ్యాసరచన, ఉపన్యాస పోటీల్లో విజేతలైన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ తుమ్మల జయలక్ష్మి, వాల్మీకి బోయ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ గట్టు తిమ్మప్ప, ఏడీ ఇందిర, ప్రజాప్రతినిధులు, చేనేత సహకార సంఘాల ప్రతినిధులు, మాస్టర్ వీవర్స్, చేనేత కార్మికులు పాల్గొన్నారు.

## అంగన్వాడి కేంద్రంలో ఘనంగా తల్లిపాల వారోత్సవాలు

**– సూపర్వైజర్ రాజ్యలక్ష్మి ఆధ్వర్యంలో బోడ అమ్రూ నాయక్ తండలో**

**– ముఖ్య అతిథులుగా ఐదవ వార్డు కౌన్సిలర్ బోడ భాస్కర్ బోడ రెడ్డి**

ప్రజా కలం న్యూస్ మరిపెడ ఆగస్టు 7

మహబూబాద్ జిల్లా మరిపెడ మున్సిపాలిటీ కేంద్రంలోని ఐదవ వార్డ్ బోడ అమ్రు నాయక్ తండాలోనీ అంగన్వాడి కేంద్రంలో సంయుక్తంగా ప్రపంచ తల్లిపాల వారోత్సవాలను సూపర్వైజర్ రాజ్యలక్ష్మి ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఐదవ వార్డు కౌన్సిలర్ బోడ భాస్కర్ బిఆర్ఎస్ నాయకులు బోడ రెడ్డి హాజరై చిన్నపిల్లలకు అన్నప్రసాన్న అక్షరాభ్యాసాలు ఘనంగా నిర్వహించారు అనంతరం గర్భిణీ స్త్రీలకు బాలింతలకు తల్లిపాల ప్రాముఖ్యతపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి తల్లి తన బిడ్డకు జన్మనిచ్చిన గంటలోపే ముర్రుపాలు త్రాగించాలన్నారు తల్లిపాలు శిశువుకు అమృతం లాంటివన్నారు తల్లిపాలు శ్రేష్టమైన పోషక విలువలు కలిగినవి అన్నారు పిల్లలను బలంగా ఉంచడానికి అవి ఎంతో ఉపయోగపడతాయి అన్నారు పుట్టిన బిడ్డకు కనీసం 6 నెల వరకు తల్లిపాలు మాత్రమే తాగించాలని అన్నారు తల్లిపాలు పొందడంపై ప్రతి శిశువుకు హక్కు అని ప్రతి తల్లి తన మాతృత్వాన్ని మాతృ బాధ్యతను గుర్తించి పిల్లలకు తల్లిపాలు అందించాలన్నారు ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి తల్లిపాలు ఎంతో దోహదపడతాయన్నారు ఈ కార్యక్రమంలో అంగన్వాడి టీచర్లు లక్ష్మి రాధ శివకుమారి కలమ్మ జయమ్మ ఆశ వర్కర్ జ్యోతి పిల్లల తల్లిదండ్రులు హాజరయ్యారు



## పార్టీ బలోపేతానికి సమిష్టిగా కృషి చేయాలి

**ఇలా ఈనెల 25 లోగా మండల కమిటీ పూర్తి చేయాలి**

**నిబంధనల మేరకు మండల కమిటీ ఏర్పాటు – సన్నాహక కమిటీ ఇంచార్జ్ లక్ష్మీనారాయణ**

మహబూబ్ నగర్ ప్రజా కలం ప్రతినిధి ఆగష్టు 07:

కాంగ్రెస్ బలోపేతానికి సమిష్టిగా కృషి చేయాలని కాంగ్రెస్ హన్వాడ సన్నాహాగా కమిటీ ఇన్చార్జి లక్ష్మీనారాయణ అన్నారు. శుక్రవారం హన్వాడ మండలంలోని పార్టీ కార్యాలయంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మహేందర్ అధ్యక్షత నిర్వహించిన సన్నాక సమావేశంలో ఆయన మాట్లాడారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ నిబంధనల మేరకు మండల కమిటీలు ఏర్పాటు చేయడం జరుగుతుందని ఆయన వివరించారు పార్టీకి కష్టపడ్డ కార్యకర్తల అందరికీ సమన్యాయం జరుగుతుందని అన్ని వర్గాల వారికి సముచిత స్థానం కల్పించడం జరుగుతుందని మహిళలకు కూడా సముచిత స్థానం కల్పించడం జరుగుతుందని ఆయన గుర్తు చేశారు ఈనెల 25 లోగా పూర్తిస్థాయిలో మండల కమిటీ ఏర్పాటు చేయడం జరుగుతుందని ఆయన గుర్తు చేశారు అనంతరం డిసిసి ఉపాధ్యక్షుడు వేముల కృష్ణయ్య. డిసిసి ప్రధాన కార్యదర్శి. సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యే. డిసిసి నిర్ణయం మేరకే కమిటీలు ఏర్పాటు చేయడం జరుగుతుందని ఇందులో ఎవరి ప్రమేయం ఉండదని ఆయన గుర్తు చేశారు అన్ని వర్గాలకు సమన్యాయం చేయడంతో పాటు పార్టీ అభివృద్ధి



కూడా దిశా నిర్దేశం చేయడం జరుగుతుందని వారు గుర్తు చేశారు అనంతరం పలువురు నాయకులు మాట్లాడుతూ అధిష్టానానికి సూచనలు సలహాలు ఇవ్వడమే కాకుండా తమ తమ అభిప్రాయాలు కూడా వెల్లడించారు కమిటీ ఏర్పాటుకు ఈ నెల 17న మరోసారి సమావేశం నిర్వహించే అవకాశం ఉందని వారు వివరించారు.

ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు. టంకార కృష్ణయ్య. డిసిసి నెంబర్ షబ్బీర్ హుస్సేన్. ఇస్నాద్ సుధాకర్ మహిళా అధ్యక్షురాలు నవనీత. డిసిసి ప్రధాన కార్యదర్శి జిన్నే వెంకటయ్య. రైతు సమన్వయ కమిటీ అధ్యక్షుడు గంగిరెడ్డి. మండల సీనియర్ వి. యాదవ రెడ్డి. లింగం నాయక్ గండేటి నర్సింలు. దాసరి రఘు. నాయకులు ఎస్సీ ఎస్టీ బీసీ సెల్ అధ్యక్ష కార్యదర్శులు కాంగ్రెస్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు

## ఆగస్టు 15న ముఖ్యమంత్రి చేతులమీదుగా

# స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

**- పంట మార్పిడి విధానాలతో రైతులకు నష్టం ఉండదు**

**- అందుబాటులోని నీటిని శాస్త్రీయంగా వినియోగించుకోవాలి**

**- వన మహోత్సవం లక్ష్యాలను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలి**

**- రాష్ట్ర మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, జూపల్లి కృష్ణారావు**



నిర్మల్ ఆగస్టు 07 (ప్రజా కలం జిల్లా ప్రతినిధి)

ప్రస్తుత వాతావరణ పరిస్థితులు, వన మహోత్సవం, స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ, వ్యవసాయ రంగం, నీటి వినియోగం తదితర అంశాలపై రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, వ్యవసాయ మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, అటవీ, పర్యావరణ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజుతో కలిసి శుక్రవారం హైదరాబాద్ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ, రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ఆగస్టు 15న రాష్ట్రవ్యాప్తంగా 1 కోటి 6 లక్షల స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. జిల్లాల్లో పంపిణీ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించేందుకు ముందస్తు ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అలాగే ప్రాజెక్టుల్లో అందుబాటులో ఉన్న నీటిని అవసరాలకు అనుగుణంగా శాస్త్రీయంగా వినియోగించేలా ప్రణాళికలు రూపొందించాలని, ఎక్కడా తాగునీటి కొరత తలెత్తకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ, పంట మార్పిడి విధానాల అమలు ద్వారా రైతులు నష్టాలను నివారించడంతో పాటు అధిక ఆదాయం పొందే అవకాశం ఉంటుందని తెలిపారు. రైతులకు పంటల వైవిధ్యంపై అవగాహన కల్పించి, ప్రత్యామ్నాయ పంటల సాగును ప్రోత్సహించాలని అధికారులకు సూచించారు. భూగర్భ జలాల పెంపు కోసం చేపట్టిన పంట కుంటల నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు మాట్లాడుతూ, రైతులకు అందుబాటులో ఉన్న నీటి వనరులు, సాగు ప్రణాళికలపై స్పష్టమైన సమాచారం అందించేందుకు గ్రామ స్థాయిలో ఇరిగేషన్ అడ్వైజరీ సమావేశాలు నిర్వహించాలని తెలిపారు. ఈ సమావేశాల్లో రైతులు, ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు విస్తృతంగా పాల్గొనేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే వన మహోత్సవం లక్ష్యాలను నిర్దేశిత గడువులోగా పూర్తి చేసి, నాటిన ప్రతి మొక్కకు జియో ట్యాగింగ్ పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం జిల్లాల వారీగా వర్షపాతం, పంటల సాగు, నీటి లభ్యత తదితర అంశాలను సమీక్షించారు. కలెక్టరేట్ సమావేశ మందిరం నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా, సమావేశం అనంతరం అధికారులతో సమీక్ష నిర్వహించారు. వన మహోత్సవం లక్ష్యాలను గడువులోగా పూర్తి చేయడంతో పాటు నాటిన మొక్కల సంరక్షణపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఆగస్టు 15న స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీకి అన్ని ఏర్పాట్లు సమయానికి పూర్తి చేయాలని ఆదేశించారు. అలాగే గ్రామ స్థాయిలో ఇరిగేషన్ అడ్వైజరీ సమావేశాలను సమర్థవంతంగా నిర్వహించి, రైతులకు నీటి వినియోగం, పంటల ఎంపికపై అవగాహన కల్పించాలని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్లు బి. వెంకటేశ్వర్లు, కిషోర్ కుమార్, డీఎఫ్ఓ సుశాంత్ సుఖదేవ్ బోబడే, డీఆర్ఓ రాథోడ్ రమేష్, డీఆర్‌డీఓ విజయలక్ష్మి, జిల్లా పౌరసరఫరాల అధికారి రాజేందర్, డీఈఓ భోజన్న, జిల్లా వ్యవసాయ అధికారి అంజి ప్రసాద్, ఉద్యానవన శాఖ అధికారి రమణ, సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## పోడు భూముల వివాదం నేపథ్యంలో అటవీ అధికారులు, గ్రామస్తులు సంయమనం పాటించాలి



**- జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా**

నిర్మల్ ఆగస్టు 07 (ప్రజా కలం జిల్లా ప్రతినిధి)

కడెం మండలం ఉడుంపూర్ గ్రామంలో పోడు భూముల వివాదం నేపథ్యంలో అటవీ అధికారులు, గ్రామస్తులు సంయమనం పాటించాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా సూచించారు. శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఉడుంపూర్ గ్రామస్తులు, అటవీ, రెవెన్యూ, పోలీసు శాఖ అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని పోడు భూముల రైతులు, అటవీ శాఖ అధికారులతో కలెక్టర్ విడివిడిగా చర్చించి సమస్యలను తెలుసుకున్నారు. సమస్యలు తలెత్తినప్పుడు పరస్పర చర్చల ద్వారానే పరిష్కరించుకోవాలని, ఎటువంటి ఇబ్బందులు ఎదురైనా వెంటనే జిల్లా యంత్రాంగం దృష్టికి తీసుకురావాలని సూచించారు. సమస్యల పరిష్కారానికి జిల్లా పరిపాలన పూర్తి స్థాయిలో కృషి చేస్తుందని ఆయన భరోసా ఇచ్చారు. జిల్లా ఎస్పీ జానకి షర్మిల మాట్లాడుతూ, గ్రామస్తులు శాంతియుత వాతావరణాన్ని కాపాడుతూ సమస్యలను చట్టబద్ధంగా



పరిష్కరించుకోవాలని కోరారు. ప్రజల సమస్యల పరిష్కారానికి అధికారులు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉన్నారని, ఏ చిన్న సమస్య ఉన్నా వెంటనే సంబంధిత ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, డీఎఫ్ఓ సుశాంత్ సుఖదేవ్ బోబడే, ఆర్డీఓ దేవీదాస్, డీఎస్పీ శ్రీనివాస్, వివిధ శాఖల అధికారులు, ఉడుంపూర్ గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ స్వయంభూ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి భక్తులకు ఆహ్వానం




ప్రజా కలం ఆగస్టు 7 గద్వాల ప్రతినిధి:శ్రీ స్వయంభూ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో ఈనెల 8వ తేదీ నుండి 15వ తేదీ వరకు నిర్వహించనున్న సప్తాహ భజన మహోత్సవాలకు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని దేవాలయ వ్యవస్థాపక వంశీయుడు శ్రీ కృష్ణ మాన్య పట్వారి ప్రహల్లాదరావు మరియు దేవాలయ ఈవో సత్య చంద్రారెడ్డి కోరారు. ఈ కార్యక్రమ ప్రారంభోత్సవానికి గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి విశిష్ట అతిథిగా హాజరై ఉదయం 10:30 గంటలకు సప్తాహ భజన కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు తెలిపారు. కావున భక్తులందరూ ఈ ఆధ్యాత్మిక వేడుకలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందాలని నిర్వాహకులు విజ్ఞప్తి చేశారు.

## బోంద్రేట్ అంగన్వాడీ లో యూనిఫాంలు పంపిణీ చేసిన సర్పంచ్ రవీందర్ పటేల్



తానూర్, ఆగస్టు 07(ప్రజా కలం): తల్లిపాల వారోత్సవాల సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమాన్ని గ్రామ సర్పంచ్ సింధే రవీందర్ పటేల్ ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా అంగన్వాడీ పిల్లలకు యూనిఫారాలు, కోడిగుడ్లు పంపిణీ చేయడంతో పాటు చిన్న పిల్లలకు అన్నప్రాసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి తిరుపతిరెడ్డి, అంగన్వాడీ టీచర్, ఐకేపీ వీఓఏ మరియు స్థానిక మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేశారు.

## నల్లబ్యాడ్జిలతో ప్రభుత్వ పాఠశాలలకు ఉపాధ్యాయులు విధులకు హాజరు




తల్లాడ, ఆగస్టు 7 ప్రజా కలం న్యూస్ రాష్ట్ర ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ పిలుపులో భాగంగా తల్లాడ మండలం లో ఉన్న అన్ని ప్రభుత్వ పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు శుక్రవారం నల్లబ్యాడ్జి లతో విధులకు హాజరైనారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ మా న్యాయమైన సమస్యల కోసం రాష్ట్ర ఉపాధ్యాయ సంఘాల పిలుపు మేరకు శాంతి యుతంగా విధులకు హాజరువుతూ నల్ల బ్యాడ్జిలతో నిరసన తెలుపుతున్నాము అన్నారు. పెండింగ్ లో ఉన్న పి ఆర్ సి ని వెంటనే అమలు చేయాలని, పెండింగ్ లో ఉన్న 6 డిఏ లు వెంటనే విడుదల చేయాలని ఉపాధ్యాయులు నిరసన తెలపడం జరిగింది. ప్రభుత్వం వెంటనే స్పందించి మా న్యాయమైన డిమాండ్స్ ను వెంటనే పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమం లో ఉపాధ్యా యులు గిరిజరాణి, లాల్ సయ్యద్, రామక్రిష్ణ స్వామి, రామారావు, తాళ్లురి. శ్రీనివాస్ రావు, గిరిజదేవి, రత్న కుమారి, ఇమ్మానియేల్ రాజు, గోపాల్, విధ్యాధర, మురళి క్రిష్ణ, స్వరాజ్యలక్ష్మి, రాములు, సైధులు, తదితరులు పాల్గొన్నారు.

## వాగ్దేవి పాఠశాలలో కన్నుల పండువగా బోనాల సంబరాలు







తానూర్,ఆగస్టు 07(ప్రజా కలం): మండల కేంద్రమైన తానూర్ లోని వాగ్దేవి విద్యానికేతన్ పాఠశాలలో శుక్రవారం ముందస్తు బోనాల సంబరాలు కన్నుల పండువగా సాగాయి, పాఠశాల డైరెక్టర్ అరవింద్ రెడ్డి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి ఈ వేడుకలను ఘనంగా ప్రారంభించారు,ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలకు బోనాల పండుగ ప్రతీక అని పేర్కొంటూ, విద్యార్థులకు పండుగ విశిష్టతను వివరించారు,ఈ వేడుకల్లో విద్యార్థులు ధరించిన పోతురాజుల వేషధారణలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి, విద్యార్థినులు బోనాలతో, పాటలు పాడుతూ, ఆడుతూ అత్యంత ఉత్సాహంగా సంబరాల్లో పాల్గొన్నారు,

ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ ఉషాకిరణ్మాయి, డైరెక్టర్ అవినాష్, సుమలత,ఉపాధ్యాయులు రాధ, మంజుల, మణిత, శ్యామల, మౌనిక, కె. అర్చన, విణిత, లావణ్య, పద్మిని, పూజ,స్వాతీ, స్వాతిక రెడ్డి, మమతా,కోమల్,నిఖిత, , స్వప్న, శివాణి , భోజరాం ,రాజన్న,ఆకాష్, షకీల్ ,శ్రీనివాస్,మారుతి, క్రీష్ణ, ప్రభానంద్ తో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రజాదర్బార్‌తో వెలుగులోకి వెలుతురు భద్రమ్మ భూవివాదం

## - పొంగులేటి ప్రజాదర్బార్‌లో ఫిర్యాదుతో కదిలిన రెవెన్యూ యంత్రాంగం
## - 309, 310 సర్వే నంబర్లలో క్షేత్రస్థాయి పరిశీలన



పాలేరు ఆగష్టు 07(ప్రజా కలం న్యూస్ ) రెవిన్యూ శాఖ, గృహ నిర్మాణ, సమాచార మంత్రివర్యులు రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజాదర్బార్‌లో అందిన ఫిర్యాదుతో వెలుతురు భద్రమ్మ భూవివాదం మరోసారి తెరపైకి వచ్చింది. మే 5న మంగళగూడెం గ్రామంలో నిర్వహించిన ప్రజాదర్బార్‌లో గోళ్లపాడు గ్రామానికి చెందిన వెలుతురు భద్రమ్మ తన భూమికి సంబంధించిన పత్రాలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. ఫిర్యాదులోని అంశాలను పరిశీలించిన రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయి విచారణకు శ్రీకారం చుట్టారు. తహసీల్దార్ విజయేంద్రరెడ్డి ఆదేశాల మేరకు ఖమ్మం రూరల్ సర్వేయర్ వినోద్‌కుమార్ శుక్రవారం గోళ్లపాడు గ్రామంలోని 309, 310 సర్వే నంబర్ల వద్దకు వెళ్లి భూమిని పరిశీలించారు. రికార్డుల్లోని వివరాలు, భూమి సరిహద్దులు, క్షేత్రస్థాయిలో ఉన్న పరిస్థితులను పరిశీలించినట్లు సమాచారం.

**పాత పత్రాల పరిశీలన....** క్షేత్రస్థాయి పరిశీలనలో భాగంగా వెలుతురు భద్రమ్మ వద్ద ఉన్న వారసత్వ పత్రాలు, రిజిస్ట్రేషన్ పత్రాలు, భూ హక్కులకు సంబంధించిన ఇతర డాక్యుమెంట్లను అధికారులు పరిశీలించినట్లు తెలిసింది. అలాగే లంజపల్లి కోటయ్య కుటుంబానికి సంబంధించిన వారసత్వ వివరాలు, 1965లో జరిగిన భూ కొనుగోలుకు సంబంధించిన పత్రాలు, భద్రమ్మ భర్త చిన్న వెంకయ్య కొనుగోలు చేసిన భూమికి సంబంధించిన ఆధారాలను కూడా పరిశీలించినట్లు సమాచారం. సర్వే సమయంలో లంజపల్లి కుటుంబానికి చెందిన పలువురు అక్కడికి హాజరై తమ వద్ద ఉన్న పత్రాలు, వివరాలను అధికారులకు అందించినట్లు తెలిసింది.

**కుటుంబ సభ్యుల నుంచి వివరాల సేకరణ....** భూవివాదానికి సంబంధం ఉన్న లంజపల్లి కుటుంబ సభ్యులు, పెద్దలను అధికారులు పిలిపించి వారి వద్ద ఉన్న పాత పత్రాలు, భూమి హక్కులకు సంబంధించిన ఆధారాలను పరిశీలించినట్లు సమాచారం. దీంతో ఇంతకాలంగా కుటుంబాల మధ్య కొనసాగుతున్న భూవివాదంపై రెవెన్యూ అధికారులు నేరుగా క్షేత్రస్థాయిలో వివరాలు సేకరించడం ప్రాధాన్యత సంతరించుకుంది.. గతంలో ప్రజాదర్బార్‌లో భద్రమ్మ చేసిన ఫిర్యాదుతో పాటు, అనంతరం సోషల్ మీడియాలో వెలువడిన వీడియోలు, అందులో వ్యక్తమైన ఆరోపణలపైనా అధికారులు వాస్తవ పరిస్థితులను తెలుసుకునే ప్రయత్నం చేసినట్లు తెలిసింది.

**భద్రమ్మ వారసత్వ హక్కులపై చర్చ**

చిన్న వెంకయ్యకు సంబంధించిన భూమి విషయంలో భార్యగా భద్రమ్మకు ఉన్న హక్కులు, వారసత్వ పరిస్థితులు ప్రస్తుతం చర్చనీయాంశంగా మారాయి. కుమారుడు వెలుతురు గురవయ్య ద్వారా భూమి విక్రయమై ఉంటే, ఆ లావాదేవీలో భద్రమ్మకు ఉన్న హక్కులు ఏమిటన్నది కూడా పరిశీలించాల్సిన అంశంగా మారింది. అయితే ఈ అంశాలపై తుది నిర్ణయం కేవలం కుటుంబ సంబంధాల తన సతీమణి కమలమ్మ ఆధారంగా కాకుండా భూమి స్వభావం, పాత రిజిస్ట్రేషన్ పత్రాలు, లింక్ డాక్యుమెంట్లు, రెవెన్యూ రికార్డులు, వారసత్వ ఆధారాలు, అప్పటి చట్టపరమైన నిబంధనలను పరిశీలించిన అనంతరమే తేలాల్సి ఉంది.

**అసలు భూమి ఎక్కడుంది?**

వివాదంలో ప్రధానంగా అసలు భూమి క్షేత్రస్థాయిలో ఉందా? రికార్డుల్లో నమోదైన విస్తీర్ణం, ప్రస్తుతం ఉన్న భూమి విస్తీర్ణం సరిపోతున్నాయా? భద్రమ్మ వద్ద ఉన్న పత్రాలకు అనుగుణంగా భూమి సరిహద్దులు ఉన్నాయా? అనే అంశాలు కీలకంగా మారాయి. అలాగే ఎస్సీ వర్గానికి చెందిన భూముల కొనుగోలు, విక్రయాలకు సంబంధించిన ఆరోపణలు, భూమిని పలువురికి పంచినట్లు చూపించారనే ఆరోపణలు తదితర అంశాలు కూడా వివాదంలో ప్రస్తావనకు వచ్చినట్లు సమాచారం. అయితే వీటిలో వాస్తవాలు ఏమిటన్నది అధికారిక రికార్డులు, రెవెన్యూ విచారణ, సర్వే నివేదిక ఆధారంగానే తేలాల్సి ఉంది.

**చిన్న వెంకయ్య నుంచి భూమి ఎవరి చేతుల్లోకి?**

భూవివాదంలో మరో కీలక అంశం చిన్న వెంకయ్య కొనుగోలు చేసిన భూమి అనంతరం ఎవరెవరి పేర్లకు మారిందన్నదే. చిన్న వెంకయ్య నుంచి తదుపరి ఎవరి పేరున రిజిస్ట్రేషన్ జరిగింది? ఆ తర్వాత ఎవరికి విక్రయించారు? ప్రస్తుతం రెవెన్యూ, రిజిస్ట్రేషన్ రికార్డుల్లో భూమి ఎవరి పేరున ఉంది? అనే వివరాలు వెలుగులోకి రావాల్సి ఉంది. పాత రిజిస్ట్రేషన్ పత్రాలు, లింక్ డాక్యుమెంట్లు, రెవెన్యూ రికార్డులను పరిశీలిస్తే భూమి కొనుగోలు నుంచి ప్రస్తుత హక్కుదారు వరకు జరిగిన లావాదేవీల క్రమంపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

**సర్వే నివేదికపై ఆసక్తి**

మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి నిర్వహించిన ప్రజాదర్బార్‌లో భద్రమ్మ సమర్పించిన ఫిర్యాదుపై రెవెన్యూ అధికారులు స్పందించి 309, 310 సర్వే నంబర్లలో క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టడం చర్చనీయాంశంగా మారింది. ఇప్పుడు సర్వే అనంతరం అధికారులు సమర్పించే నివేదికపై ఆసక్తి నెలకొంది. భూమి హక్కులు, సరిహద్దులు, విస్తీర్ణం, రికార్డులు, రిజిస్ట్రేషన్ పత్రాలు, వారసత్వ ఆధారాలు, క్షేత్రస్థాయి పరిస్థితులపై నివేదికలో ఏం తేలుతుందన్నది. ఉత్కంఠగా మారింది. సమగ్ర విచారణ, రికార్డుల పరిశీలన, సర్వే నివేదిక అనంతరమే భూవివాదంపై పూర్తి స్పష్టత వెలుతురు భద్రమ్మకే న్యాయం జరిగే అవకాశం ఉంది.

# కోరుట్లలో నల్ల బ్యాడ్జీలతో ఉపాధ్యాయుల నిరసన

## పీఆర్సీ వెంటనే ప్రకటించాలి
## బకాయి ఉన్న ఆరు డీఏలను విడుదల చేయాలి - యూఎస్పీసీ డిమాండ్
## స్పందించకుంటే అసెంబ్లీ ముట్టడిస్తామని హెచ్చరిక




మెట్ పల్లి:(కోరుట్ల) ప్రతినిధి ఆగస్టు 7 (ప్రజాకలం) పీఆర్సీని వెంటనే ప్రకటించి, బకాయి ఉన్న ఆరు డీఏలను తక్షణమే విడుదల చేయాలని యూఎస్పీసీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం యూఎస్పీసీ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన నిరసన కార్యక్రమంలో భాగంగా కోరుట్ల డివిజన్ కేంద్రంలోని అన్ని పాఠశాలల్లో ఉపాధ్యాయులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ, విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని, జీవో నంబర్ 25ను సవరించాలని వారు డిమాండ్ చేశారు. పీఆర్సీని వెంటనే ప్రకటించడంతో పాటు ఉద్యోగులకు రావాల్సిన డీఏలను విడుదల చేయాలని కోరారు. ప్రభుత్వం పీఆర్సీపై వెంటనే నిర్ణయం తీసుకోకపోతే ఈ నెల 29న హైదరాబాద్‌లో భారీ స్థాయిలో మహాధర్నా నిర్వహిస్తామని యూఎస్పీసీ నాయకులు తెలిపారు. అయినప్పటికీ ప్రభుత్వం స్పందించని పక్షంలో సెప్టెంబర్‌లో అసెంబ్లీ ముట్టడి కార్యక్రమం చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యూఎస్పీసీ నాయకులు తిరుకోవెల శ్యామ్‌సుందర్, గట్ల సంతోష్, వడ్లకొండ గంగాధర్, గంగమోహన్, నాగరాజు, లక్ష్మీనారాయణ, రవూఫ్, రాధిక, దివ్య,సుమలత,హేమలత,సుజాత,లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# అన్నదాతకు వెన్నుదన్నుగా కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం

## - టీపీసీసీ లీగల్ సెల్ రాష్ట్ర కన్వీనర్ శేర్ నర్సారెడ్డి



మెట్‌పల్లి టౌన్ ప్రతినిధి ఆగస్టు 7 (ప్రజాకలం) తెలంగాణ రైతుల సంక్షేమమే ప్రధాన ధ్యేయంగా సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అన్నదాతకు వెన్నుదన్నుగా నిలుస్తోందని టీపీసీసీ లీగల్ సెల్ రాష్ట్ర కన్వీనర్ శేర్ నర్సారెడ్డి అన్నారు. శుక్రవారం మెట్‌పల్లిలో విలేకరులతో మాట్లాడుతూ.. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత వ్యవసాయ రంగానికి కోట్లాది రూపాయలు వెచ్చిస్తూ రైతుల సంక్షేమానికి ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపడుతోందన్నారు. రైతు రుణమాఫీ, రైతు భరోసా, ఉచిత విద్యుత్, రైతు బీమాతో పాటు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు సన్న వడ్లకు రూ.500 బోనస్ చెల్లిస్తున్నట్లు తెలిపారు.రైతుల సమస్యల పరిష్కారం, వ్యవసాయ రంగ అభివృద్ధి కోసం వ్యవసాయ కమిషన్ ఏర్పాటు చేసి, అన్నదాతల అభ్యున్నతికి ప్రభుత్వం అనేక సంస్కరణలకు శ్రీకారం చుట్టిందని పేర్కొన్నారు.

గత బీఆర్ఎస్ ప్రభుత్వం ధరణి వ్యవస్థను అడ్డం పెట్టుకొని రైతులను ఇబ్బందులకు గురిచేసిందని శేర్ నర్సారెడ్డి ఆరోపించారు.కాంగ్రెస్ ప్రభుత్వం భూభారతి చట్టాన్ని తీసుకువచ్చి రైతులకు అండగా నిలుస్తోందన్నారు. గ్రామ సభలు నిర్వహించి భూ సంబంధిత సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు.తెలంగాణ రాష్ట్రంలోని రైతుల సంక్షేమమే లక్ష్యంగా సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం, టీపీసీసీ అధ్యక్షుడు బి. మహేష్ కుమార్ గౌడ్ మార్గదర్శకంలో సమన్వయం, ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతోందని శేర్ నర్సారెడ్డి అన్నారు. అన్నదాతల సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని పేర్కొన్నారు.

# చేనేత ఉత్పత్తులకు ప్రోత్సాహం : జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా

మహబూబ్ నగర్ ప్రజా కలం ప్రతినిధి ఆగస్టు 7 :

చేనేత రంగ అభివృద్ధికి,నేత కార్మికులకు జిల్లా యంత్రాంగం అన్ని విధాలా సహకారం అందిస్తుందని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా తెలిపారు. జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా శుక్రవారం కలెక్టర్ కార్యాలయం సమావేశంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు.

చేనేత వస్త్రం వెనుక చేనేత కార్మికుల శ్రమ, నైపుణ్యం, అంకితభావం దాగి ఉంటాయని, చేతితో నేసిన ప్రతి వస్త్రానికి ప్రత్యేకమైన గుర్తింపు ఉంటుందని కలెక్టర్ అన్నారు. యంత్రాలతో తయారయ్యే వస్త్రాలతో పోలిస్తే చేనేత ఉత్పత్తులకు కళాత్మకత, నాణ్యత, సంప్రదాయం ప్రతిబింబిస్తాయని పేర్కొన్నారు.ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన గద్వాల్, నారాయణపేట చేనేత ఉత్పత్తులు దేశవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు పొందాయని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాల ద్వారా చేనేత కార్మికులకు గరిష్ట ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు.మహబూబ్‌నగర్ శిల్పారామంలో స్థానిక చేనేత ఉత్పత్తుల విక్రయానికి స్టాల్ ల కేటాయింపు
ప్రాధాన్యం కల్పించనున్నట్లు, ఆసక్తి ఉన్న చేనేత కార్మికులు హ్యాండ్లూమ్ అధికారుల వద్ద పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. జిల్లా స్థాయి ప్రభుత్వ కార్యక్రమాల్లో చేనేత ఉత్పత్తుల ప్రదర్శన, విక్రయాల కోసం ఉచితంగా స్టాళ్లు ఏర్పాటు చేస్తామని వెల్లడించారు.జిల్లాకు వచ్చే విశిష్ట అతిథులకు అందించే బహుమతులు, శాలువాలు స్థానిక చేనేత కార్మికుల నుంచే కొనుగోలు చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. మధ్యవర్తులు లేకుండా నేరుగా చేనేత కార్మికుల నుంచి ఉత్పత్తులు కొనుగోలు చేసే విధానాన్ని ప్రోత్సహిస్తామని చెప్పారు.చేనేత కార్మికుల సమస్యలు, సూచనలు తెలుసుకునేందుకు ప్రత్యేక సమావేశాలు నిర్వహించడంతో పాటు అవసరమైతే గ్రామాల్లో పర్యటించి వారితో ప్రత్యక్షంగా మాట్లాడతామని కలెక్టర్ ఖుష్బూ గుప్తా తెలిపారు.ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ సాయి శివాని మాట్లాడుతూ చేనేత వస్త్రాలు మన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అని, ప్రతి చేనేత వస్త్రం వెనుక కార్మికుల అపారమైన శ్రమ, నైపుణ్యం దాగి ఉంటుందని ఆమె అన్నారు.

చేనేత కార్మికులు ఎన్నో కష్టాలను ఎదుర్కొంటూ నాణ్యమైన వస్త్రాలను తయారు చేస్తున్నారని, వారిని ప్రోత్సహించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. చేనేత వస్త్రాలను కొనుగోలు చేసి వినియోగించడం ద్వారా కార్మికుల జీవనోపాధికి



తోడ్పడటంతో పాటు మన వారసత్వాన్ని పరిరక్షించవచ్చని తెలిపారు. ప్రతి ఒక్కరూ చేనేత వస్త్రాల వినియోగాన్ని అలవాటు చేసుకుని చేనేత రంగ అభివృద్ధికి సహకరించాలని ఆమె పిలుపునిచ్చారు.

జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ పాఠశాలల 10 వ తరగతి విద్యార్థులకు నిర్వహించిన వ్యాస రచన పోటీలలో ప్రతిభ కనబరిచిన ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు పొందిన విద్యార్థులకు బహుమతులు, సర్టిఫికెట్లు జిల్లా కలెక్టర్ అందించారు. అలాగే జిల్లా నుండి గుర్తించిన ఉత్తమ చేనేత కార్మికులను జిల్లా కలెక్టర్ సన్మానించారు.

అనంతరం కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన చేనేత వస్త్రాల స్టాళ్లను జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా సందర్శించి, చేనేత కార్మికులు తయారు చేసిన వస్త్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చీరాలు, ఇతర వస్త్రాల తయారుకు ఎంత ఖర్చు అవుతుంది, వాటిని ఎంత ధరకు అమ్ముతున్నారు అనే విషయాలను వారికి అడిగి తెలుసుకున్నారు. చేనేత కార్మికులు తయారు చేసిన నారాయణపేట, గద్వాల కాటన్ చీరలను జిల్లా కలెక్టర్ చూసి చాలా బాగున్నాయని అన్నారు. అనంతరం ఆమె కొన్ని చీరలను కొనుగోలు చేశారు. అలాగే జిల్లా అధికారులు, ఉద్యోగులు కూడా చేనేత వస్త్రాలను కొనాలని, చేనేత కార్మికులకు ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో డి. ఆర్.ఓ ఎ. నిర్మలా, జిల్లా హ్యాండ్లూమ్ అభివృద్ధి అధికారి రాజేష్ , చేనేత సంఘాల నాయకులు, చేనేత కార్మికులు తదితరులు పాల్గొన్నారు.తొలుత జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా కలెక్టర్ కార్యాలయం గేట్ నుండి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు

# నిరుపేద కుటుంబాలకు ఇళ్లు కేటాయించాలి

## - ఆర్డీఓకు వినతిపత్రం అందజేసిన మిల్లత్ ముస్లిం వెల్ఫేర్ సంఘం అధ్యక్షుడు చాంద్ పాషా



మెట్ పల్లి:(కోరుట్ల) ప్రతినిధి ఆగస్ట్ 7 (ప్రజాకలం): భారీ వర్షాల కారణంగా ఇళ్లు కూలిపోయి తీవ్రంగా నష్టపోయిన రెండు నిరుపేద కుటుంబాలకు ప్రభుత్వం డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు లేదా ఇందిరమ్మ ఇళ్లు కేటాయించి ఆదుకోవాలని కోరుతూ మిల్లత్ ముస్లిం వెల్ఫేర్ సంఘం కోరుట్ల అధ్యక్షులు, సీనియర్ పాత్రికేయులు మహమ్మద్ చాంద్ పాషా శుక్రవారం కోరుట్ల ఆర్డీఓ జీవాకర్ రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం చాంద్ పాషా మాట్లాడుతూ పట్టణంలోని అర్ఫాత్‌పుర 18వ వార్డులో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు రెండు ఇళ్లు పూర్తిగా దెబ్బతిన్నాయని తెలిపారు. 26 జూలై 2026న కురిసిన భారీ వర్షానికి అద్దెకు నివసిస్తున్న వ్యవసాయ కూలీ షేక్ నయీమ్ ఇంటి పైకప్పు కూలిపోయిందన్నారు. ప్రమాద సమయంలో నయీమ్ ఇంట్లో నిద్రిస్తుండగా పైకప్పు ఆయన ఛాతిపై పడటంతో అంతర్గత గాయాలయ్యాయని, భార్య, ముగ్గురు చిన్నారులు సకాలంలో బయటకు రావడంతో ప్రాణాపాయం తప్పిందని వివరించారు. ఇంట్లోని బీరువా, బట్టలు, మంచం, నిత్యావసర సరుకులు, ఇతర సామగ్రి పూర్తిగా దెబ్బతిన్నాయని తెలిపారు. జూలై 30న కురిసిన భారీ వర్షానికి అదే ప్రాంతంలో నివసిస్తున్న కూలీ మహమ్మద్ రషీద్ అహ్మద్ అలియాస్ అప్సర్ ఇంటి పైకప్పు కూలిపోయి తీవ్ర ఆస్తి నష్టం జరిగిందన్నారు. కుమార్తె వివాహం కోసం సమకూర్చుకున్న ఇంటి సామగ్రి మొత్తం ధ్వంసమైందని తెలిపారు. రషీద్ అహ్మద్ తన భార్య, ఇద్దరు కుమార్తెలతో కలిసి ఆ ఇంట్లో నివసిస్తున్నారని అన్నారు. ఈ రెండు ఘటనలపై కోరుట్ల తహసీల్దార్ అధికారులు ప్రమాద స్థలాలను పరిశీలించి నష్టాన్ని అంచనా వేసినట్లు చాంద్ పాషా తెలిపారు. స్పందించిన ఆర్డీఓ జీవాకర్ రెడ్డి రెండు నిరుపేద కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యేలా అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మిల్లత్ ముస్లిం వెల్ఫేర్ సంఘం అధ్యక్షులు మహమ్మద్ చాంద్ పాషాతో పాటు మహమ్మద్ యూసుఫ్ ఖాద్రి, మహమ్మద్ అబ్దుల్ బారి, ఎంపీజే నాయకులు, మహమ్మద్ ఇస్మాయిల్, మీనా మసీదు కమిటీ అధ్యక్షులు మహమ్మద్ తలహా ఆసిమ్ పాల్గొన్నారు.

# కల్వకుర్తి ఎత్తిపోతల పథకం ఎల్లూరు పంపులను , పాలమూరు-రంగారెడ్డి. నార్లాపూర్ పంపులు వెంటనే ప్రారంభించాలి : మాజీ మంత్రి వి. శ్రీనివాస్ గౌడ్

మహబూబ్ నగర్ ప్రజా కలం ప్రతినిధి ఆగష్టు 07:

మహబూబ్‌నగర్: శ్రీశైలం జలాశయం 162 టీఎంసీలకు చేరినా, కల్వకుర్తి ఎత్తిపోతల పథకం రిజర్వాయర్ల నుంచి సాగునీరు విడుదల చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం మొద్దు నిద్ర పోతోందని మాజీ మంత్రి వి. శ్రీనివాస్ గౌడ్ మండిపడ్డారు.తక్షణమే కల్వకుర్తి ఎత్తిపోతల పథకంలోని మోటార్లను, పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టు నార్లాపూర్ పంపులను ఆన్ చేసి, నీటిని ఎత్తిపోసి రిజర్వాయర్ల కింద ఉన్న ఆయకట్టుకు సాగునీరు విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు.ప్రవాహాలు నమోదై వారం రోజులు గడిచినా, శ్రీశైలం జలాశయం నిండుతున్నా రైతులకు నీళ్లు ఇవ్వాలనే నిర్ణయం ప్రభుత్వం తీసుకోకపోవడం దారుణమన్నారు. తెలంగాణకు అందుబాటులో ఉన్న నీటిని వినియోగించుకోకుండా ఆంధ్రప్రదేశ్‌కు తెలంగాణ నీళ్లను ధారాదత్తం చేయడమే అవుతుందని విమర్శించారు.ఒకవైపు పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్, మాల్యాల పంప్ హౌస్‌ల ద్వారా ఆంధ్రప్రదేశ్ వేలాది క్యూసెక్కుల నీటిని తరలించుకుంటుంటే, మరోవైపు తెలంగాణ ప్రభుత్వం శ్రీశైలం నుంచి నీటిని ఎత్తిపోసుకోకుండా చేతులు ముడుచుకొని కూర్చోవడం కాంగ్రెస్ ప్రభుత్వ అసమర్థతకు నిదర్శనమని శ్రీనివాస్ గౌడ్ అన్నారు.“రాష్ట్రంలో ఇరిగేషన్ శాఖ మంత్రి ఉన్నాడా?ఆంధ్రప్రదేశ్ నేతలకు ఉన్న సోయి తెలంగాణ నీళ్ల మంత్రికి లేకపోవడం సిగ్గుచేటు. పాలమూరు లాంటి కరువు జిల్లాలో నీళ్లు ఉండి కూడా విడుదల చేయకపోవడం క్రిమినల్ నెగ్లిజెన్స్ కిందికే వస్తుంది, కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నీళ్ల మంత్రిని శిక్షించిన తప్పులేదు.శ్రీశైలంలో నీళ్లు ఉన్నప్పుడు కూడా తెలంగాణ రైతుల పొలాలకు నీళ్లు ఇవ్వకపోవడానికి కారణమేంటి?” అని ఆయన ధ్వజమెత్తారు.చంద్రబాబు కింద పనిచేసిన ఆదిత్యనాథ్ దాస్‌ను సలహాదారుగా నియమించుకున్న కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ ప్రయోజనాల విషయంలో మాత్రం ఎందుకు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆయన ప్రశ్నించారు.పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టులోని నార్లాపూర్ రిజర్వాయర్‌ను కల్వకుర్తి ఎత్తిపోతల పథకం పరిధిలోని ఎల్లూరు రిజర్వాయర్‌కు గతంలోనే అనుసంధానం చేసినందున, నార్లాపూర్ రిజర్వాయర్‌లో నీటిని నింపితే ఎల్‌నినో నేపథ్యంలో కేఎల్ఐ పరిధిలోని ఆయకట్టుకు సాగునీరు అందించే అవకాశం ఉంటుందని తెలిపారు.కరువు పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉన్న నేపథ్యంలో ముందస్తు చర్యలు చేపట్టాల్సిన ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు.

పాలమూరు–రంగారెడ్డి పంపులను వెంటనే ప్రారంభించి రిజర్వాయర్లు, చెరువులు, కుంటలు నింపడంతో పాటు కాలువలకు నీటిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పాలమూరు రైతులకు సాగునీరు అందించేందుకు పోరు బాటకు సిద్ధమని మాజీ మంత్రి లక్ష్మా రెడ్డి పేర్కొన్నారు. కృష్ణా నదికి ఎగువ నుండి భారీగా వరద వస్తున్నా... నీళ్లే లేవంటూ రైతాంగాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేస్తుందని అన్నారు. ఈ నెల 11 వరకు డెడ్‌లైన్ విధిస్తున్నామని.. అప్పటిలోగా ప్రారంభించకుంటే బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తో కలిసి లక్షలాది మంది రైతులతో నార్లాపూర్‌ను ముట్టడిస్తామని మాజీ శాసన సభ్యులు అల వెంకటేశ్వర్ రెడ్డి, రాజేందర్ రెడ్డి పేర్కొన్నాడు. అక్కడ రైతులు..ప్రజలతో మాట్లాడి భవిష్యత్తు కార్యాచరణ రూపకల్పన చేస్తామని అన్నారు.

# పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో జాతీయ చేనేత దినోత్సవ వేడుకలు..



గొల్లపల్లి ఆగస్టు 07 ప్రజా కలం ప్రతినిధి గొల్లపల్లి మండల కేంద్రంలో పద్మశాలి సేవా సంఘం ఆధ్వర్యంలో జాతీయ చేనేత దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యక్షులు అంకం భూమయ్య మాట్లాడుతూ అద్భుతమైన చేనేత వస్త్రాలను మగ్గాలపై నేసి, దేశ సాంస్కృతిక , ప్రతిష్టను తరతరాలుగా కాపాడుతున్న చేనేత కళాకారులందరికీ వారు జాతీయ చేనేత దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. స్వాతంత్రోద్యమంలో ప్రారంభమైన స్వదేశీ ఉద్యమం నుంచే మన చేనేత ఉత్పత్తులకు, స్వదేశీ వస్త్రాలకు ప్రాధాన్యత పెరిగిందని, విదేశీ వస్తు బహిష్కరణలో చేనేత రంగానిది కీలక పాత్రను గుర్తుచేశారు. అగ్గిపెట్టెలో ఇమిడే చీరలను ,దుస్తులను అద్భుతమైన వస్త్రాలను నేసిన ఘనత మన చేనేత కార్మికులదని కొనియాడారు. భారతీయ చేనేత వస్త్ర పరిశ్రమతో పోటీని తట్టుకోలేక, బ్రిటీష్ ఆంగ్లేయులు మన చేనేత కార్మికుల చేతి వేళ్లను సైతం నరికివేసిన దారుణ చరిత్ర ఉందంటే, మన నేతన్నల నైపుణ్యం ఎంతటి గొప్పదో అర్థం చేసుకోవచ్చని పేర్కొన్నారు.ఆధునిక యంత్రాల దాడిని తట్టుకుని నిలబడుతున్న చేనేత పరిశ్రమకు ప్రభుత్వం నుంచి మరింత ప్రోత్సాహం అందాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. చేనేత ఉత్పత్తులను ప్రతి ఒక్కరూ కొనుగోలు చేసి నేతన్నలకు ఉపాధి కల్పించాలని, స్వదేశీ వస్త్రాలను వినియోగించి, చేనేత పరిశ్రమలను, కార్మికులను ప్రోత్సహించాలని కోరారు.ఈ కార్యక్రమంలో అధ్యక్షులు అంకం భూమయ్య, కార్యదర్శి చౌటపల్లి తిరుపతి,ఉపాధ్యక్షులు గాజంగి హన్మండ్లు, రఘునందన్ ,కోశాధికారి అంకం లక్ష్మీనారాయణ, సంఘ సభ్యులు తిరుపతి ,లక్ష్మణ్, లింబాద్రి సత్తయ్య ,శంకర్ , ఇమాకర్ సాంబయ్య, వీరస్వామి రాజు ,లక్ష్మీనారాయణ , మల్లయ్య , తదితరులు పాల్గొన్నారు

# విద్యుత్ ఉప కేంద్రాలలో మరమ్మతుల దృశ్య విద్యుత్ కు అంతరాయం

## -విద్యుత్ వినియోగ దారులకు విజ్ఞప్తి ఏ ఈ బండి సమ్మయ్య



ఎండపల్లి, ఆగస్టు 07 :(ప్రజా కలం ప్రతినిధి)

ఎండపల్లి మండలం లోని రెండవ శనివారం రోజున గుల్లకోట, పాతగూడూర్ విద్యుత్ ఉపకేంద్రాల లో విద్యుత్ మరమ్మత్తుల దృశ్య విద్యుత్ సరఫరా నిలిపివేసి మరమ్మతులు చేయడం జరుగుతుందని రాజారాంపల్లి విద్యుత్ శాఖ ఏ ఈ బండి సమ్మయ్య తెలిపారు. గుల్లకోట విద్యుత్ ఉపకేంద్రం లో గుల్లకోట, చర్లపల్లి, కొండాపూర్ గ్రామాలలో విద్యుత్ కు అంతరాయం కలుగుతుందన్నారు అలాగే పాతగూడూర్ విద్యుత్ ఉపకేంద్రం లో పాత గూడూర్, సూరారం రాజారాంపల్లి గ్రామాలకు ఉదయం 09:00 గంటల నుండి మధ్యాహ్నం 12:00 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయ బడును. కావున విద్యుత్ వినియోగ దారులు, రైతులు పైన తెలిపిన గ్రామాల లో విద్యుత్ సరఫరా అంతరాయానికి సహకరించగలరని రాజారాంపల్లి శాఖ విద్యుత్ బండి సమ్మయ్య తెలిపారు.

# ఏఎస్ఐగా పదోన్నతి పొందిన గంగాధర్‌కు ఎమ్మెల్యే సంజయ్ శుభాకాంక్షలు



జగిత్యాల ప్రతినిధి ఆగస్టు 7 (ప్రజాకలం) జగిత్యాల ఇంటెలిజెన్స్ విభాగంలో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న వావిలాల గంగాధర్ ఏఎస్ఐగా పదోన్నతి పొందిన సందర్భంగా జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్‌ను ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ గంగాధర్‌కు శుభాకాంక్షలు తెలిపారు. పదోన్నతితో మరింత బాధ్యతాయుతంగా విధులు నిర్వహిస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గిరి నాగభూషణం, గట్టు సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# కోరుట్ల సబ్ ఇన్స్పెక్టర్ గా శ్యామ్ రాజ్

## - బాధ్యతల స్వీకరణ..




మెట్ పల్లి:(కోరుట్ల) ప్రతినిధి ఆగస్ట్ 7 (ప్రజాకలం) కోరుట్ల సబ్ ఇన్స్పెక్టర్ గా శ్యామ్ రాజ్ బాధ్యతలు స్వీకరించారు..ఇటీవల జరిగిన బదిలీలలో జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ కోరుట్ల ఎస్సై గా శ్యామ్ రాజ్ ను నియమించగా శుక్రవారం సాయంత్రం ఆయన బాధ్యతలు స్వీకరించారు. శాంతి భద్రత ల పరిరక్షణకు తనవంతు కృషి చేస్తానని ఆయన తెలిపారు.

# తల్లిపాలే శిశువుకు తొలి రక్షణ కవచం

## ప్రపంచ తల్లిపాల వారోత్సవాల్లో వర్ధన్నపేట ప్రభుత్వ ఆసుపత్రిలో అవగాహన కార్యక్రమం

## తొలి ఆరు నెలలు తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని మున్సిపల్ చైర్మన్ పాలకుర్తి సారంగపాణి పిలుపు

ఆగస్టు 7 ప్రజాకలం ప్రతినిది:(వరంగల్ /వర్ధన్నపేట)

ప్రపంచ తల్లిపాల వారోత్సవాలను పురస్కరించుకుని వర్ధన్నపేట ప్రభుత్వ ఆసుపత్రిలో శుక్రవారం నిర్వహించిన తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పాలకుర్తి సారంగపాణి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శిశువు జన్మించిన వెంటనే



తల్లిపాలు ఇవ్వడం ప్రారంభించాలని, తొలి ఆరు నెలల పాటు తల్లిపాలు మాత్రమే అందించడం అత్యంత అవసరమని పేర్కొన్నారు.తల్లిపాలలో శిశువు శారీరక, మానసిక ఎదుగుదలకు అవసరమైన అన్ని పోషకాలు సమృద్ధిగా ఉంటాయని, వ్యాధి నిరోధక శక్తిని పెంచి అనేక రకాల అనారోగ్య సమస్యల నుంచి రక్షిస్తాయని తెలిపారు. తల్లిపాలు ఇవ్వడం వల్ల శిశువుకే కాకుండా తల్లికి కూడా ఆరోగ్యపరమైన ప్రయోజనాలు కలుగుతాయని చెప్పారు. ప్రతి తల్లి తల్లిపాల ప్రాముఖ్యతను తెలుసుకుని, కుటుంబ సభ్యులు కూడా బాలింతలకు పూర్తి సహకారం అందించాలని సూచించారు.గర్భిణీలు, బాలింతలకు తల్లిపాల ప్రాముఖ్యత, శిశు సంరక్షణ, పోషకాహారం వంటి అంశాలపై ప్రభుత్వ ఆసుపత్రుల ద్వారా నిరంతరం అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బందిని ఈ సందర్భంగా చైర్మన్ అభినందించారు.కార్యక్రమంలో ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. వీరిన్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లలిత, వార్డు కౌన్సిలర్లు బెజ్జం పాపారావు, మాలోతు దేవేందర్, కాంగ్రెస్ నాయకులు నేతావత్ రాజేందర్, తిరుపెల్లి కుమారస్వామి, ఎస్సీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు మల్లెపాక సమ్మయ్య, అనిమిరెడ్డి రామచంద్రరెడ్డి, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ టీచర్ లు,సిబ్బంది, గర్భిణీలు, బాలింతలు తదితరులు పాల్గొన్నారు.

# ఆరోగ్యశ్రీ సాధన వెనుక మంద కృష్ణ పోరాటమే

## -ఆరోగ్యశ్రీ సాధన దినోత్సవంలో కట్ల రాజశేఖర్ మాదిగ వ్యాఖ్యలు



ఆగస్టు 07 ప్రజాకలం ప్రతినిధి: (వరంగల్ /వర్ధన్నపేట)

ఆరోగ్యశ్రీ పథకం అమలుకు ఎంఆర్పీఎస్ అధినేత పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ చేపట్టిన ఉద్యమాలు, నిరవధిక దీక్షలే ప్రధాన కారణమని ఎంఆర్పీఎస్ మాజీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు, వర్ధన్నపేట నియోజకవర్గ ఇన్‌చార్జి కట్ల రాజశేఖర్ మాదిగ అన్నారు. ఆరోగ్యశ్రీ సాధన దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం వర్ధన్నపేట నియోజకవర్గ కేంద్రంలో ఎంఆర్పీఎస్, ఎంఎస్పీ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కట్ల రాజశేఖర్ మాదిగ మాట్లాడుతూ.. 2004లో మంద కృష్ణ మాదిగ చేపట్టిన నిరవధిక దీక్ష, ఉద్యమ ఫలితంగానే పేదలకు ఆరోగ్యశ్రీ పథకం అందుబాటులోకి వచ్చిందని పేర్కొన్నారు. గుండె జబ్బులతో బాధపడుతున్న నిరుపేద చిన్నారులకు ఉచిత వైద్యం అందించడంతో పాటు లక్షలాది మంది పేదలకు ప్రాణదాతగా నిలిచిన ఆరోగ్యశ్రీ పథకం అమలుకు ఎంఆర్పీఎస్ ఉద్యమం కీలక పాత్ర పోషించిందన్నారు. ఈ విషయాన్ని అప్పటి ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్. రాజశేఖర రెడ్డి అసెంబ్లీలో ప్రకటించారని గుర్తుచేశారు.సమాజంలోని సబ్బండ వర్గాల సంక్షేమం కోసం ఎంఆర్పీఎస్ అనేక ఉద్యమాలు చేపట్టి పలు సంక్షేమ పథకాలను సాధించిందని, ఆ ఘనత పద్మశ్రీ మంద కృష్ణ మాదిగకే దక్కుతుందని అన్నారు. కార్యక్రమంలో ఎంఎస్పీ మాజీ జిల్లా అధికార ప్రతినిధి మాసాని గోపాల్ మాదిగ, వర్ధన్నపేట మండల ఇన్‌చార్జి జిల్లా ధర్మన్న మాదిగ, ఎంఎస్పీ జిల్లా నాయకులు ఐత రాజు మాదిగ, మాజీ మండల అధ్యక్షుడు ముత్యాల మల్లేష్ మాదిగ, రాయపర్తి మాజీ మండల అధ్యక్షుడు వషపాక కుమార్ మాదిగ, ఎంఆర్పీఎస్ మండల నాయకుడు చాడ కరుణాకర్ మాదిగ, అంబేద్కర్ సంఘం నాయకుడు జంగిలి భాస్కర్, ముత్యాల ఉలేందర్ మాదిగ, ముత్యాల సంజీవ్ మాదిగ, మారేపాక బాబు మాదిగ, గోకాల సలీం మాదిగ, మునిగాల వెంకటేష్, చింటూ మాదిగతో పాటు ఎంఆర్పీఎస్, ఎంఎస్పీ నాయకులు పాల్గొన్నారు.

# సంఘ సభ్యుడి కుటుంబానికి రూ.93,580 భీమా-పొదుపు సాయం

## -కుంటపల్లిలో ఏకశిలా పురుషుల పొదుపు సంఘం ఆర్థిక భరోసా

## -సభ్యత్వంతోనే కుటుంబాలకు రక్షణ అని కాగితాల జగన్నాధచారి పిలుపు

ఆగస్టు 7 ప్రజాకలం ప్రతినిది: (వరంగల్ /సంగెం) కుటుంబ పెద్ద అకాల మరణంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కోకుండా సంఘ సభ్యుల కుటుంబాలకు అండగా నిలుస్తున్నామని ఆదర్శ పురుషుల పొదుపు సమితి మందపల్లి (గిర్ని బావి) అధ్యక్షుడు కాగితాల జగన్నాధచారి తెలిపారు. కుంటపల్లి గ్రామానికి చెందిన ఏకశిలా పురుషుల పొదుపు సంఘ సభ్యుడు సింగం సంపత్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా, ఆయన కుటుంబానికి సంఘం ద్వారా రూ.93,580 ఆర్థిక సహాయాన్ని శుక్రవారం అందజేశారు.సంఘ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో సింగం సంపత్ నామినీ అయిన ఆయన భార్య సూరమ్మకు సంఘంలో చేసిన పొదుపు, బోనస్‌తో పాటు సహవికాస్ సంస్థ నుంచి మంజూరైన భీమా మొత్తాన్ని కలిపి రూ.93,580 చెక్కును అందించారు.ఈ సందర్భంగా జగన్నాధచారి మాట్లాడుతూ, సంఘంలోని ప్రతి సభ్యుడికి ప్రతి సంవత్సరం భీమా సౌకర్యం కల్పిస్తున్నామని తెలిపారు. సంఘ సభ్యుడు మరణించిన సందర్భంలో రూ.80 వేల భీమాతో పాటు సభ్యుడు చేసిన పొదుపు, దానికి లభించిన బోనస్‌ను కూడా నామినీకి అందజేస్తామని చెప్పారు. 22 సంవత్సరాలుగా సభ్యులు రూపాయి రూపాయి కూడబెట్టిన పొదుపు నేడు వారికి ఆర్థిక భరోసాగా నిలుస్తోందన్నారు. సంఘంలో పొదుపు చేసిన మొత్తాలపై 12 శాతం వడ్డీతో సభ్యులకు అవసరమైన రుణాలు



కూడా అందిస్తున్నామని వివరించారు.

ప్రతి ఒక్కరూ తమ నెలవారీ ఆదాయంలో కనీసం ఒక రోజు సంపాదనను పొదుపుగా సంఘంలో జమ చేయాలని, కుంటపల్లి పరిధిలోని గ్రామాల్లో 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ సంఘంలో సభ్యత్వం తీసుకుని భవిష్యత్తుకు భరోసా కల్పించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.కార్యక్రమంలో సమితి ఉపాధ్యక్షుడు చీకటి కృష్ణ నిరంజన్, సంఘం పర్యవేక్షకులు చిర్ర మొగిలి, చింతాకుల సురేందర్, రావుల శ్రీనివాస్, చిర్ర స్వరాజ్, మెట్టిపెల్లి బాబు, మాడిశెట్టి వీరస్వామి, రావుల రమేష్, గాదె ఇంద్రయ్య, చిర్ర రాజు, ఎన్నపోతుల నరేష్, చిర్ర సంపత్, ఘనకులు కూచన కుమారస్వామి, పాలకవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# కట్టేయాల కాంగ్రెస్‌కు కొత్త సారథి

## - గ్రామ అధ్యక్షుడిగా బండారి సతీష్

### - ఓటింగ్‌లో అత్యధిక మెజార్టీతో విజయం.. సీనియర్ నాయకుడికి పార్టీ బాధ్యతలు

### - పార్టీ బలోపేతమే లక్ష్యమని నూతన అధ్యక్షుడి స్పష్టీకరణ

జూలై 7 ప్రజాకలం ప్రతినిధి: (వరంగల్ /వర్ధన్నపేట)

వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలంలోని కట్టేయాల గ్రామ కాంగ్రెస్ పార్టీకి కొత్త నాయకత్వం లభించింది. గ్రామ పార్టీ అధ్యక్షుని ఎంపిక కోసం నిర్వహించిన ఎన్నికలో సీనియర్ నాయకుడు బండారి సతీష్ అత్యధిక మెజార్టీతో విజయం సాధించి గ్రామ కాంగ్రెస్ అధ్యక్షునిగా ఎన్నికయ్యారు. ఎమ్మెల్యే కే.ఆర్. నాగరాజు ఆదేశాల మేరకు, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పోశాల వెంకన్న గౌడ్ ఆధ్వర్యంలో ప్రజాస్వామ్య పద్ధతిలో ఓటింగ్ నిర్వహించి నూతన గ్రామ అధ్యక్షుడిని ఎన్నుకున్నారు.గ్రామంలో పార్టీని మరింత బలోపేతం చేయడం, కార్యకర్తలకు సముచిత ప్రాధాన్యం కల్పించడం, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లే లక్ష్యంతో ఈ ఎన్నిక నిర్వహించినట్లు పార్టీ నాయకులు తెలిపారు. ముగ్గురు అభ్యర్థులు బరిలో నిలవగా, బండారి సతీష్‌కు అత్యధిక మద్దతు లభించడంతో ఆయన్ను గ్రామ పార్టీ అధ్యక్షునిగా ప్రకటించారు. ఫలితాల వెల్లడి అనంతరం కార్యకర్తలు హర్షం వ్యక్తం చేస్తూ నినాదాలతో అభినందనలు తెలిపారు.ఈ సందర్భంగా నూతన గ్రామ అధ్యక్షుడు బండారి సతీష్ మాట్లాడుతూ తనపై విశ్వాసం ఉంచి బాధ్యతలు అప్పగించిన ఎమ్మెల్యే కే.ఆర్. నాగరాజు, పార్టీ నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. గ్రామంలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయడానికి అహర్నిశలు కృషి చేస్తానని, పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి ప్రతి కార్యకర్తను కలుపుకొని ముందుకు సాగుతానని చెప్పారు. ప్రజా సమస్యల పరిష్కారంలోనూ, పార్టీ



విస్తరణలోనూ తన వంతు బాధ్యతను సమర్థవంతంగా నిర్వర్తిస్తానని పేర్కొన్నారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పోశాల వెంకన్న గౌడ్ మాట్లాడుతూ గ్రామ స్థాయి నుంచి పార్టీని మరింత పటిష్టం చేయడమే లక్ష్యంగా ప్రజాస్వామ్య విధానంలో అధ్యక్షుల ఎంపిక చేపడుతున్నామని తెలిపారు. నూతన అధ్యక్షుడి నాయకత్వంలో గ్రామంలో కాంగ్రెస్ పార్టీ మరింత బలోపేతం అవుతుందనే విశ్వాసాన్ని వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అబ్బిడి రాజిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎద్దు సత్యనారాయణ, మహమ్మద్ చోటు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు, యువకులు తదితరులు పాల్గొని నూతన అధ్యక్షుడికి శుభాకాంక్షలు తెలిపారు.



# ఘనంగా ప్రగతి నగర్ కాంగ్రెస్ అధ్యక్షుడు తాతి రెడ్డి జన్మదిన వేడుకలు

నిజాంపేట్, ఆగస్టు 07 (ప్రజా కలం ప్రతినిధి)

నిజాంపేట్ సర్కిల్, ప్రగతి నగర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బొమ్ము వేంకటేశ్వర రెడ్డి (తాతి రెడ్డి) జన్మదిన వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ప్రగతి నగర్ నాయకులు బోట్ల తిరుపతి, శరత్ రెడ్డి మరియు వడ్లకొండ సందీప్ లు ఆయనను కలసి ప్రత్యేకంగా జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా వేంకటేశ్వర రెడ్డిని నాయకులు శాలువాతో ఘనంగా సన్మానించారు. అనంతరం వారు మాట్లాడుతూ... ఈ ప్రాంత అభివృద్ధికి, ప్రజా సమస్యల పరిష్కారానికి బొమ్ము వేంకటేశ్వర రెడ్డి ఎల్లప్పుడూ కృషి చేయాలని కోరారు. ఆయన నిండు నూరేళ్ల ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు అభిమానులు పాల్గొని ఆయనకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు.

# చేనేత కళ ఎంతో వైభవం

## సబ్ ఇన్స్పెక్టర్ జగన్

## యువజన సంఘం ఆధ్వర్యంలో చేనేత కళాకారులకు సన్మానం- గంజి యుగంధర్,

భూదాన్ పోచంపల్లి ఆగస్టు 07 (ప్రజా కలం ప్రతినిధి)

జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా పద్మశాలి యువజన సంఘం ఆధ్వర్యంలో చేనేత కళాకారులకు సన్మాన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథి గా స్థానిక ఎస్ ఐ జగన్ చేతుల మీదుగా చేనేత కళాకారులకు సన్మానం చేయడం జరిగింది,




సన్మాన గ్రహీతలు కటకం తుకారాం, విడెం రాములు, బోడ రామచంద్రం,చిలువేరు లలిత,పెంట నవీన్,గోషిక కార్తీక్ గార్లను సత్కరించడం జరిగింది , ఈ కార్యక్రమంలో యువజన సంఘం గౌరవ సలహాదారులు సూరపల్లి రమేష్ , సంఘం అధ్యక్షులు గంజి యుగంధర్, ఉపాధ్యక్షులు రుద్ర చందు ,ప్రధాన కార్యదర్శి ఆడేపు అరవింద్, సహాయ కార్యదర్శి అటిపాముల ధర్మేందర్, కోశాధికారి సూరపల్లి జగదీష్, డైరెక్టర్లు ముషం శ్రీనివాస్,చిలువేరు ఉదయ్,భోగ సాయి తేజ పాల్గొన్నారు.

# కూల్చడంతో పాటు అరెస్టులు చేయండి

## సిపిఐ జిల్లా కార్యదర్శి ఉమా మహేష్.

ప్రజాకలం /జగద్గిరిగుట్ట (ప్రతినిధి).

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలో జగద్గిరిగుట్ట సర్వేనెంబర్ 348 /1 లో ఉన్న ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురవుతున్నాయని వెంటనే వాటిని కాపాడాల్సిందిగా నేడు సిపిఐ మండల సమితి ఆధ్వర్యంలో ఎమ్మార్వో రాజేష్ కి వినతి పత్రం ఇవ్వడం జరిగింది.ఈ సందర్భంగా వారు ఎమ్మార్వో కి జగద్గిరిగుట్ట 348/1 లో జాంబవంతుని గుడి స్థలంలో గతంలో కూల్చివేసినప్పటికీ మళ్లీ మళ్లీ నిర్మాణాలు సాగుతున్నాయని, ఇలాగా అనేక ప్రాంతాల్లో కొనసాగుతున్నాయని కావున కఠినమైన చర్యలు తీసుకోవాల్సిందిగా కోరారు.




ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జగద్గిరిగుట్టలోని శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయానికి చెందిన స్థలాలను హైకోర్టు ఉత్తర్వుల ప్రకారం వెంటనే సర్వే చేసి స్వాధీనం చేసుకోవాలని లేకపోతే ఉన్న ప్రభుత్వ భూమి కూడా ప్రైవేట్ వ్యక్తుల చేతిలో వెళ్లే ప్రమాదం ఉందని దానివల్ల భవిష్యత్ తరాలకు ప్రభుత్వ భూమి అనేది లేకుండా పోతుందని అన్నారు. రాజీవ్ గృహకల్ప లోని షాపింగ్ కాంప్లెక్స్ కేటాయించిన భూమిని కూడా పట్టాలు ఉన్నాయని నెపంతో ఆక్రమించుకుంటున్నారని ఆ పట్టాలు నిజమో కావో తెలుసుకొని ఫేక్ పట్టాలో సూచించిన వారి పైన కఠినమైన చర్యలు తీసుకోవాలని, సోమయ్య నగర్ సలాసర్ స్థలం అనుకొని చిన్న ప్లాట్లుగా చేసి అమ్ముతున్నట్టు ప్రచారం జరుగుతుందని, వేద పాఠశాల నుండి వెళ్లే దారి పక్కన స్థలాలు కూడా ఆక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయని వెంటనే వాటిని కూల్చివేసి ప్రభుత్వ భూమిని కాపాడాలని కోరారు.ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఉమా మహేష్ మండల కార్యదర్శి స్వామి సహాయ కార్యదర్శి రాములు ఏఐటీయుసీ జిల్లా కార్యదర్శి శ్రీనివాస్ మండల కోశాధికారి సదానందలు పాల్గొన్నారు.



# సాకేత్ వొర్ల ఎంక్లేవ్ కాలనీలో అభివృద్ధి పనులను అడ్డుకుంటున్న ఓ కుటుంబం..

**కాలనీవాసులు, అధికారులు**

**చెప్పినా మొండివైకరి ప్రదర్శిస్తున్న వైనం...**

**అభివృద్ధి పనులకు ఆటంకం కలిగిస్తున్న ఆ కుటుంబంపై**

**చర్యలు తీసుకోవాలని కోరుతున్న కాలనీవాసులు**

కాప్రా ఆగస్టు 7(ప్రజాకలం న్యూస్)

కాప్రా మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని సాకేత్ వొర్ల ఎంక్లేవ్ కాలనీలో గతంలో ప్రభుత్వం వేసిన సీసీ రోడ్డు గుంతలు ఏర్పడడంతో ప్రభుత్వ అధికారులు మరమ్మతు పనులు చేపట్టారు. సీసీ రోడ్డుకు అధికారులు మరమ్మతులు చేస్తుండడంతో స్థానికంగా నివసించే ఓ కుటుంబం అడ్డుపడుతుందని కాలనీవాసులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. రోడ్డును సైతం కబ్జా చేయాలనే దురుద్దేశంతో అభివృద్ధి పనులను అడ్డుకుంటున్నారని స్థానికులు మండిపడుతున్నారు.కాలనీవాసులు నచ్చజెప్పినా చివరికి అధికారులు బ్రతిమాలినా ససేమిరా అంటున్న ఆ కుటుంబం మొండిగా ప్రవర్తిస్తుందని, ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పనులను అడ్డుకోవడానికి ఆ కుటుంబానికి ఏమి హక్కు ఉంటుందని, అధికారులు వారిపై చర్యలు తీసుకొని రోడ్డుకు మరమ్మతులు చేయాలని కాలనీవాసులు కోరుతున్నారు.

# బీరంగూడకు రూ.8.55 కోట్ల వరం

**-బీరంగూడకు రూ.8.55 కోట్ల అభివృద్ధి పనులకు శ్రీకారం**

పటాన్‌చెరు, ఆగస్టు 7 (ప్రజా కలం) ప్రతినిధి

బీరంగూడ డివిజన్‌లో మౌలిక వసతుల అభివృద్ధికి మరో ముందడుగు పడింది.ప్రజలకు మెరుగైన రహదారులు, మురుగు కాలువలు,తాగునీటి సౌకర్యం, వీధి దీపాలు అందించేందుకు రూ.8.55 కోట్ల వ్యయంతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి, మాజీ మున్సిపల్




ఉపాధ్యక్షుడు నందారం నరసింహా గౌడ్ శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే తమ లక్ష్యమని,ప్రజా సమస్యల పరిష్కారానికే అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు.వేగంగా విస్తరిస్తున్న నూతన కాలనీల అవసరాలను దృష్టిలో ఉంచుకుని రహదారులు,మురుగు కాలువలు,తాగునీటి సరఫరా, వీధి దీపాల ఏర్పాటు వంటి పనులకు ప్రణాళికాబద్ధంగా నిధులు కేటాయిస్తున్నట్లు చెప్పారు.ప్రతి కాలనీ సమగ్ర అభివృద్ధే తమ ధ్యేయమని, ప్రజలకు ఇబ్బందులు లేకుండా దశలవారీగా అన్ని సౌకర్యాలు కల్పిస్తామని పేర్కొన్నారు. మాజీ మున్సిపల్ ఉపాధ్యక్షుడు నందారం నరసింహ గౌడ్ మాట్లాడుతూ బీరంగూడ డివిజన్ అభివృద్ధికి ఎమ్మెల్యే ప్రత్యేక చొరవ తీసుకుంటున్నారని, ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని తెలిపారు.అభివృద్ధి పనులు నాణ్యతతో,నిర్ణీత గడువులో పూర్తిచేయాలని సంబంధిత అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. నిరంతరం క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని అభివృద్ధి పనులకు రూపకల్పన చేస్తున్నామని, ప్రజల సహకారంతో పటాన్‌చెరు నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు కృషి కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఆయా కాలనీల ప్రజలు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి,నందారం నరసింహ గౌడ్‌కు ఘన స్వాగతం పలికారు.కార్యక్రమంలో అమీన్పూర్ మున్సిపల్ డిప్యూటీ కమిషనర్ ప్రదీప్ కుమార్, అమీన్పూర్ మాజీ ఎంపీపీ దేవానందం,మాజీ జెడ్పీటీసీ సుధాకర్ రెడ్డి, నీటిపారుదల శాఖ సహాయ ఇంజనీర్ వెంకటరమణ, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు కృష్ణ, మల్లేష్, గోపాల్, బాశెట్టి కృష్ణ, తులసి రెడ్డి, జగదీష్, దాసు, శ్రీనివాసరెడ్డి, సునీత, శ్రీకాంత్, గోవింద్, జ్ఞానేశ్వర్, పార్టీ నాయకులు, కార్యకర్తలు, కాలనీవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# చేనేత వృత్తి కాదు...మన సంస్కృతి

**నాగరికతకు ప్రతీక-మంత్రి సీతక్క**

**పీపుల్స్ ప్లాజాలో చేనేత వస్త్ర ప్రదర్శన**

**చేనేత అభివృద్ధి, సంక్షేమానికి రూ.1300 కోట్లు**

**ఇందిరమ్మ చీరలతో నేతన్నకు ఉపాధి**



హైదరాబాద్,
ఆగస్టు 7 ప్రజాకలం ప్రతినిధి

వ్యవసాయం తర్వాత నేతన్నలు అనునిత్యం కష్టపడతారనిరాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క స్పష్టం చేశారు. జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా శుక్రవారం నెక్లెస్ రోడ్‌లోని పీపుల్స్ ప్లాజాలో ఏర్పాటు చేసిన చేనేత ఎగ్జిబిషన్‌ను ఆమె ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వ్యవసాయం, చేనేత రంగాలు తెలంగాణ ప్రభుత్వానికి రెండు కళ్ళలాంటివని పేర్కొన్నారు. చేనేత కేవలం వృత్తి మాత్రమే కాదని, అది మన సంస్కృతి, సంప్రదాయాలు, నాగరికతకు ప్రతీక అని వెల్లడిం చారు.

ఇందిరమ్మ చీరల ఆర్డర్లతో వేలాది నేత కుటుంబాలకు నిరంతర ఉపాధి కల్పిస్తున్నామని స్పష్టం చేశారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల యూనిఫామ్ వస్త్రాన్ని చేనేత కార్మికుల నుంచే కొనుగోలు చేస్తున్నామని వివరించారు. చేనేత రంగ అభివృద్ధి, సంక్షేమం కోసం ప్రభుత్వం ఇప్పటివరకు రూ. 1,300 కోట్ల నిధులు ఖర్చు చేసిందని వెల్లడించారు. తాను స్వయంగా చేనేత చీరలే ధరిస్తానని మంత్రి తెలిపారు. ప్రజలు వారంలో రెండు రోజులైనా చేనేత వస్త్రాలు ధరించి నేతన్న లను ప్రోత్సహించాలని సూచించారు.

పోటీలు..సన్మానం,అవార్డులు...

రాష్ట్ర ప్రభుత్వం చేనేత వస్త్రాలను ప్రోత్సహిస్తుందని తెలంగాణ రాష్ట్ర హ్యాండ్లూమ్స్ అండ్ టెక్స్టైల్ కార్పొరేషన్ (టెస్కో) చైర్మన్ దూడం వెంకట రమణ స్పష్టం చేశారు.చేనేత వస్త్రప్రదర్శ పది రోజుల పాటు కొనసాగు తుందన్నారు. ఈ వస్త్ర ప్రదర్శనలో మన రాష్ట్రంతో పాటు ఇతర రాష్ట్రాలకు చెంది కళాకారుల తప చేతి పనిని ప్రదర్శిస్తున్నారని స్పష్టం చేశారు.

అందులో భాగంగా చేనేత కళాకారులకు పోటీలను నిర్వహిం చి 30 మంది కళా కారులకు కొండా లక్ష్మన్ బాబు పేరుతో అవార్డులు, సన్మానం చేస్తామని వెల్లడించారు.ఈ కార్యక్రమంలో మం త్రి తుమ్మల నాగేశ్వర్ రావు, ,తెలంగాణ రాష్ట్ర చేనేత కార్మికులు వినియోగదారులు తదితరులు పాల్గొన్నారు..




# ఎమ్మార్పీఎస్ పోరాట ఫలితమే ఆరోగ్యశ్రీ పథకం

**-రాగల్ల ఉపేందర్ మాదిగ**

**- మహేశ్వరంలో ఆరోగ్యశ్రీ సాధన దినోత్సవం నిర్వహించిన ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్పీ నేతలు**



మహేశ్వరం, ఆగస్టు 07:(ప్రజా కలం)

ఆరోగ్యశ్రీ పథకం ఎమ్మార్పీఎస్ ఉద్యమ ఫలితంగానే ఆవిర్భవించిందని, పేదలకు కార్పొరేట్ స్థాయి వైద్యాన్ని ఉచితంగా అందించిన ఈ పథకం దేశానికే ఆదర్శంగా నిలిచిందని ఎమ్మార్పీస్ రంగారెడ్డి జిల్లా ఇంచార్జి రాగల్ల ఉపేందర్ మాదిగ అన్నారు. మహేశ్వరం మండలం తుక్కుగూడలోని కళాశ్రీ గార్డెన్స్‌లో ఆరోగ్యశ్రీ సాధన దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్పీ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించారు.

ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న రాగల్ల ఉపేందర్ మాదిగ మాట్లాడుతూ 2004లో నిరుపేద చిన్నారులకు ఉచిత గుండె శస్త్రచికిత్సలు చేయించాలని మందకృష్ణ మాదిగ నాయకత్వంలో ఎమ్మార్పీఎస్ చేపట్టిన ఉద్యమాల ఫలితంగానే అప్పటి ప్రభుత్వం స్పందించి ఆరోగ్యశ్రీ పథకాన్ని అమలు చేసిందని పేర్కొన్నారు. ఈ పథకం ద్వారా కుల, మత భేదాలకు అతీతంగా అన్ని వర్గాల పేదలకు ఉచిత కార్పొరేట్ వైద్యం అందుతోందని తెలిపారు. ప్రపంచంలోనే అరుదైన ప్రజా సంక్షేమ పథకాలలో ఆరోగ్యశ్రీ ఒకటిగా నిలిచిందని, దాని స్ఫూర్తితోనే కేంద్ర ప్రభుత్వం ఆయుష్మాన్ భారత్ పథకాన్ని అమలు చేసిందని ఆయన అభిప్రాయపడ్డారు. పేదరికం, దోపిడీ, వివక్ష లేని సమాజ నిర్మాణం కోసం భవిష్యత్తులో కూడా మందకృష్ణ మాదిగ నాయకత్వంలో జరిగే ప్రజా పోరాటాలకు అన్ని వర్గాల ప్రజలు అండగా నిలవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్పి మాజీ జిల్లా అధ్యక్షుడు రావుగాళ్ల బాబూ మాదిగ, దీక్షా రాష్ట్ర నాయకుడు కటికల శ్రీహరి ముదిరాజ్, ఎంఎస్పి మండల అధ్యక్షుడు ఎర్ర కృష్ణ మాదిగ, ఎమ్మార్పీఎస్ మాజీ మండల అధ్యక్షుడు ఎర్ర గణేష్ మాదిగ, ఎం ఎస్ ఎఫ్ జిల్లా నాయకుడు ఎర్ర నవీన్ కుమార్ మాదిగ, వంక ఉపేందర్ మాదిగ, చిత్రం హరీష్ మాదిగ, వంక ప్రభాకర్ మాదిగతో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఫలహార బండి ఊరేగింపులో పాల్గొని ప్రత్యేక పూజలు

**టీపీసీ కార్యదర్శి యెలిమేటి అమరేందర్ రెడ్డి**

మహేశ్వరం, ఆగస్టు 07, (ప్రజా కలం):

మహేశ్వరం నియోజకవర్గం, బాలాపూర్ డివిజన్‌లో ఎల్లమ్మ తల్లి ఆలయ రోషన్ ఆధ్వర్యంలో యూత్ అసోసియేషన్ భూలక్ష్మి అమ్మ యూత్ అసోసియేషన్ సంయుక్తంగా నిర్వహించిన తొట్టెలు, ఫలహార బండి ఊరేగింపు కార్యక్రమం ఘనంగా జరిగింది.

ఈ ఊరేగింపులో టీపీసీసీ కార్యదర్శి యెలిమేటి అమరేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని ఎల్లమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి ఆశీస్సులు అందరిపై ఉండాలని మొక్కులు చెల్లించారు.ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ బండారి మనోహర్, ఎస్సీ సెల్ చైర్మన్ క్యారగారి శ్రీధర్, వంగేటి మధుసూదన్ రెడ్డి, గొరిగె శ్రీశైలం, రావుల లింగం, చింతకింది భాను, చింతపట్ల పవన్, మేకల



కిరణ్, నిశ్చల్, బి. రాఘవేంద్ర, ఎస్. రాములు, బి. శివ, ఎ. వంశీ, ఆర్. సాయి, మేకల మహేందర్, రాజేష్ ఠాకూర్, భాను చందర్ తదితరులు పాల్గొన్నారు.ఊరేగింపు సందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారికి నైవేద్యాలు సమర్పించారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసిన యూత్ అసోసియేషన్ సభ్యులను అమరేందర్ రెడ్డి అభినందించారు.

# మహేశ్వరంలో ఘనంగా గోరింటాకు వేడుకలు

**మహిళలతో కలిసి సంబరాలు చేసుకున్న మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి**

మహేశ్వరం, ఆగస్టు 7:(ప్రజా కలం)ఆషాడ మాసం సందర్భంగా మహేశ్వరం నియోజకవర్గ మహిళలు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గోరింటాకు వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మహిళలతో కలిసి సంబరాల్లో పాల్గొన్నారు.నియోజకవర్గం నలుమూల నుంచి పెద్ద సంఖ్యలో తరలివచ్చిన మహిళలు సంప్రదాయ దుస్తుల్లో ఆటపాటలు, జానపద గీతాలతో వాతావరణాన్ని ఉత్సాహంగా మార్చారు. అందరూ గోరింటాకు పెట్టుకుని పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకున్నారు.ఈ సందర్భంగా సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించడంలో మహిళల పాత్ర ఎంతో గొప్పది. ఇలాంటి సాంస్కృతిక కార్యక్రమాలు మహిళల మధ్య ఆత్మీయత, ఐక్యతను మరింత బలోపేతం చేస్తాయి" అని అన్నారు.

ఈ కార్యక్రమం విజయవంతం కావడంలో మీర్పేట్ మాజీ మహిళా అధ్యక్షురాలు జమాల్పూర్ సునీత బాలరాజ్, సుర్వీలత, బిందు కీలక పాత్ర పోషించి ఏర్పాట్లను దగ్గరుండి పర్యవేక్షించారు.ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలోని పలువురు మహిళా నాయకులు, కార్యకర్తలు, వందలాది మంది మహిళలు పాల్గొన్నారు.

# బీడీఎల్‌లో క్షిపణి విజ్ఞానం

**- బీడీఎల్‌లో గీతం విద్యార్థులకు**

**క్షిపణి సాంకేతికతపై ప్రత్యక్ష అవగాహన..**

పటాన్‌చేరు, ఆగస్టు 7 (ప్రజా కలం) ప్రతినిధి

భారత రక్షణ రంగంలో స్వదేశీ క్షిపణి తయారీ సాంకేతికతను ప్రత్యక్షంగా తెలుసుకునేందుకు గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం విద్యార్థులు భానూరులోని




భారత్ డైనమిక్స్ లిమిటెడ్‌ను సందర్శించారు.ఈ పారిశ్రామిక పర్యటన విద్యార్థులకు రక్షణ సాంకేతికతపై విలువైన అనుభవాన్ని అందించింది. హైదరాబాద్ గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం కంప్యూటర్ సైన్స్ అండ్ సిస్టమ్స్ ఇంజినీరింగ్,కృత్రిమ మేధస్సు, దత్తాంశ శాస్త్ర విభాగాల విద్యార్థులు భానూరులోని భారత్ డైనమిక్స్ లిమిటెడ్‌లో ఆధునిక క్షిపణి సాంకేతికతపై అవగాహన పొందారు. మిలన్, కొంకుర్స్, ఇన్వర్, కొంకుర్స్, ఎం, అస్త్రా క్షిపణి వ్యవస్థలు, క్షిపణి తయారీ, అమరిక విధానాలను ప్రత్యక్షంగా పరిశీలించారు. ప్రొఫెసర్ ప్రీతి అంబరీష్ పర్వేకర్ సమన్వయంతో నిర్వహించిన ఈ పర్యటనలో 30 మంది విద్యార్థులు,ఐదుగురు అధ్యాపకులు పాల్గొన్నారు. మానవ వనరుల విభాగాధిపతి గంగయ్య స్వాగతం పలకగా శిక్షణాధికారి నందని అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డిప్యూటీ జనరల్ మేనేజర్ నాగేశ్వరరావు దేశ రక్షణలో సాంకేతిక నైపుణ్యం,క్రమశిక్షణ ప్రాముఖ్యతను వివరించారు. పర్యటన విజయవంతం కావడంతో బీడీఎల్ యాజమాన్యానికి గీతం బృందం కృతజ్ఞతలు తెలిపింది.

# పరమత సేవలో మరోసారి ఎమ్మెల్యే పెద్దమనసు

**- పటాన్‌చెరులో పరమత**

**సామరస్యానికి ఎమ్మెల్యే నిదర్శనం..**

పటాన్‌చెరు, ఆగస్టు 7 (ప్రజా కలం) ప్రతినిధి

పరమత సామరస్యాన్ని చాటుతూ పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి, పటాన్‌చెరు డివిజన్‌లోని ఎంజీ రోడ్డులో ఉన్న చోటి మసీదు



ప్రార్థనా స్థలానికి రూ.25 లక్షల సొంత నిధులతో నిర్మించిన భవనాన్ని శుక్రవారం ముస్లిం మత పెద్దల సమక్షంలో ప్రారంభించి మసీదు నిర్వాహకులకు అందజేశారు. ఈ సందర్భంగా మహిపాల్‌రెడ్డి మాట్లాడుతూ,అన్ని మతాలు శాంతి, ప్రేమ,మానవత్వాన్నే బోధిస్తాయని,మతాలకు అతీతంగా ప్రతి ఒక్కరి మనోభావాలను గౌరవించడం తన బాధ్యత అని తెలిపారు పరమత సామరస్యాన్ని పెంపొందించేందుకు ఇప్పటివరకు సొంత నిధులతో 200కు పైగా దేవాలయాలు, 100కు పైగా మసీదులు, 20కు పైగా చర్చిల నిర్మాణానికి సహకరించినట్లు పేర్కొన్నారు. ముస్లిం మత పెద్దలు లియాకత్ అలీ, మొయిజుర్ రెహ్మాన్, ఇక్బాల్,వెంకటేష్ ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

# సైబర్ నేరగాళ్ల పై పోలీసుల ఉక్కుపాదం

**- 15 రాష్ట్రాల్లో విస్తృత దాడులు..**

**- 70 ఎఫ్ఐఆర్లు,49 మంది అరెస్టు**

**- రూ.98.89 లక్షల స్వాధీనం**

**- మొబైల్ ఫోన్లు,ల్యాప్ టాప్లు,డెబిట్ కార్డులు సీజ్**




హైదరాబాద్, ఆగస్టు 7 ప్రజాకలం ప్రతినిధి

సైబర్ నేరగాళ్లపై హైదరాబాద్ పోలీసులు ఉక్కుపాదం మోపారు. జూలై నెలలో నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్ ఫిర్యాదుల ఆధారంగా ప్రత్యేక ఆపరేషన్ చేపట్టినట్లు క్రైమ్ పోలీస్ లు తెలిపారు. 70 ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసిన పోలీసులు, దేశవ్యాప్తంగా 15 రాష్ట్రాల్లో విస్తృత దాడులు నిర్వహించి 49 మంది నిందితులను అరెస్ట్ చేశామన్నారు. బాధితులు కోల్పోయిన నగదులో రూ. 98.89 లక్షలను రికవరీ చేసి రిఫండ్ ఇచ్చామన్నారు. నిందితుల నుంచి మొబైల్ ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు, డెబిట్ కార్డులు తదితర సామగ్రిని స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు స్పష్టం చేశారు. ట్రేడింగ్, సోషల్ మీడియా, డిజిటల్ అరెస్ట్, ఏపీకే మోసాల పట్ల ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని, సైబర్ మోసానికి గురైతే తక్షణమే 1930 హెల్ప్‌లైన్‌ను లేదా అధికారిక వెబ్‌సైట్ http://www.cybercrime.gov.in ద్వారా పిర్యాధు చేయాలని సూచించారు.

# ప్రజాసమస్యల పరిష్కారమే మా లక్ష్యం

## - బిఆర్ఎస్ ఏజెంట్ లా వ్యవహరిస్తున్న డీసీ సమ్మయ్య
## - ఏఐసీసీ కో-ఆర్డినేటర్ బోయపల్లి రాఘవేందర్ రెడ్డి ఆగ్రహం



మహేశ్వరం, ఆగస్టు 07, (ప్రజా కలం)

మహేశ్వరం నియోజకవర్గం బడంగ్‌పేట్ సర్కిల్ పరిధిలోని అల్మాస్‌గూడ శ్రీహిల్స్ కాలనీలో రూ.12 లక్షల వ్యయంతో మంజూరైన సీసీ రోడ్డు పనులను కాలనీవాసుల విజ్ఞప్తి మేరకు ప్రారంభించడం జరిగిందని అఖిల భారత కాంగ్రెస్ కమిటీ ఏఐసీసీ విచార్ విభాగ్ కో–ఆర్డినేటర్ బోయపల్లి రాఘవేందర్ రెడ్డి తెలిపారు.గురువారం కాలనీలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించడం ప్రజాప్రతినిధుల బాధ్యత అన్నారు. ప్రజల కోరిక మేరకు అభివృద్ధి పనులు చేపట్టడం తప్పా అని బడంగ్‌పేట్ డీసీ సమ్మయ్యను ప్రశ్నించారు.డీసీ సమ్మయ్య ప్రోటోకాల్ గురించి మాట్లాడుతున్నారని, ముందుగా ఆయనే పరిపాలనా విధానాలను పాటిస్తున్నారా అని నిలదీశారు. ఏ అభివృద్ధి పనికైనా అధికా రికంగా శిలాఫలకం ఏర్పాటు చేసి, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులకు సమాచారం ఇవ్వడం ప్రోటోకాల్ అని పేర్కొన్నారు. కానీ ఈ పనులకు శిలాఫలకం ఏర్పాటు చేయకుండా, స్థానిక నాయకులకు సమాచారం ఇవ్వకుండా అధికారులు వ్యవహరించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు.అలాగే రంగారెడ్డి జిల్లా ఇన్‌చార్జి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు కి ఈ పనుల గురించి అధికారికంగా సమాచారం ఇచ్చారా అని డిమాండ్ చేశారు. అధికారంలో ఉన్న కాంగ్రెస్ నాయకులకు సమాచారం ఇవ్వకుండా ఇప్పుడు ప్రోటోకాల్ పేరుతో మాట్లాడటం సరికాదన్నారు.స్థానిక బిఆర్ఎస్ నాయకులు ఇచ్చే ప్రతిపాదనలు, వారి రాజకీయ ప్రయోజనాలకు అనుకూలంగా డీసీ వ్యవహరిస్తున్నారనే అభిప్రాయం ప్రజల్లో ఉందని అన్నారు. కాంగ్రెస్ నాయకులు ప్రజా సమస్యల పరిష్కారం కోసం పనిచేస్తుంటే దాన్ని జీర్ణించుకోలేక అధికారులు వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. బి ఆర్ ఎస్ నాయకుల ఓటమి తర్వాత కూడా కొందరు అధికారులు అదే పాత వైఖరిని కొనసాగించడం బాధాకరమన్నారు. కాలనీవాసులు సమస్యలు చెబితే వాటిని ప్రభుత్వానికి తెలియజేసి పరిష్కరించడం తమ బాధ్యత అని స్పష్టం చేశారు. అధికారుల నిర్లక్ష్యం వల్ల అభివృద్ధి ఆలస్యమవుతున్న సమయంలో ప్రజల పక్షాన నిలబడటం తప్పు



కాదన్నారు.చివరగా కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రజా సంక్షేమానికి అడ్డంకిగా వ్యవహరించే అధికారుల తీరును సహించబోమని హెచ్చరించారు. డీసీ సమ్మయ్య వెంటనే తన వైఖరిని మార్చుకుని ప్రోటోకాల్ ప్రకారం జిల్లా ఇన్‌చార్జి మంత్రి కి, స్థానిక నాయకులకు సమాచారం అందిస్తూ అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని డిమాండ్ చేశారు.



# ఆరోగ్యశ్రీ స్ఫూర్తి ప్రధాత పద్మశ్రీ మందకృష్ణ మాదిగ

## మేడ్చల్ జిల్లా ఎమ్మార్పీఎస్ ఇంచార్జి తిప్పారపు లక్ష్మణ్ మాదిగ,

మేడ్చల్ మల్కాజ్ గి ఆగస్టు 7(ప్రజాకలం న్యూస్)

మల్కాజ్గిరి మండల కేంద్రంలో ఆరోగ్యశ్రీ సాధన దినోత్సవాన్ని ఎమ్మార్పీఎస్ నాయకులు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గుండె జబ్బు పిల్లలకు రాష్ట్ర ప్రభుత్వమే ఉచితంగా ఆరోగ్య సేవలు అందించాలని హైద్రాబాద్ కేంద్రంగా ఆనాటి స్వర్గీయ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి ప్రభుత్వంతో ఎమ్మార్పీఎస్ అధినేత మందకృష్ణ మాదిగ చేసిన పోరాట ఫలితమే ఆరోగ్యశ్రీ పథకానికి దారి తీసింది అన్నారు. నాయకులు రామచంద్రన్ మాదిగ మాట్లాడుతూ స్వయానా ఆనాటి స్వర్గీయ రాష్ట్ర ముఖ్యమంత్రి రాజశేఖర రెడ్డి అసెంబ్లీలోనే ఆరోగ్య శ్రీ పథకానికి ప్రధాన కారణం మందకృష్ణ మాదిగ అని స్వయానా ఆనాటి చెప్పడం జరిగిందని గుర్తు చేశారు. ఎమ్మార్పీఎస్ మేడ్చల్ జిల్లా మాజీ అధ్యక్షులు పంగ ప్రణయ్ కుమార్ మాదిగ మాట్లాడుతూ పద్మశ్రీ మందకృష్ణ మాదిగ చేసిన ఒక విరోచితమైన పోరాట ఫలితమే నేడు దేశవ్యాప్తంగా ఆయుష్మాన్ భారత్ పేరుతో ఆరోగ్యశ్రీ పథకం లాంటి వైద్యం పేదలందరికీ అందుతుందన్నారు.ఆనాడు చిన్నపిల్లలకు ఉచితంగా గుండె ఆపరేషన్లు చేయించాలని ఆలోచనతోటి మందకృష్ణ మాదిగ చేసిన పోరాట ఫలితంగానే నేడు ఆరోగ్యశ్రీ పథకం రూపుదాల్చిందన్నారు.రాబోయే రోజుల్లో కూడా ప్రతి పేదవాడికి ఈ భారతదేశంలో కార్పోరేట్ వైద్యం తరహాలో ఉచిత వైద్యం కోసం పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ఆధ్వర్యంలో ప్రజా ఉద్యమాలు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఇంచార్జి తిప్పారపు లక్ష్మణ్ మాదిగ,జాతీయ నాయకులు కేశపాగా రాంచంధర్ మాదిగ,రాష్ట్ర నాయకులు బచ్చుల కూర స్వామి మాదిగ,మనోహర్, అంజి మాదిగ, జిల్లా మాజీ అధ్యక్షులు పంగ ప్రణయ్ మాదిగ, జిల్లా నాయకులు బత్తిని శివ మాదిగ,విహెచ్ పిఎస్ నాయకులు వినయ్ మాదిగ తదితరులు పాల్గొన్నారు.

# తుమ్మలూరు గ్రామ కార్యదర్శిపై అవినీతి ఆరోపణలు

## - డీఎల్‌పీఓ విచారణ - గ్రామ పంచాయతీ కార్యదర్శి అలివేలుపై అవినీతి, అక్రమాల ఆరోపణలు పై అధికారులకు నివేదిక ఇవ్వనున్న డీఎల్‌పీఓ







మహేశ్వరం, ఆగస్టు 07, (ప్రజా కలం)

రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం తుమ్మలూరు గ్రామ పంచాయతీ కార్యదర్శి అలివేలుపై గ్రామ సర్పంచ్, వార్డు సభ్యులు, గ్రామస్తులు చేసిన అవినీతి, అక్రమాల ఆరోపణలపై జిల్లా స్థానిక సంస్థల పంచాయతీ అధికారి (డీఎల్‌పీఓ) సాంబిరెడ్డి శుక్రవారం గ్రామంలో విచారణ నిర్వహించారు. ఫిర్యాదులో పేర్కొన్న అంశాలను పరిశీలించిన డీఎల్‌పీఓ.. పూర్తి నివేదికను ఉన్నతాధికారులకు సమర్పించి వారి ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.గ్రామ పంచాయతీ ప్రభుత్వ భూముల్లో అక్రమ నిర్మాణాలు జరుగుతున్నప్పటికీ గ్రామ కార్యదర్శి అలివేలు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని గ్రామస్తులు ఆరోపించారు.

పలుమార్లు ఫిర్యాదు చేసినా స్పందించకుండా అక్రమ నిర్మాణాలకు ప్రోత్సాహం కల్పిస్తున్నారని విమర్శించారు .గ్రామంలో ఉన్న వైకుంఠధామం సూచిక బోర్డుని ఎవరికి సమాచారం ఇవ్వకుండా తొలగించి మరో ప్రాంతంలో ఏర్పాటు చేశారని, ఆ స్థలంలో ప్రైవేట్ వెంచర్‌కు అనుకూలంగా వ్యవహరించారనే ఆరోపణలు కూడా గ్రామస్తులు చేశారు. గ్రామ పంచాయతీ వ్యవహారాల్లో కార్యదర్శి భర్త జోక్యం చేసుకుంటున్నారని, అధికారిక వ్యవహారాల్లో ఆయన పెత్తనం సాగుతోందని ఆరోపించారు.ఈ వ్యవహారంపై గ్రామ పాలకవర్గం, గ్రామస్తులు డీపీఓ, డీఎల్‌పీఓ తదితర అధికారులకు ఫిర్యాదు చేయడంతో డీఎల్‌పీఓ సాంబిరెడ్డి గ్రామానికి చేరుకుని సంబంధిత ప్రాంతాలను పరిశీలించారు.అక్రమ నిర్మాణాలపై నిబంధనల ప్రకారం చర్యలు చేపట్టాలని గ్రామ కార్యదర్శిని ఆదేశించినట్లు తెలిసింది.

ఈ సందర్భంగా డీఎల్‌పీఓ మాట్లాడుతూ.. గ్రామ కార్యదర్శిపై వచ్చిన అన్ని ఆరోపణలపై సమగ్ర విచారణ నిర్వహించి నివేదికను పై అధికారులకు అందజేస్తామని, వారి ఆదేశాల మేరకు తదుపరి చర్యలు ఉంటాయని తెలిపారు.ఇదిలా ఉండగా, గ్రామంలో ఇన్ని ఆరోపణలు, ఫిర్యాదులు వచ్చినప్పటికీ ఎంపీడీఓ స్థాయిలో చర్యలు ఎందుకు తీసుకోలేదన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గ్రామ కార్యదర్శిని విధుల నుంచి తొలగించే వరకు తమ పోరాటం కొనసాగుతుందని గ్రామస్తులు హెచ్చరించారు.

### గ్రామ కార్యదర్శి అలివేలు వివరణ

తాను ఎలాంటి అక్రమాలకు పాల్పడలేదని గ్రామ కార్యదర్శి అలివేలు స్పష్టం చేశారు. అక్రమ నిర్మాణాల విషయంలో సంబంధిత వారికి నోటీసులు జారీ చేశామని, ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులకు సమాచారం అందిస్తూ వారి ఆదేశాల మేరకే విధులు నిర్వహించానని తెలిపారు. తనపై వచ్చిన ఆరోపణలు వాస్తవం కాదన్నారు.



### ఎంపీఓ రవీందర్ స్పందన

తన దృష్టికి వచ్చిన ప్రతి అక్రమ నిర్మాణంపై గ్రామ కార్యదర్శికి సమాచారం ఇచ్చి నోటీసులు జారీ చేయాలని ఆదేశించినట్లు ఎంపీఓ రవీందర్ తెలిపారు. గ్రామ పాలకవర్గం, గ్రామ కార్యదర్శి చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని సూచించామని, ఈ వ్యవహారంలో తన వ్యక్తిగత ప్రమేయం లేదని చెప్పారు. ఈ యొక్క కార్యక్రమంలో గ్రామ పెద్దలు అమనగంటి ప్రశాంత్ రెడ్డి, చెన్నరెడ్డి మహేందర్ రెడ్డి, దీనెల్,గోల్కొండ రఘువీర్,రాంచేంద్రరెడ్డి ,రాజమౌని నారాయణ, శ్రీశైలం, దుర్గాప్రసాద్, గట్టగల్ల శ్రీకాంత్, రమేష్, మల్లేష్,దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# బోనాల సందర్భంగా నూతన పవర్ బోర్ ప్రారంభం

మల్కాజిగిరి,ఆగస్టు07,(ప్రజా కలం ప్రతినిధి)

ఈస్ట్ ఆనంద్‌బాగ్ డివిజన్ పరిధిలోని కస్తూర్బా నగర్ అమ్మవారి ఆలయం వద్ద బోనాల పండుగ సందర్భంగా స్థానిక ప్రజలకు తాగునీటి సౌకర్యం కల్పించేందుకు నూతనంగా



ఏర్పాటు చేసిన పవర్ బోర్‌ను మాజీ కార్పొరేటర్ వై. ప్రేమ్‌కుమార్ శుక్రవారం కాలనీ వాసులతో కలిసి కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రేమ్‌కుమార్ మాట్లాడుతూ, బోనాల పండుగకు వచ్చే భక్తులకు, స్థానిక ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సౌకర్యం అందుబాటులో ఉండేలా పవర్ బోర్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు ఎల్లప్పుడూ కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బాబు, చుంకూ శ్రీనివాస్, బషీర్, గఫూర్, కుద్దుస్, నజీద్‌జ్వాన్, సజీర్, కిరణ్, కృష్ణమూర్తి, సువర్ణ, శాంతభాయి, చంద్రకళ, బాలమణి, మంజుల, మాధవి తదితరులు పాల్గొన్నారు.

# స్కిల్ యూనివర్సిటీ ద్వారా యువతకు ఉద్యోగాలు

## - జిహెచ్ఎంసి ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయమే లక్ష్యం
## - ప్రజాసేవ కోసమే రాజకీయాల్లోకి వచ్చా
## - మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి

మహేశ్వరం, ఆగస్టు 07, ప్రజా కలం:

“సేవకుడే నాయకుడు” అన్న దివంగత మాజీ రాష్ట్రపతి డా. ఏ.పి.జే. అబ్దుల్ కలాం గారి స్ఫూర్తితోనే తాను రాజకీయాల్లోకి వచ్చానని మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్చార్జి, మాజీ ఎమ్మెల్యే కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి అన్నారు. శుక్రవారం సరూర్‌నగర్‌లోని ఆర్కేపురం డివిజన్‌లో కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి బూత్ స్థాయి నాయకులు, కాంగ్రెస్ కార్యకర్తలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కుటుంబాల్లో సమస్యలు లేకుండా ఉండాలంటే ప్రతి ఇంట్లోని యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు దక్కాలి అని అన్నారు. భారత్ ఫ్యూచర్ సిటీలో ఏర్పాటు చేయనున్న స్కిల్ యూనివర్సిటీ ద్వారా కాలనీల్లో ఉన్న నేటి తరాన్ని గుర్తించి, వారికి అవసరమైన నైపుణ్య శిక్షణ ఇచ్చి భవిష్యత్ ను తీర్చిద్దాల్సిన అవసరం ఉందని కెఎల్ఆర్ అభిప్రాయపడ్డారు.రాబోయే జిహెచ్ఎం, ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థుల విజయమే ధ్యేయంగాలి ప్రతి బూత్ లెవెల్ ఏజెంట్ కష్టపడాలని పిలుపునిచ్చారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజాపాలనలో అన్ని వర్గాల ప్రజలకు అందుతున్న సంక్షేమ పథకాలను ఇంటింటికి తీసుకెళ్లాలని కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు విస్తృత ప్రచారం చేయాలని సూచించారు. సమావేశంలో పలువురు డివిజన్, బూత్ స్థాయి నాయకులు పాల్గొన్నారు.



# కవితతోనే సామాజిక న్యాయం సాధ్యం

## తెలంగాణ రథసారధిగా కవిత-రూప్ సింగ్
## కవిత పై ప్రజలకు నమ్మకం ఉంది-ఇస్మాయిల్

హైదరాబాద్, ఆగస్టు 7 ప్రజాకలం ప్రతినిధి

తెలంగాణలో సామాజిక న్యాయం కల్వకుంట్ల కవిత ద్వారానే సాధ్యమని తెలంగాణ రక్షణ సేన నాయకులు రూప్ సింగ్, ఇస్మాయిల్ తెలిపారు.శుక్రవారం బంజారాహిల్స్ టీఆర్ఎస్ భవన్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. సామాజిక న్యాయ తెలంగాణ రథసారధిగా ఆమెనే ఉండాలని ప్రజలు గట్టిగా నమ్ముతున్నారని వెల్లడించారు. సరూర్ నగర్ స్టేడియంలో జరిగిన సామాజిక న్యాయ తెలంగాణ సంకల్ప సభ విజయవంతమైందని, గత బీఆర్ఎస్, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వాలు బీసీలను ఓటు బ్యాంకుగా మాత్రమే చూస్తున్నాయని విమర్శించారు. సామాజిక న్యాయ సాధనలో ఇది తొలి అడుగు మాత్రమేనని, కవిత నాయకత్వంలో భవిష్యత్తులో మరిన్ని కార్యక్రమాలు చేపడతామని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో పార్టీ నేత రవిచంద్ర పాల్గొన్నారు..




Corporate .Office :1-7-511/4, Gemini Colony, Near Pochamma Temple, Zamistanpur, HYDERABAD, TELANGANA, 500020 Cell: 9010972526

Printed, Published and owned by **KALAKONDA RAMAKRISHNA**, Printed at **TEJOMAI PUBLICATION**, H.No. 2-24/98/BLN Colony, IDA Uppal Medchal-Malkajgiri, Hyderabad, Telangana-50013
Published from H.No.10-1-7, Bada Bazar, Beside Pothalingaiah Temple, Azam Raod, Nizamabad,TS -503001 TELANGANA - 503001.
Editor: **KALAKONDA RAMAKRISHNA**, **PRGI.No. TELTEL/2010/33275,** Cell: 90109 72526, Email:prajakalam2010@gmail.com